

# గురునానక్

జాతీయ జీవిత గ్రంథమాల

# గురునానక్

ఆంగ్లము :

డాక్టర్ గోపాల్‌సింగ్

తెలుగు :

వేమరాజు భానుమూర్తి

డాక్టర్ కె. వీరభద్రరావు

నేషనల్ బుక్ ట్రస్ట్, ఇండియా

న్యూఢిల్లీ

# సందేశము

గురునానక్ వంటి సాధువులు, ఈ దుఃఖమయ జగత్తులో బాధితమానవాళికి తమ త్యాగము, ఆదర్శములతో సత్పథమును చూపుటకై అవతరించినవారు. భారతదేశము గొప్పవిపత్తులను ఎదుర్కొనవలసివచ్చిన ఈ తరుణములో గురునానక్ సందేశము మహదాశీర్వచనము. ఈ మహాగురుని జీవితగాదథావియుగములలో మానవాళికి మార్గదర్శక మగుగాక.

దలైలామా.

ధర్మశాల,
మార్చి 31, 1966

# మున్నుడి

ఈ దేశము, అనాది కాలమునుండి అన్ని రంగములలోను గణుతికెక్కిన మహాపురుషుల నెందరినో సృజించినది. మనదేశచరిత్ర కళలలో, సార స్వతములో, రాజకీయములలో విజ్ఞానాది సమస్త రంగములలోను స్తవనీయ మైన కృషిని సాగించిన సుప్రసిద్ధుల పేర్లతో నిండియున్నది. ఇందులో కొందరి పేర్లు ఇంటింటా అందరికీ తెలిసినవే. మరికొందరి పేర్లు అందరికీ సుపరిచితమే కాని వారి జీవిత విశేషములుగాని వారు సాగించిన కృషి వివ రములు ప్రజానీకమునకు అంతగా తెలియవు. మహత్తర ఫలితములను సాధించినప్పటికీ ప్రజలకు ఏ మాత్రము తెలియని మహానుభావులు కూడా ఎందరో ఉన్నారు.

ఏ దేశపు చరిత్ర అయినా చాలవరకు ఆ దేశమున జనించి గొప్పవారైన స్త్రీ పురుషుల చరిత్ర తప్ప అన్యముకాదు. వారు ఆ దేశమునకు రూపురేఖలు తీర్చి దిద్దినవారు. మనదేశపు తీరు తీయములను వ్యవహారములను సరిగా అర్థము చేసుకొనదలచిన వారందరు ఈ మహావ్యక్తులను గురించి తెలుసు కోవడం చాలా అవసరము. ఇట్టి మహావ్యక్తుల జీవితగాథలను సులభమైన శైలిలో అందరికీ అందజేయడమే జాతీయ జీవితచరిత్ర శ్రేణి లక్ష్యం.

మనదేశములో మధ్యయుగములలో అవతరించిన మహాపురుషులలో గురునానక్ ఒకరు. భారతదేశ చరిత్రలో సాంఘిక, రాజకీయ, ఆధ్యాత్మిక సంక్షోభములు వెల్లువికిన సమయములో ఆయన అవతరించినాడు. అప్పటికి కొలది శతాబ్దులకు పూర్వమే మనదేశంలో ముస్లిమ్ పరిపాలన పాదుకొంది. బాబరు చక్రవర్తితో మొగలాయీ పరిపాలన ప్రారంభమైంది. క్రొత్తమతంతో బాటు క్రొత్తవారు దేశంపై దండెత్తి జయించిన ఆ తరుణంలో ఆధ్యాత్మిక సాంఘిక కల్లోలం ప్రారంభమైంది. దీనికి ఆధ్యాత్మికంగా ప్రతీకారం

ప్రారంభమైంది. నిజానికి ముస్లిములతోబాటు మనదేశంలోనికి చొచ్చుకు వచ్చిన నూతనమైన ఆధ్యాత్మిక విచార ప్రభావంవల్ల ఏర్పడిన పరిస్థితిని ఎదుర్కోవడానికి అవసరమైన మానసిక సంఘర్షణలకు, కృషికి ఇది నిదర్శనమని చెప్పవలసి ఉంది.

ఈ సంక్షోభాన్ని ఎదుర్కొనడానికి అనేకమంది అనేక విధాల ముందుకు వచ్చారు. వీరిలో గురునానక్ అగ్రగణ్యుడు. వాస్తవిక దృష్టితో చూచినప్పుడు ఇది నిస్సందేహంగా రుజువవుతుంది. ఇందుకు కారణం భారతదేశంలో మొగలుపరిపాలన అంతం కావడానికి కారణభూతమైన వ్యూహరచనకు ఇది నిమిత్తమైంది. నిజానికి సార్థకమైన రాజకీయ ప్రయోజనాలను సాధించడానికి పూనుకున్న రెండు కొత్త మార్గాలలోను ఇది ఒకటి. రెండవది దక్షిణాదిని మహారాష్ట్రలో తిరుగుబాటును ప్రేరేపించిన రామదాసస్వామిది.

గురునానక్ జన్మస్థలము పంజాబు అయినప్పటికీ ఆయన తన రచనలు వేటిలోనుకూడా పంజాబును గురించి ఒక్కసారి అయినా ప్రస్తావించలేదు. ఆయన ఆనాటి ఉత్తర హిందూస్థానములో సామాన్య ప్రజలందరికి అర్థమయ్యే 'సాధుభాష' లో తన రచనలు కొనసాగించాడు. ఆయన హెచ్చుగా దేశాటనము చేసినవాడు. దేశాంతరాలలోకూడా పర్యటన సాగించి తన విశ్వమానవ సౌభ్రాతృత్వ సందేశాన్ని అందరికీ అందచేశాడు. హిందువులైనా, ముసల్మానులైనా అందరూ ఒక్కటేనని ప్రబోధించాడు. వర్ణాశ్రమవ్యవస్థనుగాని అస్పృశ్యతనుగాని ఆయన పాటించనేలేదు. ఆయన దృష్టిలో భగవంతుడొక్కడే. మానవులందరు ఒక్కటే. ఆయన బోధలు సమకాలికులలో ఒక్క సమర్థరామదాసు తప్ప మిగతావారి ఉపదేశములకన్న భిన్నముగానున్నవి. భగవంతుని పొందుటకై ప్రాపంచిక విషయములను విడిచిపెట్టవలెననిగాని వైరాగ్యమును చేబట్టవలెననిగాని ఆయన బోధించలేదు. పైగా

మనస్ఫూర్తిగా పనిచేసి భగవంతునితో పొందు సంపాదించ వచ్చునని ఆయన ప్రబోధించాడు. ఆయన బోధనలే కాలక్రమేణ శిక్కుమతంగా రూపొందాయి. నిజానికి ఆయన శిక్కులకు గురువు అయినప్పటికీ ఆయనను ప్రేమించి, గౌరవించి, ఆరాధించినవారు హిందువులలోను, ఇతర మతములలోను అనేక వేలమంది ఉన్నారు నానక్ పంథీ లనబడు ఒక తెగవారు వందలు వేలు ఉన్నారు.

నేషనల్ బుక్ ట్రస్ట్ అధ్వర్యాన ప్రచురితమైన జాతీయ జీవితశ్రేణిలో గురుగోవిందసింగ్ చరిత్రను చక్కగా వ్రాసి ఇచ్చిన డాక్టర్ గోపాల్‌సింగ్ ఈ గ్రంథములో, తన తరువాత గురువులకు మార్గదర్శకుడై నవ్యోత్తేజాన్ని కలిగించిన గురునానక్ జీవితవిశేషాలను, సందేశమును సరళ మనోహరమైన భాషలో వివరించియున్నారు. డాక్టర్ గోపాలసింగ్ స్వయముగా చెప్పినట్లు 'గురునానక్ ఎన్నియో అద్భుతములు చేసిచూపినట్లు ఎందరో చెప్పినప్పటికీ మానవుడు తన్నుతాను జయించుకొని తన గమ్యమును చేరునట్లు తను సాధించిన మహాద్భుతములలో కెల్ల మహాద్భుతమైనదని ఆయన స్వయముగా చెప్పినాడు ఆయన కోరిన అద్భుతాంశ మేమనగా మానవునిలో పరిపూర్ణమైన జీవితాశను—ప్రేరేపించడం. దీనిని సాధించగలిగిన వ్యక్తి నిజంగా దైవసమానుడు కదా.

బి. వి. కేస్కర్

*న్యూఢిల్లీ,*
*నవంబర్, 1969*

# 1

*"హిందువులేడు ముసల్మానులేడు ఉన్నది మానవు డొక్కడే"*

—గురునానక్

నానక్ పుట్టగానే పెద్దవారివలె నవ్వినాడని ఆయన తల్లికి పురుడు పోసిన తురకదాది ఇరుగుపొరుగు వారికి తెలియపరచెను. నానక్ జన్మసమయమున దేవదుందుభులు మొరయగా అందరు వినిరని భక్తులైన చరిత్రకారులు వ్రాసియున్నారు. కుటుంబ జ్యోతిష్కుడైన హరదయాళుడు శిశువును చూచి చేతులు జోడించి నమస్కరించెను. ఈ బిడ్డ పెరిగి పెద్దవాడై రాజలాంఛనములతో హిందువులచే ముసల్మానులచే సమానముగా ఆరాధించబడగలడని, ప్రకృతిలోని జడ వస్తువులు సైతము ఆయనపేరును గౌరవ ప్రపత్తులతో సంస్మరించగలవని జోస్యము చెప్పెను.[1]

చిన్నతనములో నానక్ హిందూ గురువువద్ద అక్షరాభ్యాసము చేసిరి. ఆయనవద్ద ప్రాథమిక గ్రంథములు కొన్నింటిని పఠించి ఆ తరువాత మరొక ముస్లిము గురువువద్ద అరబిక్ పర్షియన్ భాషల నభ్యసించెను. అయితే నానక్ చిరకాలము బడికిపోయినట్లు కనబడదు. సాధారణముగా బడి ఎగవేసి సమీపమున నున్న అడవులకుపోయి అక్కడి పండితులతో సాధువులతో చర్చలు జరిపి వివిధ మతములకు సంబంధించిన ప్రాథమిక సత్యములను

---

1. నానక్ క్రీ. శ. 1469 లో పంజాబు రాష్ట్రములోని తల్వాండి గ్రామములో వైశాఖ మాసములో జన్మించెను. అయితే ఏకారణముచేతనో నానక్ జయంతి మాత్రము కార్తీక పూర్ణిమనాడు ఏటేటా జరుపబడుతున్నది

ఎన్నింటినో తెలుసుకొనెను. తనకున్న వ్యవధినంతయు నిర్గుణ భగవధ్యానములో గడిపెడివాడు. ఇది చూచి తనబిడ్డ పెరిగి ప్రయోజకుడు కావలెనని ఎంతగానో ఆశించిన నానక్ తండ్రి భయ పడిపోయెను.

నానక్ చిన్ననాటిగాధ లెన్నో బహుళ ప్రచారములో నున్నవి. ఒకరోజున గురువు బీజగణితము నేర్చుకొనవలసినదని నానక్‌ను ఆదేశించెను. దానికి జవాబుగా అదే అక్షరమాలతో ఒక్కొక్క అక్షరము అంతరార్ధమును వివరించుచు పద్యమల్లి వినిపించెను. ప్రతి అక్షరము భగవంతు డొక్కడే ఋజువు పరచుననియు, లేదా ఆయన అద్భుతసృష్టికి నిదర్శనమనియు లేదా భగవంతుని సంస్మరించవలసిన ఆవశ్యకతను నిరూపించుచున్నదనియు ఆయన వివరించెను. అయితే ఈ పద్యమును నానక్ అంత చిన్నతనమున కాక పెరిగి బాగా పెద్దవాడై గురుపద మలంకరించిన పిమ్మట రచించియుండునని కొందరు అభిప్రాయపడుచున్నారు. ఇంత ప్రౌఢమూ, సుందరమూ అయిన గీతమును అంత చిన్నవయ స్సులో ఎవ్వరూ అల్లజాలరని వారి అభిప్రాయము. అయితే మనసు వయసుతో పక్వమగునా?

ఏది ఏమైనప్పటికీ గురునానక్ బడిలో చాలకాలము చదువ లే దనుట నిర్వివాదము. ఆయనకు చదువబ్బి పండితుడగు నను ఆశ లేనందున ఆయనను తండ్రి పసులకాపరి పని అప్పగించెను. అయితే ఈ పనిలోకూడా తండ్రికి ఆశాభంగమే ఎదురయ్యెను. ఎందుకన్నగా నానక్ ఒకనాడు పసులను మేపుటకై తోలుకువెళ్లి, ఒక మర్రిచెట్టు నీడను కూర్చొని భగవంతుని ధ్యానించుకొను చుండెను. ఆ సమయమున ఆ పసువులు పొరుగువాని పొలములో

జొరబడి యధేచ్ఛగా మేయుచుండెను. ఆ పొలము కాపు పసులు తన చేనిని పాడుచేసినవని నానక్ తండ్రికడ ఫిర్యాదు చేసెను. ఇది విని ఆయన తండ్రి కోపోద్రిక్తు డయ్యెను. అయితే ఇందు వలన చేనికి కలిగిన నష్టమునంతను[1] వెలకట్టి పూర్తిగా పరిహార మిచ్చుటకు గ్రామ మునసబు రాయ్‌బులారు నచ్చచెప్పి ఆ కాపును పంపివేసెను. ఈ రాయ్‌బులార్ ఇస్లాము మతానుయాయి అయిన రాజపుత్రుడు. నానక్ చిన్ననాటనుండి ఇరుగు పొరుగువారి ఆదరాభిమానములకు పాత్రుడయ్యెననుటకు ఇది మంచి నిదర్శనము. నానక్ ఒకనాటి మిట్టమధ్యాహ్నము మంద బయలులో నిద్రించు చుండగా ఆయన ముఖమునకు ఎండ సోకకుండ ఒక త్రాచుపాము పడగవిప్పి గొడుగుపట్టెననికూడ గ్రంథస్థము చేయబడియున్నది. భక్తులు ఇది ఆయనలోని దైవాంశకు నిదర్శనమని విశ్వసించగా, ఇది ఆయన నిర్లక్ష్యమునకు నిదర్శనమని తండ్రి భావించినాడు. ఇట్లుండగా నానక్‌నకు ఉపనయనము చేయుటకై గ్రామ జ్యోతిష్కుడు ముహూర్తము రానేవచ్చెను. దగ్గరనుండి, దూరమునుండి కుటుంబ బంధు మిత్రు లెందరో వచ్చిచేరిరి. సంప్రదాయానుసారము తండ్రి వచ్చినవారందరికి గొప్ప విందు ఏర్పాటుచేసెను. అయితే సుముహూర్తమున యజ్ఞోపవీతధారణ చేయుటకు నానక్ నిరాకరించెను. ఇదిచూచి, వచ్చినవారందరు విస్తుపోయిరి. చూడ వచ్చిన పెద్దలందరు నీకిది తగదని నానక్‌ను మందలించిరి. వారికి నానక్ చెప్పిన జవాబు ఇది: మైలపడిన జందెమును నేను

1. పురాతన జన్మ సాఖి ప్రకారము గ్రామ ప్రజలు పశువులు మేసిపోయిన ఆ పొలమును చూడవెళ్లినప్పుడు ఆ చేను యథాతథము ఏమియు నష్టము జరుగనట్లే కనిపించెనట.

ధరించను. ఇది తెగిపోవచ్చు. లేదా మండిపోవచ్చు. పైగా పోయినప్పుడు వెంటరాదు. అయితే తెగనిది, మండి మసికానిది, ఇహపరములు రెండింటిలోను వెంట ఉండునది అయిన జందెమును ఎట్లు ధరించెదవని ప్రశ్నించగా ఆయన చెప్పిన జవాబు ఇది: "దయను ప్రత్తిచేసి సంతృప్తిని సూత్రముగాచేసి నిగ్రహమను ముడివేసి సత్యమను పురిఎక్కించి ధరించినఎడల అది ఆత్మకు తగిన జందెము అగును. ఈ జందెము ఎప్పుడూ తెగదు. మాడి మసికాదు. మురికికాదు. వృధాకాదు. పోదు. తన గళమున ఇట్టి జందెమును ధరించిన వాడే దైవానుగ్రహపాత్రుడు."

ఈ పెంకె జవాబును ఆయన తండ్రి ఏమాత్రము సహింప లేకపోయెను. పసివాడైన తన బిడ్డ తనకెంతో తలవంపులు తెచ్చి నట్లు ఆయన భావించెను. అందుచేత పద్నాలుగవ ఏటనే గురు దాసపూర్ జిల్లాలోని బటాలా వాస్తవ్యుడైన మూళ కుమార్తె సులఖనీతో నానక్‌కు పెండ్లి చేసెను. ఇట్టి అసాధరణ మేధావులైన బిడ్డలను కన్న తల్లితండ్రు లందరివలెనే నానక్ తండ్రి సైతము ఈ వివాహమువలన నానక్ దృష్టి తిరిగి సంసారము సంగతి తప్పక చూచుకొనగలడని, సంసారభారము మెడపై పడినప్పుడు తన కోసము కాకపోయినను భార్యా పిల్లలకోసమైనను తప్పక ధనార్జ నకు పూనుకొని బాగుపడగలడని విశ్వసించెను.

అయితే ఇందువల్లకూడ ప్రయోజనమేమీ కలుగలేదు. అచిర కాలముననే నానక్‌నకు శ్రీ చంద్, లక్ష్మీదాసు అను పుత్రు లిద్దరు పుట్టిరి. అయిననేమి నానక్‌కు సంతోషము లేకుండెను. అంతట బ్రతుకుతెరువుకై దుకాణమునైన తెరువవలసినదని నానక్ తండ్రి ఆయనకు సలహా ఇచ్చి వ్యాపారమునకు మదుపుగా

కొంత సొమ్ము చేతికిచ్చి పొరుగు గ్రామమునకు పోయి సరుకులు కొని తీసుకొని రావలసినదని ఆజ్ఞాపించెను. సరేనని నానక్ సమీపగ్రామమైన చుహార్‌ఖాన్‌కు సరుకులను ఖరీదు చేయుటకై వెడలుచుండగా మార్గమధ్యమున కొందరు సాధువు లెదురై గడచిన కొలది దినములుగా తాము భోజనము చేయలేదనియు, ఆకలికి నకనక లాడుచుంటిమనియు చెప్పిరి. అది విన్న వెంటనే నానక్ తనవద్ద నున్న ధనమంతయు వారికి ఇచ్చివేసి దానితో ఆహారము కొనుక్కొని భుజించవలసినదని చెప్పి, వట్టిచేతులతో ఇంటికి తిరిగి వచ్చెను. తండ్రి కోపగించుకొనునేమో యను భయముతో ఇంటికి పోక ఊరుబయట ఒకచోట కూర్చొనియుండెను. నానక్ సరుకులేమియు కొనకుండా వట్టి చేతులతో తిరిగి వచ్చెనని విని తండ్రి తక్షణమే ఆయనను చూడబోయెను. తాను ఇచ్చిన డబ్బు ఏమయ్యెనని నిగ్గదీసి అడిగెను. నానక్ నిబ్బరముగా చెప్పిన జవాబు ఇది: "తండ్రీ, నీవు లాభసాటి వ్యాపారము చేయుమని నాకు సలహా ఇచ్చితివి. అయినప్పుడు ఆకలిగొన్న సాధువులకు అన్న మిడుటకంటె మీకును, నాకును ఇహపరసుఖదాయకము లాభసాటియైన ఇంకొకటి ఏమి కలదు?" అసాధారణమూ అసందర్భమూ అయిన ఈ జవాబు విని క్రోధోద్రిక్తుడై ఆయనతండ్రి నానక్ ముఖముపై ఉమ్మివేసి ఇంటికి తిరిగిపోయెనట.

కనీసము వ్యవసాయమైన చేయవలసినదని అడుగగా నానక్ అందుకు నిరాకరించెను. ఎందుకనగా ఆయన మరొక రకమైన వ్యవసాయము చేసెను. తాను కృషి చేయదలచిన క్షేత్ర మెట్టిదో వివరించవలసినదిగా కోరినప్పుడు నానక్ చెప్పిన జవాబు ఇది: "నా శరీర మను క్షేత్రములో మనస్సు రైతు. సచ్ఛీలమే కృషి.

వినయము దానిని తడుపు నీరు. భగవంతుని భక్తియే బీజము. సంతృప్తి దుక్కి. దారిద్ర్యమే కంచె. ప్రేమతో పెంచినప్పుడు ఈ బీజము మొలకెత్తును. ఈ విధముగా సంచరించు వారి గదులు ఆ పంటతో నిండిపోవును. ఓ తండ్రీ, మనము ఈ ప్రపంచమును వీడిపోవునప్పుడు అందరినీ ఆశపెట్టిన సంపదలు మన వెంటరావు. అయితే ఈ సత్యము తెలిసినవారు కొందరే ఉన్నారు.''

నానక్ అంతటితో ఆగలేదు. "ఓ తండ్రీ, నేను నా పొలములో, నాకు, నా కుటుంబమునకు మాత్రమే కాక ఈ సమస్త ప్రపంచమునకు చాలినంత పండించెదను. ఒకసారి నా చేతి భోజనము చేసినవాడు మరి దేనికీ ఆశపడడు. పైగా ప్రతివారికి ఈ జన్మకు, పూర్వజన్మకు సంబంధించిన లెక్కనంతా ఇది తేల్చగలదు. పైగా ఎవనికి నేను పాలికాపునై పొలము దున్నుచున్నానో వాడు నన్ను అతివృష్టినుండి అనావృష్టినుండి కాపాడుచుండును. నేను ఎప్పుడేది అడిగిన, అడిగిన దంతా ఇస్తుంటాడు. చాలు. నా కింకేమియు వలదు.''

ఈ జవాబు విని నానక్ తండ్రియైన కాలూ ఎంతో ఆశ్చర్యపోయెను. ''బిడ్డా! నీ వలె నేను నీ యజమానిని చూడలేదు. పైగా నీకు మతిపోయినదని సాటివారందరు చెప్పుకొనుచున్నారు. అందుచేత మన పూర్వులు, పెద్దలు చనిన త్రోవను నడువగోరుచున్నాను. పనిచేయక ఎవరు బ్రతికిరి? నీవు మీ తల్లిదండ్రుల ప్రతిష్ఠను కాపాడుటకైన మేము చెప్పినట్లు చేయుము. సమస్త ప్రపంచములోను మాకు అప్రతిష్ఠ తేకుము.''

నానక్ చెప్పిన జవాబు: "తండ్రీ, నా స్వామిని చూచినవాడెల్ల ఆయనను మెచ్చుకొనెను. ఆయనతో సంబంధ మేర్పరచు

కొానెను.'' నిరాశతో స్వామినిగురించి మరింత స్పష్టముగా వివరించవలసినదని, అందువలన తానేకాక, ఇతరులు సైతము పరిస్థితిని అర్ధము చేసుకొని నానక్‌ను గురించిగాని, కుటుంబమును గురించికాని దుష్ప్రచారము చేయకుందురని తండ్రి నానక్‌కు వివరించెను. ఆమాట విని ఒక్కక్షణమైన సంకోచించకుండ గురునానక్ ఇట్లు జవాబిచ్చెను:

''ప్రతివారూ విన్నారు ఆయన గొప్పవాడని. అందరూ ఆయనను అట్లే పిలిచెదరు. అయితే తన్ను చూచువారి గొప్పతనము ఆయన కొక్కనికే తెలియును. ఓ తండ్రీ, నా స్వామి గొప్పతనము గణించ నశక్యము. ఆయనను ప్రేమించిన వారు ఆయనలో లీనమై పోదురు. ఆయనతో తుల్యమైనది వేరొకటి ఉన్న కదా ఎటులుండునో పోల్చి చెప్పవచ్చును. అందుకనే ఆయనను తెలిసిన ప్రతివారు ఇలా అంటూంటారు: ''ఓ ప్రభూ, నీకు నీవే సాటి'' అని.

అంతట నానక్ తల్లి అక్కడికి వచ్చి తన కుమారుని బుజ్జగించి తండ్రి చెప్పినమాట వినవలసినదని ఎంతగనో ప్రార్థించెను. ''నాయనా, నీలో నీవు తన్మయుడవై పోవుచున్నావు. అందువలన నాకు ఆలోచనా శక్తి నశించినదని ప్రజలు అపోహపడుచున్నారు. అందుకనే వారందరూ నిన్నుగురించి మమ్ముగురించి చెడ్డగా మాట్లాడుచున్నారు. బిడ్డా, నిన్ను గురించి మమ్ముగురించి ప్రజలు మరింతగా చెప్పుకొనవలెనని మా కోరిక.'' ఇది విని నానక్ కళ్లు చెమ్మగిల్లినవి. డగ్గుత్తికతో తల్లికి ఇట్లు జవాబు చెప్పినాడు: ''అమ్మా, మంటలలో మగ్గిపోతున్న ఈ ప్రపంచమును కాపాడవలసినదని నాకు దూరతీరములనుండి పిలుపు వచ్చినది. అందు

వలన మన మందరమూ ఈ మంటలలోబడి బూడిదయై పోవుట నీ కిష్టమా? లేక వీలైనంతమందిని ఈ పెనుమంటల బారినుండి కాపాడుట నీ కిష్టమా?

ఇది వినుసరికి నానక్ మనస్సు మార్చుట దుర్ఘటమని అందరికి తెలిసిపోయెను. పెద్దలందరు కలిసి యోచించి వైద్యుని పిలిపించి పరీక్ష చేయించుట మంచిదని నిశ్చయించుకొనిరి. కాలూ తక్షణమే గ్రామవైద్యునికి కబురంపించెను. ఆ వైద్యుడు వచ్చి నానక్ నాడిని పరీక్షించుచుండగా, నవ్వి ఇట్లు జవాబు చెప్పెను:

"ఘనవైద్యుడా, నా నాడిని తాకకుము. ఎందుకనగా నా శరీరములో ఏమీ జబ్బులేదు. ఉన్నదల్లా ఆత్మలోనే. నా సంగతి వదలి, తెలివైనవాడవయితే నీ సంగతి నీవు చూచుకొమ్ము. తనకు తాను స్వాధీనములో లేనివాడు నీ మందు కేమిలొంగును? నాకు వచ్చిన జబ్బు ప్రేమరోగము. దీనికి తగిన చికిత్స నేను ఎవరినైతే ప్రేమించుచున్నానో ఆ ప్రియుని కొక్కనికే తెలియును. ఆ మాట విని ఆశ్చర్యపడిపోయిన ఆ వైద్యుడు ఆత్మకు పట్టిన జబ్బు ఎమిటో వివరించవలసినదని నానక్‌ను కోరెను. ఆ సమయమున నానక్ ఆయనకు చెప్పిన అద్భుతమైన జవాబు ఇది:

"నాకు వచ్చిన జబ్బు ఏమిటంటే నానుంచి నేను విడిపోయాను. రెండవది నే నెట్లుండవలెనో అదే కావలెనని కోరుకొను చున్నాను. మూడవది నేను సర్వశక్తిమంతమైన మృత్యువు కంటిచూపులో పడ్డాను. నాలుగవది నా అంతట నేను కూర్చొనలేకున్నాను. ఓ మానవుడా, నీ జబ్బు నీ శరీరములో లేదు. ఉన్నదల్లా ఆత్మలోనే. అదే కనుక పరిశుద్ధ

మైనదీ పరిపూర్ణమైనదీ అయితే సమస్త శరీరమూ ఆరోగ్యంగానే ఉంటుంది.''

''అయితే మానవుని వ్యాధులకు కారణమేమి?'' అని వైద్యు డడిగిన దానికి నానక్ చెప్పిన జవాబు ఇది:

''విషయ సుఖలాలసత్వం. ఈ సుఖములే ఆత్మకు వ్యాధిని తెచ్చిపెట్టునవి. బాధను కోరి వరించుటే దానికి నివారణోపాయము.''

అంతట ఆ వైద్యుడు నానక్‌కు నమస్కరించి ఇట్లనెను: ''ప్రభూ, నీకు కావలసిన చికిత్స నీలోనే ఉన్నది. కాని ఆయన తల్లిదండ్రులు ఆఖరుసారిగా నచ్చచెప్పదలచి ఇట్లనిరి. ''నిన్ను కని పెంచిన వారికి నీవల్ల పొందదగిన కోరికలు కొన్ని ఉండును. నీవు వారిమాట మన్నించవా? నిన్నింతచేసిన వారిమీద నీకు ఆపేక్ష అభిమానము లేవా?'' నానక్ చెప్పిన జవాబు ఇది.

''నాతండ్రి ఎవరో నాకు తెలియదు. అలాగే అమ్మకూడా.
అలాగే నేను ఎక్కడనుంచి వచ్చినానో తెలియదు.
పైగా నీరు నిప్పు కలిసి నన్ను ఇట్లెందుకు తయారు చేసెనో
తెలియదు.
నాలో ఏదో తీవ్రమైన బాధ ఆత్మ మండిపోతున్నట్టుగా నా
గుండెను నులిమివేస్తున్నది.
నా స్వామి కోరికను మన్నించినప్పుడే నాకు శాంతి కలుగు
ననిపించుచున్నది.''

(గౌరీ ప్రథమ గురువు)

ఈ పరిస్థితులలో మరొకచోటికి పోయిన ఎడల నానక్ మనసు తిరిగి మామూలు మనిషి కావచ్చునని ఆయనతండ్రి ఇతర కుల

పెద్దలు నిశ్చయించిరి. అందుచేత ఆయన తన సోదరి నానకి భర్తయైన జయరాముని స్వస్థలమగు సుల్తాన్‌పూర్ (ప్రస్తుతం కపుర్థలాజిల్లాలో నున్నది) వెళ్లిన బాగుండునని సలహా ఇచ్చిరి. నానక్ బావమరది జయరామ్ ముస్లిమ్ నవాబు కొలువులో ఉగ్రాణపు పని చూచువాడు. ఆ ప్రకారమే నానక్ ప్రయాణమునకు సన్నాహములన్నియు పూర్తి అయినవి. ఆయన సుల్తాన్‌పూర్‌కు బయలుదేర బోవుచుండగా "నన్ను కూడ మీవెంట తీసుకొనిపొండు మీరు అంతదూరము వెళ్లిపోయిన తరువాత నాసంగతి మీకు జ్ఞాపకముండవచ్చును, ఉండకపోవచ్చును. ఇక్కడ ఉన్నప్పుడే మీరు నావిషయమై అంతగా పట్టించుకొనుట లేదు. అక్కడ నన్ను పూర్తిగా మరచిపోదురు కూడ" అని నానక్‌భార్య పరిపరివిధముల బ్రతిమాలెను. నానక్ చిరునవ్వు నవ్వి ఇట్లనెను: "వీరందరు కోరినట్లుగా నేను అక్కడ స్థిరపడి నాలుగురాళ్లు సంపాదించగలిగినట్లయిన నిన్ను వెంటనే పిలిపించుకొనెదను. లేనిఎడల నేను తిరిగి వచ్చువరకు నీవు ఇక్కడనే యుండుము. అంతవరకు భగవంతుడే నిన్ను కాపాడగలడు. నీ స్వామిని నీవు మనసార ధ్యానించుచుండుము." అంతట ఆమె నానక్ చిన్నికుమారు లిరువురిని పిలుచుకొనివచ్చి ఆయనకు చూపెను. నానక్ వారిరువురను ఎత్తుకొని తన గుండెలకు హత్తుకొని ముద్దాడి, ఆశీర్వదించెను. పిమ్మట తన తల్లిదండ్రులకు పాదాభివందనముచేసి వారి సెలవు తీసుకొనెను. ఇదంతయు చూచి నానక్ ఎట్టకేలకు ఐహిక మార్గమును స్వీకరించెను కదాయని ఆయన తల్లిదండ్రులు భార్య ఎదలో ఎంతో సంతోషించిరి.

నానక్ సుల్తాన్‌పూర్ చేరిన వెంటనే బావమరది జయరాము ఆయనను వెంటబెట్టుకొని తీసుకొనిపోయి నవాబుకు పరిచయము చేసెను. నవాబు, నానక్ వినయము, సత్ప్రవర్తన చూచి ముగ్ధుడై తన ఉగ్రాణమును ఈతని కప్పగించిన ఎడల సర్వము భద్రముగా నుండగలదని భావించి నౌకరులకు భత్యము కొలుచుపనిని అప్ప గించెను. నానక్ వెంటనే కొలువులో చేరి తన ధర్మమును ఎంతో చక్కగా, న్యాయముగా నిర్వర్తింప దొడగెను. తన వాటాకు వచ్చిన ధన, ధాన్యములను ఎక్కువగా తనకడకు వచ్చిన సాధువు లకు పంచిపెట్టుచుండెను. అయితే నానక్ రాజద్రవ్యమును విచ్చల విడిగా అయినవారికి కానివారికి అందరికీ పంచిపెట్టుచుండెనని వదంతి ఊరంతయు వ్యాపించెను. పైగా పనిముగించుకున్న తరు వాత ఆయన అనేక గంటలసేపు నిశ్చలముగా ఏదో ధ్యానించుచు కూర్చుండువాడనికూడ ఫిర్యాదులు నవాబు చెవికి చేరినవి. పని జేయుచున్నప్పుడు సరుకులు కొలుచునప్పుడు సైతము పదమూడు సంఖ్య వచ్చినప్పుడల్లా 'తేరా' యను పదమును లక్షలసార్లు ఉచ్చ రించుచుండెడివాడు. 'తేరా మై తేరా' అని అనేకసార్లు అనేవాడు.

ఈ అసాధారణవ్యక్తితో వ్యవహరించడం ఎలాగ అని నవాబు ఆలోచించుచుండగానే నానక్ కనిపించుటలేదని ఆయనకు కబురు చేరెను. ఆయన ఒకనాటి ఉదయము వయ్యాన్ అను వాగుకు స్నానము చేయుటకు వెళ్లెను. అక్కడినుండి మూడురోజులపాటు తిరిగిరాక సమాధి మగ్నుడై ఉండిపోయెను. నానక్ మునిగిపోయె నని ప్రజలందరు భావించిరి. కాని ఆయన తిరిగి కనిపించెను. ఆ మూడురోజుల సమాధిలో ఆయనకు భగవంతుని దర్శనమాయె ననియు, అప్పుడు భగవంతు డాయనను ఆశీర్వదించినాడనియు

అతి పురాతనమైన నానక్ జీవితచరిత్రలో లిఖింపబడియున్నది. "ఓ నానక్ నేను ఎల్లప్పుడూ నీతోనే ఉంటాను. నిన్ను ఆశీర్వదిస్తున్నాను. నీపేరును ప్రేమతో ఉచ్చరించిన ప్రతివ్యక్తికూడ భగవదాశీర్వచనమునకు తప్పక పాత్రుడగును. నీవింక ఈ విశాల ప్రపంచములోనికేగి భగవదాదేశమును ప్రజలందరికి వివరింపుము. నేను నీకు నా నామమును అనుగ్రహించితిని. నీవు అనుగ్రహించిన వారెల్ల నా అనుగ్రహమునకు తప్పక పాత్రులగుదురు. నేను దేవాధిదేవుడను. ఇకనుండి నీవు గురుదేవుడుగా విఖ్యాతుడవు కాగలవు. నానక్ దేవునికి పాదాభివందనము చేయగా ఆయనకొక వస్త్రమును భగవంతుడు బహూకరించెనట. సమాధినుండి తేరుకొని, అంగవస్త్రము మాత్రము ధరించి నగరమునకు తిరిగివచ్చి, "నాకిక్కడ హిందువుకాని ముస్లిమ్‌కాని కనబడుటలేదు. కనబడునది మానవు డొక్కడే."

మత ప్రాబల్యము హెచ్చుగా నుండు ఆ రోజులలో నానక్ ప్రకటించిన ఈ అసాధారణ సత్యము కాజీలకు ఎంతో ఆందోళన కలిగించెను. "నానక్ నాదృష్టిలో భాగవత శిరోమణి యనియు ఆయనను మనము కదలించరాదనియు నవాబు ప్రకటించినప్పటికి, నానక్ ప్రబోధమువలన రాష్ట్రములో గొడవలు బయలుదేరక మానవని కాజీలు భావించిరి. వెంటనే నానక్‌ను నవాబు దర్శనమునకు పిలిపించిరి. అట్లు వచ్చిన నానక్‌ను చూచి కాజీ ఇట్లనెను: "ఓ, నానక్, నీకు మతిపోయినదనియు, ఇదివరకు ఇతరులెన్నడు చెప్పని-మాటలను నీవు చెప్పుచుంటివనియు అందరూ అంటున్నారు. ఇందుకు నీవేమి చెప్పెదవు?" నానక్ ఈ ప్రశ్నకు పద్యరూపమున జవాబు చెప్పెను. అప్పటికే తన ముస్లిమ్ శిష్యుడైన

మర్దానా శ్రుతివేయుచుండగా నానక్ అప్పుడు చెప్పిన పద్యపు సారాంశము ఇది :

"కొందరు నన్ను పిచ్చివాడందురు. మరికొందరు కలిసిరానివాడందురు. మరికొందరు నేను పేదవాడినందురు. ఓ మానవులారా, నా ప్రభువు భగవంతుడంటే పడిచచ్చేవాణ్ణి నేను. నాకు భగవంతుడు తప్ప మరెవ్వరూ తెలియరు. దైవభీతి కలవాడొక్కడే నిజానికి పిచ్చివాడు. తన స్వామినితప్ప, ఇతరు లెవ్వరిని ఎరుగనివాడు. వాడు తన స్వామికార్యమునకే సదా బద్ధుడు. ఆయన ఇష్టప్రకారమే చేయువాడు. తాను ప్రేమించువానిపై యుక్తులు ప్రయోగించనివాడు. తన స్వామి భగవంతుని తప్ప మరెవ్వరిని ప్రేమించడు. తాను చెడ్డవాడిననియు మిగతా అందరూ మంచివారు, పరమపవిత్రులు అని భావించును."

అంతట కాజీ అడిగెను : "అయిన మా ముస్లిమ్ మతమును విమర్శించుటకు నెకెన్ని వేల గుండెలున్నని ?"

ఆ ప్రశ్నను విని నానక్ తొణకక బెణకక నిబ్బరముగా ఇట్లు సమాధానమిచ్చెను

"మహమ్మదీయునని చెప్పుకొనుట చాలా సులభము. కాని నిజముగా మహమ్మదీయుడగుట చాలా కష్టము."

"అయిన నీ దృష్టిలో మహమ్మదీయు దెవరో వివరింపుము" దయ మశీదై విశ్వాసము చాపయై సత్యజీవనమే కురాను అయినప్పుడు వినయమును సున్నతిగా భావించి నిగ్రహమును ఉపవాసముగా స్వీకరించినవాడే నిజమైన మహమ్మదీయుడు.

సుగుణములు, సత్కృత్యములు కాబాయాత్రకాగా సత్యమే
మార్గదర్శియైనప్పుడు భగవదనుగ్రహమును కాంక్షించుచు
ప్రార్ధనలు సలిపి తన సంకల్పమును అక్షమాలగా చేసు
కొన్ననాడు, భగవంతుడు వారి గౌరవము కాపాడగలడు"
(మాఝ్. ప్రథమ గురువు)

అంతట తనతో మశీదుకు వచ్చి ప్రార్ధనలు జరిపి, తేడా తెలుసు కోవలసినదని కాజీ నానక్‌ను ఆహ్వానించెను. అందుకు నానక్ చెప్పిన జవాబు ఇది : 'రోజూ అయిదుసార్లు మీరు ప్రార్ధన చేస్తూఉంటారు. నేనూ అంతే. అయితే నా మొదటి ప్రార్ధన సత్యము. రెండవది విశుద్ధ జీవనము. మూడవది దైవానుగ్రహము. నాలుగవది పరిశుద్ధమైన మనస్సు. అయిదవది దైవచింతన." అయితే కాజీకి ఆశాభంగము కలిగించుట తన కిష్టము లేదని చెప్పి గురునానక్ ఆయన వెంట మసీదుకు వెళ్లి ప్రార్ధనలు చేయుటకు అంగీకరించెను.

మశీదులో ప్రార్ధనలు జరుగుచుండగా నానక్ అందు పాల్గొనక వేరుగా నిలబడి నవ్వుచుండెను. ప్రార్ధనలు ముగిసిన తరువాత కాజీ నానక్! అట్లెందుకు ప్రవర్తించితివని కోపముగా ప్రశ్నించెను. మరల నవ్వి నానక్ ఇట్లు జవాబిచ్చెను : "నీవు నీ భగవంతుని ప్రార్ధించుచుంటివని చెప్పితివి. కాని అది సరికాదు. నీ శరీరము వంగివంగి దండప్రణామములు ఆచరించుచు నమాజు చేయుచుండినప్పుడు నీ మనస్సు అంతయు కాబూలులో చేయబోవు జాతిగుర్రముల బేరముపై మగ్నమై యుండెనుకదా! అందుకని." ఈ జవాబు విని కాజీ నిర్ఘాంతపోయెను. ఇంక నోరువిప్పిన ఎడల సరివారిలో మరింత అవమాన మగునని భయపడి మిన్నకుండెను. కాని నవాబు ఆ జవాబువిని ఎంతో సంతోషించి ఇట్లనెను : "నానక్

నీవంటి దైవభక్తుడొకడు నాకు మంత్రిగా నుండుట ఎంత గొప్ప అదృష్టము. నా వద్దనే యుండుము. నేను ఉగ్రాణపు లెక్కలన్నింటిని పరీక్షించితిని. అంతయు సరిగానే యున్నది. నిన్నుగురించి అసూయతో ప్రజలు ఏమేమో మాట్లాడిరి. నిన్నింక పోనీయను. నీ సంగతి నాకిప్పుడు పూర్తిగా తెలిసినది.'' కాని నానక్ ఇట్లు జవాబిచ్చెను: ''అయ్యా మీరు చెప్పిన మంచిమాటలకు కృతజ్ఞుడను. కాని నేనింక మీ కొలువులో నుండను. ఇంతకన్న ముఖ్యమైన పిలుపు ఇంకొకటి వచ్చినది.''

అంతట నవాబు ఆయనకు శిరమువంచి ప్రణామముచేసి ఇట్లనెను: ''నేను నీకు నీ స్వామికి మధ్య అంతరాయమై నిలువను. నీ దేవు డెట్లు ఆదేశించిన అట్లే చేయుము. పుణ్యగ్రంథములలో నేను చదివినదాని నంతను నేడు ప్రత్యక్షముగా చూచితిని. అదే దివ్య దర్శనము. నేను నీకు చేయదగిన ఉపకారమో, సేవయో ఏదేని కలదేని సంకోచించక కోరుకొమ్ము. నన్ను నేను ఎంతో అదృష్టవంతుడుగా భావించుకొందును.'' తనకు దైవభక్తితప్ప మరేమియు అవసరము లేదని చెప్పి, మర్దానాతో కలిసి సాధువు సాంగత్యమును కోరి నానక్ అక్కడినుండి ఊరి వెలుపలనున్న అడవికి వెడలిపోయెను.

## 2

*"ఓ మానవుడా! భగవంతుని ఎదుట ఎత్తులు వేయకుము"*

—గురునానక్

మర్దానాతో కలిసి అరణ్యసీమలలో సంచరించుచు నానక్ పంజాబు నైరుతి భాగమంతయు పర్యటించెను. కాని ఆయన ఎక్కడా ఆగ లేదు. ఏదైన జనపదము కనిపించిన ఎడల అటుపోకుండ తన దారిని తాను ముందుకు సాగిపోవు చుండెడివాడు. ఆకలివేసినప్పుడు దారికి ఇరువైపుల కల అడవిచెట్లు ఫలములు కోసుకొని తినెడి వాడు. అయితే సాధువుల వెంబడి పయనించు వారందరికి లభించు నట్లుగా మధుర భక్ష్య భోజ్యము లెవ్వియు తనకు దొరకుట లేదని మర్దానా సణుగుకొనెడివాడు. ఇందుకు నానక్ మర్దానాను మందలించి దైవమార్గమును అనుసరించదలచినవాడు స్వయంసహాయముపై ఆధారపడవలెను కాని ఇతరుల దయాధర్మముపై బ్రతకరాదని హెచ్చరించెను. కాని ఈ మాట మర్దానాకు నచ్చదాయెను.

నానక్ ఒకనాడు మర్దానాను సమీపముననున్న గ్రామమునకు పోనిచ్చెను. అతడా గ్రామములో ప్రవేశించగానే భగవద్భక్తు డెవరో వచ్చిరని తలచి గ్రామస్థులందరు ఆయన ఆశీర్వచన మును వేడుచు చుట్టుముట్టిరి మరానా అట్లు తన్ను చూడవచ్చిన వారందరిని మనస్ఫూర్తిగా ఆశీర్వదించెను. వారున్నూ మర్దానాకు కృతజ్ఞతా సూచకముగా రకరకములైన మధుర భక్ష్య భోజ్యములనే కాక పట్టు, నూలు, ఉన్నిబట్టలను, దుకూలములను, రకరకముల అత్తరువులను కానుకలుగా సమర్పించిరి. వీటి నన్నింటిని చూచి మర్దానా ఎంతో సంతోషించెను. వీటన్నింటిని మూటకట్టుకొని,

నెత్తిన పెట్టుకొని పరుగు పరుగున అడవిలోనున్న గురువువద్దకు వచ్చెను. తన శిష్యుడు సహచరుడు అయినా మర్దానా పెద్దమూట నెత్తిన బెట్టుకొని వచ్చుటనుచూచి గురువు నవ్వి తన ఆజ్ఞలను ఎందులకు ఉల్లంఘించితివని ప్రశ్నించెను. గురువు ప్రశ్నకు మర్దానా మనసులో ఎంతో బాధపడెను. అయితే అంతమంది భక్తుల మనస్సులను నొప్పించుటకు ఇష్టములేక తాను ఈ కానుక లన్నింటిని స్వీకరించితినని చెప్పెను. వాటిని వెంటనే పారవేయ వలసినదని నానక్ ఆజ్ఞాపించగా వాడును వల్లెయని మనసులో బాధపడుచునే వాటిని పారవేసెను. అయితే ఎవరైన ఆర్తులకు దానముగా ఇచ్చినవి గురువుకు చేరునా? భగవంతుని తృప్తి పరచునా? అని మర్దానా నానక్‌ను ప్రశ్నించెను. అవును. ఆకొన్న వారికి భోజనమిడుట, నగ్నదేహులైనవారికి చేసిన వస్త్రదానము వలన భగవదాశీర్వచనము దాతకు తప్పక లభించగలవనియు, అయితే ఆ దానమును తను కష్టపడి సంపాదించిన దానినుండే చేయవలసియున్నదని, దానము స్వీకరించువాడు సైతము తన అవసరములకు చాలినంత మాత్రమే స్వీకరించవలసి యున్న దనియు నానక్ బదులు చెప్పెను.

గురుశిష్యులు ఉభయులు అక్కడినుండి బయలుదేరి ముందుకు సాగుచుండగా దోవలో సజ్జను డనబడు గజదొంగ ఒకడు ఎదురయ్యెను. వాడు రుద్రాక్షమాలను చేతబట్టి రస్తాకు ఒకవైపున కూర్చుండి బక ధ్యానము చేయుచు వచ్చు పోవు బాటసారులను ఒక కంట కనిపెట్టుచుండువాడు. వాడు ముస్లిమ్ సామంతు డగుట వలన ఒక మశీదునే కాక, హిందువులకై ఒక గుడిని సైతము కట్టించెను. ఆ దోవను పోవు వా రెవ్వరైనను, ఏ మతస్థులైనను

వారిని సాదరముగా ఆహ్వానించనిదే వదలిపెట్టడు. రాత్రిపూట తన అతిధిగా అక్కడ ఆగిపొమ్మని బలవంతపెట్టి ఇంటికి గొని పోయి ఇష్టమృష్టాన్న భోజనమిడి సంతృప్తుని చేయును. రాత్రి పొద్దుపోయిన పిమ్మట ఆ వచ్చినవారు గాఢనిద్రలో మునిగి యుండగా వారి కున్నదెల్ల దోచికొని గొంతుక కోసి సమీపమున నున్న పాడు నూతిలో శవమును పారవేయు చుండెడివాడు. మర్నాడు ఉదయమున మరల బాటకు వచ్చి చేత అక్షమాల ధరించి, మరెవ్వరు దొరకుదురా యని యధాప్రకారము బక ధ్యానము చేయుచుండును.

ఆ దోవను శిష్యసమేతుడై వచ్చుచున్న గురునానక్ ఇట్టివాని కంటపడెను. ఆయనను చూచి సజ్జనుడు అనుచరులతో ఇట్లనెను: "ఈ మహానుభావు డెవ్వరో సంపన్నునివలె కనబడుచున్నాడు. ఈయనను కొనిపోయి సకల మర్యాదలు చేయుడు. ఆయన ముఖ ములో ఆ లక్ష్మీవిలాసము తాండవించుచున్నది" వారును సరే యనిరి. అటులే చేసిరి. చీకటి పడగానే వారు గురునానక్‌ను సమీ పించి ఇక విశ్రాంతి తీసుకొనుడని ప్రార్థించిరి. నానక్ వారి విన్నప మాలకించి నిద్రించుటకు ముందుగా దైవస్తుతిగా తానొక పాటను పాడదలచితినని చెప్పెను. పాటపాడి నిద్రించెదనని హామీ ఇచ్చెను. ఇంతలో అనుచరులందరితోకూడి సజ్జనుడువచ్చిగురునానక్ సమ్ముఖమున కూర్చొనెను. మర్దానా సుహీ రాగములో శ్రుతిని, మనోహరముగా వాయించుచుండెను. నానక్ పాటపాడుచుండెను.

"కంచుపాత్ర మిలమిల మెరయుచుండును. కాని తోమ తోమగా దానిలోని మకిల అంతయుపోవును. మాకు మిత్రులమని చెప్పుకొనువారు భగవంతుని దివాణములో లెక్కలు తేల్చురోజున

ఈ మిత్రులు మనలను సమర్ధించని ఎడల వారిని మిత్రులుగా పరిగణించుటెట్లు? బయట ఎన్ని అలంకారములు ఎంతగా చేసి నప్పటికి శిధిలాలయము వలని ప్రయోజనమేమి? నదిఒడ్డున ఎన్ని బకములు ధ్యానము చేయుచు నిలిచి ఉండవు? కాని వారి దృష్టి ఎప్పుడూ తన అపార తృష్ణకు బలి కాగల వారిని అన్వేషించుచునే యుండును. సిమాలవృక్షమునిండ పూవులు, ఆకులు, పండ్లు అన్నీ ఉండును. కాని ఏమిలాభము. పండుకు రుచిలేదు. పూవులకు వాసన లేదు. ఆకులవలన నీడ లభించదు. అంధుడు మూట నెత్తిని పెట్టుకొని బహుదూరముననున్న ఎత్తైన కొండను ఎక్కుటకు బయలుదేరును. కాని చూపులేక వాడు గమ్యమెట్లు చేరును? ఓ నానక్ మన ఎత్తులు మన సజ్జనవేషమువలన ఏమీ ప్రయోజన ముండదు. భగవంతుని ప్రేమ ఒక్కటే మనలను కాపాడి మన పాదములకుగల సంకెలలను త్రెంచివేయ గలదు.''

హృదయ సంశోధకమైన ఈ పాటను నానక్ పాడుచుండగా విన్న సజ్జునునకు మనస్సునంతను ఎవరో కెలికివేయుచున్నట్లు అని పించెను. నిద్రించుచున్నవాని ఆత్మ మేల్కొనిన ట్లాయెను. తన గత చరిత్రను తలచుకొని వాడెంతో సిగ్గుపడిపోయెను. వెంటనే నానక్ పాదములపైపడి, ఆయనను మనసార కౌగిలించుకొని, ఏడ్చుచు ఇట్లనెను. ''ఓ ప్రభూ, నాగుట్టు అంతయు తెలిసికొంటివి. నాకు ఇప్పుడు మోక్షమార్గము చూపుము. నా పాపము లెట్లు క్షాళిత మగును?''

నానక్: ''భగవంతుడు రెండు విధములుగా మానవుని పురా కృతమును మన్నించును. ఒకటి తన దోష మంగీకరించుట. రెండు అందుకు తగిన పరిహార మొనర్చుట.''

సజ్జనుడు ఏడ్చుచు ఇట్లనెను : "నేను ఇంతవరకు ఎంత మందినో దోచితిని. వాళ్ల కుత్తుకలు కత్తిరించితిని. అందువలన అపార ధనరాసులను సంపాదించితిని. పైగా భగవద్భక్తునివలె ఎల్లకాలము నటించితిని. అయితే నా యీ పాపము లెట్లు పరిహారము కాగలవు?"

గురువు: "నీకున్నదెల్ల తెచ్చి అదంతయు పేదలకు, సాధువులకు దేవుని పేరుతో దానము చేయుము."

అంతే. సజ్జనుడు పూర్తిగా మారిపోయినాడు. తక్షణమే గురువు చెప్పినట్లే చేసెను. అటుపిమ్మట నిజముగానే గొప్ప భక్తుడై పోయినాడు. గురువు వానిని తన ఉద్యమమునకు ప్రథమార్చకుడుగా స్వీకరించినాడు. ఇది విన్నవారందరు నానక్ ఒక మహాద్భుతమును సాధించెనని ప్రశంసించిరి.

అక్కడనుండి బయలుదేరి గురునానక్ సయ్యద్‌పూర్ వెళ్లెను.

(ఇప్పుడీ పట్టణముపేరు ఎమినాబాదు. గుజ్రన్‌వాలా జిల్లాలోనున్నది.) అక్కడ ఆయన లాలో అను వడ్రంగి ఇంట బసచేసెను. అయితే క్షత్రియ సాధువొకడు లాలో అనబడు అస్పృశ్యుని యింట మకాముపెట్టి వానితో పంక్తిని భోజనము చేయుచున్నాడని ఊరంతయు చెప్పుకొన జొచ్చిరి. ఈ కబురు ఆ నగరములో ఉన్నతోద్యోగి అయిన మాలిక్‌భాగో చెవిని పడెను. ఆతడు ఒక గొప్ప విందును ఏర్పాటుచేసి దానికి సాధువులతోసహా అందరిని ఆహ్వానించెను. నానక్ గొప్ప భక్తుడని విని ఆయనను కూడా ఆ విందుకు ఆహ్వానించెను. అయితే నానక్ అతని ఆహ్వానమును తిరస్కరించి అందులో పాల్గొన నిరాకరించెను. "నీచకులజులలో నైతం నీచు

లైన వా రున్నారు. వారికంటె నీచతరులు నీచతములూ కూడా ఉన్నారు. నానక్ ఇట్టివా రందరికి మిత్రుడు. గొప్పవారితో కలిసి పోటీ చేయు ఉద్దేశ్యము నానక్‌కు లేదు'' అని చెప్పి పిలువవచ్చిన వారిని పంపివేసెను.

ఈ జవాబు విని కోపోద్రిక్తు డయ్యెను. తనంతట తాను రాక పోయిన ఎడల నానక్‌ను బలవంతముగా నైనను పట్టి తెచ్చి తన సమక్షమున నిలువవలసినదని ఆజ్ఞాపించెను. మాలిక్ దూతల దురాగ్రహము పొగరుబోతుతనము చూచి నానక్ మొదట నిరాకరించెను కాని ఈ అవకాశము నుపయోగించి మాలిక్‌కు బుద్ధిగరప వలెనని నిశ్చయించుకొని తరువాత అందుకు అంగీకరించెను. ఆయన మాలిక్ భాగో భవనము చేరిన తరువాత తనకు వడ్డించిన పదార్థములను నానక్ తిన నిరాకరించెను. ఇంతమంది అతిధుల ఎదుట ఎందుకు యజమానిని అవమానించితివని ప్రశ్నించగా నానక్ అతి ప్రశాంతముగా ఇట్లు జవాబిచ్చెను :

''నీవు పెట్టిన విందుభోజనము రక్త ప్లావితము. పేదవాడైన లాలో ఇంట భోజనము పాలు, తేనెవలె మధురముగా రుచ్యముగా నుండును''. ఇట్టి అసందర్భపు నిర్ణయమునకు ఎట్లు రాగలిగి తన్న ప్రశ్నకు జవాబిచ్చుచు గురు విట్లు వివరించెను: ''లాలో సంపాదన కష్టార్జితము. అందుండి యథాశక్తి ఏ కొంచెమో అతిధి అభ్యాగతులకు పేదసాదలకు పెట్టును. అది మధురాతిమధురముగా రుచ్యముగా నుండును. ఇక నీ సంపాదన యందువా అది నీవేమియు కాయ కష్టము చేయకుండగనే లంచగొండితనము, దౌర్జన్య ప్రయోగము, నిరంకుశాధికార ప్రదర్శనములద్వారా ప్రజల నెత్తురు పిండి సంపాదించినది. ఇట్టి నీవు చేయు విందులో వడ్డించిన సమస్తము

అమాయకులు, నిరుపేదలు అయిన ప్రజల నెత్తుటి తడిసినదే తప్ప అన్యము కాదు.''[1]

ఈ సంఘటన చూచి భాగో ఎంతో సిగ్గుపడిపోయెను. ఒక గురు వెవ్వరో వచ్చి వర్ణవ్యవస్థను, నిరంకుశత్వమును ఇదివరకెన్నడూ కని విని ఎరుగని అపూర్వ ధైర్య స్థైర్యములతో ఎదిరించె నను వార్త దవానలమువలె దేశమంతయు వ్యాపించెను.

అక్కడనుండి గురువు హిందువులకు పరమ పుణ్యక్షేత్రమైన కురుక్షేత్రమును సందర్శించెను. ఆ రోజున సూర్యగ్రహణము. ఆ సందర్భమున అక్కడ గొప్ప తీర్థము జరుగుచుండెను. అక్కడకు వెళ్లుటకు ముందుగా గురునానక్ పానిపట్టు వెళ్లెను. ఇక్కడ ముస్లిమ్‌లలో సూఫీ తెగకు చెందిన గొప్ప గురువొక డుండెను. ఆయనపేరు షా షరాఫ్.

ఇతర సాధువులవలె కాకుండ గురునానక్ సంసారివేషము నెందుకు ధరించెనో ఈ షా షరాఫ్ ముందుగా తెలుసుకొన గోరెను. నానక్ ముండి ఏల కాలేదనికూడ ప్రశ్నించెను. ఆయన ప్రశ్నలకు నానక్ చెప్పిన జవాబులు ఇవి: ''ముండనము కావల సినది మనస్సుకుగాని శిరస్సుకు కాదు. పాదరజో లేశమువలె వినయ వినీతుడు కావడమే మనస్సుకు నిజమైన ముండనము. ఇక దుస్తుల మాట. ప్రతివారు భోగలాలసత్వమును అహంకార మును వదలి తన దైవము ఎదుట తలవంచవలెను. అప్పుడు ఎట్టి

1. ఇప్పట్టున గురునానక్ ప్రదర్శించిన అద్భుతావహ చర్యను పురాతన చరిత్ర కారులు కొందరు వర్ణించియున్నారు. నానక్ లాలో ఇంటినుండియు, భాగో ఇంటి నుండియు చెరొక రొట్టెను తెప్పించి అతిథులందరి ఎదుట పిండగా మొదటి దాని నుండి పాలు, రెండవ దానినుండి రక్తపు బొట్లు బయటకు కారినవట.

దుస్తులు ధరించినను అవి పవిత్రమైనవే కాగలవు. ప్రతివాడు బుధుల ఆదేశములను శిరసావహించవలెను. భగవంతుని మన సార సంస్మరించుటే సాధువులు ధరించదగిన వేషము. శారీ, టోపీ. మనమును నిగ్రహించి సుఖదుఃఖములయెడ సమబుద్ధితో శాంత శమదమాది గుణ సంపన్నుడై జీవయాత్ర గడపువానికి దుస్తులు ఏ తీరున నున్ననేమి?''

ఏ కులము, ఏ మతము, ఏ తెగ అన్న ప్రశ్నలకు గురు విట్లు జవాబు చెప్పెను: ''నాది సన్మార్గపు తెగ. నా కులము అగ్ని, వాయువుల కులము. నేను చెట్టువలె, భూమివలె జీవింతును. ఇత రులు నన్ను నరికినను, త్రవ్వి పోగులు పెట్టినను సహింతును. నది వలె నా మీదకు ఎవరైన పూవులు లేదా చెత్త విసిరినను లక్ష్య పెట్టను. చందనకాష్ఠమువలె సుగంధ పూరితమైనదేదో అదే సజీవ మైనదని భావింతును.''

భగవద్భక్తు డెట్లుండవలెనని షా షరాఫ్ తిరిగి ప్రశ్నించగా నానక్ ఇట్లు వివరించెను: ''బ్రతికియుండియు మరణించిన వాని వలె, నిద్రించియు మేల్కొనియుండు వానివలె, తెలిసి తెలిసి తన్ను దోచుకొనని నిచ్చిన వానివలె యుండవలెను. సుఖదుఃఖముల యెడ సమబుద్ధికలిగి విచారములేక, కోపములేక ఏమియుకోరక గర్వములేక యుండువాడే నిజమైన దైవభక్తుడు. నిశ్చలసమాధిలో భగవధ్యానము చేయుచు, భగవద్వాణి తప్ప అన్యము వినక, ఉన్నదానిలోను, లేనిదానిలోను సర్వములోను సర్వవ్యాపి ఉనికి గమనించ గలిగినవాడే నిజమైన దైవభక్తుడు.''

షా షరాఫ్ ఈ జవాబులు విని ఎంతో సంతోషించిన వాడై గురు నానక్‌కు పాదాభివందన మొనర్చి, కరము ముద్దిడి ''భాగవతశిరో

మణీ ని న్నిన్ని విధముల ప్రశ్నించుట నా అపచారము. నిన్ను దర్శించుట నిజమునకు భగవంతుని దర్శించుటయే'' అని అనేక విధముల ప్రశంసించెను.

నానక్ భక్తకోటిలో ప్రచారమందున పెక్కు కథలు గాథలను బట్టి ఆయనకు సమకాలికు లందరు పాటించెడి మత సంబంధమైన విధి నిషేధములందు, కర్మకాండయందు ఎట్టి విశ్వాసము లేకుండె నని తెలియుచున్నది.

కురుక్షేత్రమున శిష్యుడొకడు లేడిమాంసము తెచ్చి గురు నానక్‌కు కానుకగా సమర్పించెను. విధి నిషేధములు పాటించకుండ ఏది దొరికిన అదే తిని సంతోషించెడి స్వభావముగల నానక్, తన యీ శిష్యుని నొప్పింప నిచ్ఛగించక ఆయన తెచ్చిఇచ్చిన మాంస మును సంతోషపూర్వకముగా స్వీకరించెను. మర్దానా చేతికిచ్చి దానిని నిప్పులలో వేపమని చెప్పెను. మాంసాహారమున కియ్య కొనని స్థానికులు, గురువు అందునను సూర్యగ్రహణమువంటి పర్వదినమున మాంసభక్షణము చేయుటచూచి కోపగించుకొనిరి. ఈ కబురు విన్నవారెల్ల ఇది మహాపచారమని భావించి ఆగ్రహో దగ్రులైరి. వారిలో కొందరు బడితెలు కర్రలు తీసుకొని గురు నానక్ చెంతకు పరువిడిరి. మరికొందరు ఆయనను రాళ్లతో కొట్టి చంపదలచిరి. ప్రజలందరూ గుంపులు గుంపులుగా ఉద్రేకపూరి తులై తనపై దండెత్తి వచ్చుటను చూచి నానక్ వారి నుద్దేశించి ఇట్లు పలికెను: "మీరు ఇట్లు పిచ్చిఎత్తినవారివలె నాపై ఎందుకు దండెత్తి వచ్చినారు? నేను మీకు చేసిన అపచారమేమి?" ఆయన ప్రశాంత గంభీరవదనము చూచి, మృదు మధుర భాషణములు వినినంతనే గుంపులో కలవర మధికమాయెను.

"నీవు పుణ్యక్షేత్రమైన కురుక్షేత్రమువంటి తీర్థస్థానమున, అందునా ఇట్టి పర్వదినమున మాంసము వండించినది చాలక ఏమియు ఎరుగనట్లు అమాయకత్వమును నటించు చుంటివి కదా!" వారికి నానక్ తొణకక బెణకక ఇట్లు జవాబు చెప్పెను :

"ఇదివరకు ఎన్నడు మాంసము చూడనివారే ఇప్పుడు దానిని చూచి ఎంతో కలవరపడి పోవుచున్నారు. అయితే మాంసములో పుట్టి, మాంసమయ శరీరము ధరించి, మాంసపిండములైన తల్లి రొమ్ముపాలు త్రాగి, మాంసమయమైన జిహ్వాతో, మాంసమయమైన నీటితో సర్వము భుజించుచు, మరొక మాంసపు ముద్దను వివాహము చేసుకొని, మాంసమును సృష్టించుచు, మాంసమునకు ఊపిరిపోయు మానవులు ఎందుకు ఇంత రాద్ధాంతము చేయవలెను? మాంసమయులుకాని స్త్రీ పురుషులెవరైన ఉన్నారా?"

కాని గుంపులో జనము ఊరుకోలేదు. మానవులందరు మాంసములో పుట్టి మాంసముతో పెరిగి పెద్దవారైనప్పటికి స్వయముగా మాంసపు ముద్దలే అయినప్పటికి మాంసము తినుట పాపమనియే వాదించిరి. తిరిగి గురువు ఇట్లు జవాబు చెప్పెను : మనమందరము సమస్త ప్రాణికోటికి జీవనదాయి అయిన నీటిని త్రాగుట లేదా? నీరు మానవునికి, జంతువులకు, చెట్లకుకూడా జీవమిచ్చుచున్నది. జీవనదాయిని, స్వయముగా జీవము అయిన నీటిని మనము స్వీకరించక నిరాకరించుచున్నామా? ఇంతకు చెట్లలో జీవము లేదా? అవి కూడ మనవలె ప్రేమించుచున్నవి. అవి జీవించుచున్నవి. అవి కూడ మరణించును. అయితే మాంసము తినక మనుష్యులను పీడించి, వారి రక్తమాంసములు పీల్చి పిప్పిచేయు నరభక్షకుల మాట ఏమి?"

ఇదంతయు విని నానక్ మతిలేనివాడని భావించి గుంపులు ఆయ నను వదలిపోయిరి. మరికొంతమంది బుద్ధిమంతులు ఆయన చెప్పునదెల్ల సహేతుకమనియే మెచ్చుకొనిరి. వీరి నుద్దేశించి ప్రసంగించుచు గురువు ఇట్లు వివరించెను: "మహాజనులారా? నేను రుచులకోసమై భుజించుటలేదు. తను కష్టపడి సంపాదించిన దానిని ఎవరైన తెచ్చి ఇచ్చినచో నిరాకరింపక స్వీకరించుచుంటిని. అంతే. భగవంతుడు దయదలిచి ఏమి అనుగ్రహించిన దానిని స్వీకరింపకుండుట మహాపచారము కదా!"

హరద్వారమున పావనమైన గంగానది ఒడ్డున అనేకమంది సుస్నాతులై ప్రాగ్దిశాభిముఖముగా జలతర్పణములు విడుచుట చూచి అట్లెందుకు చేయుచున్నారని నానక్ వారిని ప్రశ్నించెను. వారును మరణించిన తమ పితరులకు ఆత్మశాంతికై తర్పణములు విడుచుచుంటిమని జవాబిచ్చిరి. అది విని నవ్వి నానక్, ఒక్కక్షణ మైన సందేహించక తాను పశ్చిమముగా తిరిగి నీళ్లుతోడ మొద లిడెను. ఇదిచూచి వారెల్ల ఆశ్చర్యపడిపోయిరి. ఇట్లెందుకు చేయుచుంటి వని వారు నానక్‌ను ప్రశ్నించగా ఆయన చెప్పిన జవాబు ఇది: "నేను భారతదేశములో పడమటి ప్రాంతములనుండి ఇక్కడకు వచ్చితిని. అక్కడ మా ఊరిలో నాకొక చిన్న పొల మున్నది. ఇక్కడనుండియే దానికి నేను నీరు అందించదలచి ఇట్లు చేయుచున్నాను. నేను బయలుదేరివచ్చిన తరువాత అక్కడ వానలు సరిగా కురిసినవో లేదో?"

ఇది విని తైర్థికులందరు ఆయన అమాయకత్వమును అపహ సించుచు ఇట్లనిరి: "నీవు చూడగా వయస్సు తక్కువేమీ కాదు.

ఇప్పుడిక్కడ నీవు వదలిన నీరు నీ పొలమునకు చేరజాలదని నీకు తెలిసియే యుండును."

నానక్: "మీరంతా ఎంతో విచిత్రమైనవాళ్లు. ఇప్పుడు నేను చల్లిన ఈ నీళ్లు కొన్ని వందలమైళ్లదూరమున నున్న నా పొలమునకు చేరజాలనియెడల, మీరు విడిచిన తర్పణములు పరలోకములోని పితరులకు అందునా?"

ఇది విని వారందరూ నిరుత్తరులైపోయిరి. అమోఘమైన ఆయన వాద పటిమను కాదనలేక తమ విశ్వాసమును గేలిచేయు చున్నాడని కోపము వచ్చినను నిర్ఘాంతపోయి మిన్నకుండిరి. వారిలో కొందరు గురునానక్ శిష్యులైరి. వారి నుద్దేశించి ప్రసంగించుచు నానక్ ఇట్లు ప్రబోధించెను.

"మనస్సును సచ్చింతనలతో నింపి, మంచిపనులే చేయువారి ఆత్మ ఇహపరములందెల్లప్పుడు శాంతిపొందును. భగవంతుని సంతోషపెట్టుటకై వారు ఇతరమేమియు చేయ నవసరము లేదు."

మరొకచోట నానక్ ఒక బ్రాహ్మణుని వంటఇంటిలో ప్రవేశించినంతనే సర్వము మైలపడిపోయెనని గృహమేధి ఆయన నెంతో కోపగించుకొనెను. అదిచూచి, చిన్నకులములవారైన తోడి మానవులయందు ఏహ్యాభావముతో సదా కోపిష్ఠిగా నుండువాని పాదస్పర్శతో ఆ వంటఇల్లు ఇదివరకే మైలపడిపోయెనని గురు నానక్ జవాబిచ్చెను.

ఈ మాటవిని ఆ బ్రాహ్మణుడు మరింత మండిపడిపోయెను. అదిచూచి గురు విట్లనెను: "అజ్ఞానమే తక్కువకులపు మాలింగిక. క్రౌర్యమే కసాయికత్తి. దోషభూయిష్ఠమైన హృదయమే పాకీమనిషి. మనస్సును కలుషితముచేయు కోపమే ఛండాలి. ఓ

బ్రాహ్మణుడా నాలుగు నీచకులములు లోనుండి మైలపరచుచుండగా పైపైన వంటఇంటి చౌకమునకు గిరి గీయుటవలన ప్రయోజన మేమి? ఇప్పటికైనను మించిపోయినది లేదు. సత్యము, సంయమము, సత్కృత్యములను గిరులుగాను భగవన్నామ సంస్మరణ మును స్నానముగాను స్వీకరింపుము. అప్పుడు భగవంతుడు నిన్నాదరించును.''

ఢిల్లీ సామ్రాట్టుకు చెందిన మదమాతంగ మొకటి హఠాత్తుగా మరణించెను. అందువలన తమ ఉద్యోగములు పోవునని మావటీంద్రు దుఃఖముతో దురపిల్లుచుండిరి. గురువు ఆగమన వార్తను విని వారు ఆయన చెంతకు పరుగు పరుగున పోయి ఎటులైనను ఏనుగును బ్రతికించుమని ప్రార్థించిరి. నానక్ వారిని ఓదార్చి ఇట్లు సలహా చెప్పెను: ''జనన మరణములు భగవంతుని చేతిలోనివి. ఆయన ఎప్పుడు ఎట్లు ఆజ్ఞాపించునో ఎవరికీ తెలియదు. అందెవ్వరూ జోక్యము కలుగచేసికొనలేరు. భగవదాదేశ మెట్లున్నను దానిని శిరసావహించి ఆనందముగా అనుభవించుటయే మేలు. కంఠములో కొనఊపిరి ఉన్నంతవరకు మేలుకోరి భగవంతుని ధ్యానించుటే ఉత్తమము. ఒకసారి భగవంతుడు ప్రాణము తీయ దలచినప్పుడు సంతోషముగా ఆయన ఆజ్ఞను ఔదలదాల్చుటే మేలు.''

గురువు హిందువులందరికి గొప్ప పుణ్యక్షేత్రమైన బృందావనమును సందర్శించినప్పుడు నాటక సమాజమొకటి కృష్ణలీలను ప్రదర్శించుచుండెను. అందు పాల్గొనిన నటులు కృష్ణునియందు భక్తిచే గాక బ్రతుకుతెరువుకై ఇట్టి నాటకములాడుట ఆయనకు నచ్చక పోయెను.

"శిష్యు లాడుకొనుచుండగా గురువులు హస్తపాద ముద్రలతో, తలాడించుచు అభినయము చేయుచుండెదరు. పాపము పిచ్చివారివలె వీరు తలనిండ దుమ్ము పోసుకుందురు.

ఇదంతయు మందిని మెప్పించుటకే కదా. తమలోని తృష్ణను సంతృప్తి పరచుటయే వారికి కాలక్షేపము.

వారు గోపికలవలె కృష్ణునివలె, సీతవలె రామునివలె వేషములు వేయుదురు.

భగవంతుని అనుగ్రహమునకు పాత్రుడైనవాడే ఆయనను సేవించును.

వాడు దినదినము ప్రాతఃకాలమున మనస్సులో ఉత్సాహము పొంగులు వారుచుండగా నిద్రలేచును.

నిజముగా బుధులైనవారి సూక్తులను సదా సంస్మరించును.

గానుగలు, రాట్నములు, చేతిమరలు, సారెలు గిరగిర తిరుగుచు నృత్యము చేయవా?

అలాగే ఎడారులలో సుడిగాలులు, బొంగరములు, కవ్వములు, నూర్పిడి యంత్రములు గిర్రున తిరుగవా? ఎగిరే పక్షులకు విశ్రాంతి ఎక్కడ?

గెంతుచు నృత్యము చేయువారు అసంఖ్యాకులున్నారు. వారంతా అలవాటుకు బానిసలు.

అలా గంతులువేసేవారంతా ఆ మత్తులో మనోల్లాసము పొందెదరు కాని చివరకు రోదించెదరు.

ఎందుకనగా దైవభీతి గలవాడే దైవమును ప్రేమించువాడు." అని అర్థము వచ్చు గీతమును ఆ సందర్భమున ఆశువుగా అల్లి వినిపించెను.

# 3

*''సత్యము అన్నిటికంటె గొప్పది*
*అంతకన్న గొప్పది సత్యజీవనము''*

—గురునానక్

ఈసారి గురునానక్ ప్రాగ్దిశాభిముఖముగా తన ప్రయాణము లను కొనసాగించెను. అప్పు డాయన వేషము అతి విచిత్రముగా నుండెను. మామిడిపండు రంగు అంగరఖా, దానిపైన తెల్లని కండువా, పైన తురకటోపీ, మెడలో ఎముకల దండ, నుదుట కావిబొట్టు. నిజము నది కలగాపులగపు వేషము. సగము హిందువులది, సగము ముస్లిములది. ఇట్టి వేషమును ఇదివర కెన్నడు వేయలేదు.

దోవలో ఒక ముస్లిమ్ సామంతుడు షేక్ వజీద్ పల్లకినుండి దిగెను. తక్షణమే బోయీలు, ఇతర సేవకబృందము ఆయనను చుట్టుముట్టి వింజామరలు వేయదొడగిరి. ఇద్దరు మార్గశ్రమము బాపుటకై ఆయన ఒడలు పట్టుచుండిరి. ఇదంతయు చూచి మర్దానా ఎంతో కలవరమంది గురువు నిట్లు ప్రశ్నించెను: ఓ భాగవత శిరో మణీ ఈ ప్రపంచములో న్యాయము లేదా? పల్లకిలో కూర్చుండి ప్రయాణము చేసినవాడు అలసిపోగా ఇంతదూరము తమ భుజ స్కంధములపై ఆయనను మోసికొని వచ్చినవారు సేద తీర్చు చున్నారు!'' గురువు: ''మర్దానా ఇదంతయు కర్మఫలము. చేసు కున్న వారికి చేసుకున్నంత. భగవంతుడు అందరినీ సమానముగా సృష్టించి సమానముగానే మానవజన్మ అనుగ్రహించినాడు. ఈ జన్మలో ఎవరిష్టము ప్రకారము వారు వృత్తిని చేపట్టవచ్చును.

కొంద రీ అవకాశమును సద్వినియోగము చేసుకుందురు. మరి కొందరు చేసుకొనరు. అందుకనే ఈ పృధివిలో కొందరు ఆనంద మనుభవించెదరు. ఎందరో బాధపడుదురు. కాని ఓ మర్దానా! భౌతిక సుఖములవలన ఆధ్యాత్మిక సంతృప్తి లేదా సుఖజీవనము దొరకునని భ్రమపడకుము. చివరకు ఆధ్యాత్మిక సాధనయే నిజ మైన ఆనందమును సౌఖ్యమును కలిగించును. ఈ నాడు సుఖముగా నున్నవాడు రేపు కష్టపడవచ్చును. కాని ఆధ్యాత్మిక చైతన్యము కల మనస్సు ఎల్లప్పుడు నిశ్చల సుఖానందము పొందుచుండును."

ఇక్కడినుండి ఫిలిభిత్ మీదుగా గోరఖ్ మఠమునకు వెళ్లెను. ఇది గొప్ప యోగుల కేంద్రము. అక్కడ ఆయన జరావృద్ధమైన ఒక రావిచెట్టు నీడను కూర్చొని యుండెను. వెంటనే అంతదనుక మోడువారియున్న ఆ చెట్టు పచ్చగా చిగురించెను. ఇది చూచి చుట్టుప్రక్కలనున్న వారందరు ఎంతో విస్మయపడిరి. ఆ చోటున నివసించుచున్న సిద్ధులు గురునానక్‌తో వాదమునకు దిగిరి. ఆయన ఎవ్వరనియు, ఎక్కడివాడనియు, ఎవరి శిష్యుడనియు పలువురు పలువిధములుగా ప్రశ్నించిరి. మర్దానాను పిలిచి శ్రుతి వాయించు మని చెప్పి గురువు ఈ విధముగా జవాబిచ్చెను

"ఓ ప్రభూ! నిన్ను తూచుటకు తక్కెడ, తూచువారు కలరా?
 రాళ్లేవి? పరీక్షకు లెవ్వరు?
నీకు వెలకట్టగల షరాబు ఉన్నాడా? నిన్నుగురించి తెలియ
 చెప్పగల గురువుండెనా?
ఓ నాప్రియా నీ అంతు నాకు తెలియదు.
ఎందుకనగా నీవు పృధివిని, జలములను పాతాళమును ఆకాశ
 మును పూర్తిగా ఆక్రమించుకున్న సర్వవ్యాపివి."

అంతట భగవంతుని గురించి తెలుసుకొనుట ఎట్లు, చూచుట ఎట్లు, అనుభవములోనికి తెచ్చుకొనుట ఎట్లు? అన్న ప్రశ్నలకు గురువు ఇట్లు జవాబిచ్చెను :

మనసే తుల. జ్ఞానమే పడికట్టురాయి. ఆయన సేవయే తూచువాడు. ఆయన మనస్సులోనే ఉన్నాడు. అక్కడే తూచవలెను, చూడవలెను, మననము చేయవలెను.

లేదా ఆయనకు ఆయనే తుల, ఆయనే జిహ్వా, ఆయనే తూకపురాయి, తూచువాడున్నూ. తన్ను తానే చూచువాడు, గుర్తించువాడు. తనకుతానే వ్యవహరించువాడు.

కాని గుడ్డివాడు, నీచుడు, దైవవిరోధి, నిత్య శంకితుడు, వారి వెంటనుండువారు భగవంతుని ఉనికి గురించిగాని స్వరూపమును గురించికాని ఎట్లు తెలుసుకొనగలరు ?''

అంతట ఆ యోగులు గురువు చెప్పినదంత నిజమే కావచ్చుగాని అనుభవము మాత్రము తమ పంథా ననుసరించిననే లభించునని వాదించిరి. అందుచేత నానక్ సైతము తమ వలెనే దుస్తులు ధరించవలెనని, తా మనుసరించిన యోగమార్గమునే అనుసరించవలెనని, సమాధి దశను చేరుకొని సచ్చిదానందమును పొందవలెననియు ఉద్బోధించిరి. వారికి గురువుచెప్పిన ప్రత్యుత్తరమిది :

యోగము చిరుగుల బొంతలో లేదు. యోగదండములో లేదు. లేదా వంటికలముకొను విభూతిలో లేదు. కుండలములలో లేదు. ముండిత మస్తకమున లేదు. కొమ్ముబూరాలో లేదు.

ప్రపంచ మలినముల మధ్య నివసించుచు నిర్లిప్తుడై నిత్య శుద్ధుడై యుండువానికి మాత్రమే ఆ దోవ తెలియును.

యోగము మాటలలో లేదు.

మానవు లందరిని సమముగా చూడగలిగినవాడే యోగి.
జీవించియు మరణించువాడు. అనాహత నాదము వినగలిగిన
వాడు, నిర్భయావస్థను చేరుకొన గలిగినవాడు, శంకలన్ని
తొలగినవాడు, చిత్తమును నిరోధించ గలిగినవాడు,
మనసున అమృతపు జల్లులు కురియువాడు, ప్రశాంత సంగీతము
లోలోన వినగలిగినవాడు,
మాత్రమే తన్నుతాను తెలుసుకోగలడు.''

ఇది విని ఆ యోగులందరు ముగ్ధులై గురునానక్‌ను ప్రశంసించుచు జయజయధ్వానములు చేసిరి.

అక్కడినుండి నానక్ బయలుదేరి మర్దానాతో కలిసి వారణాసీ పురమున కేగెను. ఇది హిందువులకు అత్యంత పవిత్రమైన పుణ్య క్షేత్రము. కబీరు, రవిదాసు వంటి మహాభక్తులకు జన్మస్థానము. గొప్ప సంస్కృత విద్యాకేంద్రము. ఆ రోజులలో అక్కడ చతుర దాసు అను గొప్ప సంస్కృత విద్వాంసుడొకడు నివసించుచుండెడివాడు. ఆయన గంగాస్నానమునకు పోవుచు గురునానక్ అపూర్వ వేషమునుచూచి ఒక్క క్షణమాగి హేళనగా మాట్లాడుచు ఇట్లనెను: ''నీ వెటువంటి సాధువువి. నీ మెడలో తులసిమాల లేదు. నీ చేతిలో జపమాల లేదు. సాలిగ్రామమైనను లేదు. విష్ణు శిలయైనను లేదు. ఇక నీకెట్లు ముక్తి లభించును?''

గురువు: ''ఊషరక్షేత్రమునకు నీరు పెట్టువాడు తన జీవితమును వృథా చేసుకొనును. ఓ బ్రాహ్మణుడా, భగవంతుని పూజింపుము. సత్ప్రవర్తనమను తులసిమాల ధరించి మనసులో దైవానుగ్రహముకై ప్రార్థించుచు భగవంతుని ప్రేమ అను నావ నధిరోహించిన ఎడల తరించెదవు.

ఉద్యానవనపు యజమానికి చెందినవాడు కృత్యములనే నూయిగా, గళమాలగా, చేదలుగా చేసి తన మనస్సునే ఎద్దుగా కట్టి ఆ నూతినుండి నీరు తోడిపోయును. తన పొల మును ప్రభుని అమృతధారలతో తడిపి తన మనోవాంఛి తమును సఫలము చేసుకొనును.''

చతురదాసు : ''నీవు చెప్పునది నిజమే కావచ్చు. కాని ఎల్ల ప్పుడు కామక్రోధములతో నిండియుండు మనస్సును జయించు టెట్లు ?''

గురువు : ''కామక్రోధములు రెండింటిని క్రరుగా సాగగొట్ట వచ్చును. ఎందుకనగా అవి శక్తితప్ప అన్యముకాదు కనుక. అవి మానవుని లొంగదీసుకొనుట కంటె మానవుడే వాటిని లొంగదీసు కొనుట మంచిది.''

చతురదాసు : ''కొంగ ఎప్పుడైన హంస యగునా ? దురదృష్ట వంతుడైన మానవుడు తన పురాకృతమును త్రోసివేసి జీవన విధా నము నెట్లు మార్చుకొనగలడు ?''

గురువు : ''దైవానుగ్రహ మున్నయెడల పురాకృతమంతయు పూర్తిగా తుడిచివేయబడగలదు. వినయవినీతులై ఆత్మార్పణ మొనర్చి భగవదేచ్ఛను గుర్తించి శిరసావహించగల వారికే దైవ కృప లభించును.''

చతురదాసు : ''అయితే విద్యలేకుండ విజ్ఞానమెట్లు కలుగును?''

గురువు : ''తెలుసుకొనుట వేరు. అర్థము చేసుకొనుట వేరు. రెండూ ఒకటికాదు. మేధ యున్నంతమాత్రమున వివేక మల వడదు. శరీరము బహు దుర్బలమైనది. హృదయము లేతది. అది

చెడు నిరోధించ జాలదు. అందుకనే ప్రతివారికి ఇద్దరు తల్లులు (ఆశ, కోరిక), ఇద్దరు తండ్రులు, (రాగము, ద్వేషము)."

చతురదాసు: "అటులైన మానవునికి విముక్తి లభించునా?"

"నీకు తెలియదా, చెట్లు చిగుర్చునప్పటికి దానిలో అగ్ని యుండు నన్న సంగతి. మనభూమి సముద్రమేఖల. అయినను అది సముద్రములో కొట్టుకొని పోవుచున్నదా? సూర్యుడు, చంద్రుడు ఒకే ఆకాశములో నుండుట లేదా? అంతమాత్రమున ఒకరి కొకరు విరుద్ధముగా సంచరించుచుండిరా?"

చతురదాసు. "దైవచైతన్యము కలిగిన వాని లక్షణము లేవి?"

గురువు· "వానికి భగవంతుడు సర్వవ్యాపి అని తెలియును. మన చుట్టు నున్నది మిధ్య అని తెలియును. అట్టివాని ప్రధాన లక్షణము వాని హృదయము దయతో నిండియుండును."

"అయితే పరమసత్యమును గుర్తించుటకు నా చదువు సంధ్య లేమైన ఉపకరించునా?" అంతట గురువు జ్ఞానమును గురించి, భగవంతుని గురించి వివరించుచు దైవదత్తము కానిదేదియు లేదను తన విశ్వాసమును పునరుద్ఘాటించుచు ఏబదినాలుగు పద్యము లల్లి చదివి వినిపించెను. దేవతలు, దేవుళ్లు, మనస్సు, వివేకము, విశ్వము, మానవుడు, మంచి, చెడు అన్నీ దైవదత్తములే యని నిరూపించెను. ఇతరము లన్నింటితో జోక్యము కలిగించుకొనకుండ భగవంతుని నామమును వ్రాసి సంస్మరించు కొనుటయే మంచిది." "దేవుడెట్లు కనబడును?" గురువు: "ప్రేమద్వారా. దేవుని ప్రేమించువానికి ఇతరమేమియు తెలియదు. అందరిని సమానముగా చూచును. సర్వభూతములందు దయకలిగియుండును.

తృష అతనిని అలరించదు. ఆత్మసంతృప్తి అతనిలో తొణికిస లాడుచుండును.''

గురువు చెప్పిన సమాధానములు విని చతురదాసు ఎంతో సంతోషించి ఆయన శిష్యుడాయెను.

అక్కడినుండి నానక్ గౌతమబుద్ధుడు తపమాచరించిన గయ క్షేత్రమున కేగెను. అక్కడి పండాలు కొందరు ఆయనను చుట్టు ముట్టి పితృశ్రాద్ధము చేయవలసినదని సతాయించిరి. వారికి ఆయన చెప్పిన జవాబు ఇది :

''భగవన్నామమే నాకు ప్రమిద దీపము, విచారమే దానిలోని నూనె. నేను ఈ దివ్వెను ఎంత ఎక్కువగా వెలిగించిన అంత ఎక్కువగా నా దుఃఖములు తొలగి పోవుచుండును. అందువలన ఆ తరువాత నాకు మరణబాధ ఉండదు.''

''భగవంతుని నామమే పార్వణపు ముద్దలు, ఆకు దొన్నెలు తర్పణములు, పుణ్యతీర్థములు నదులు స్నానములు. మానవులు సమర్పించేది భగవంతునకు. మెక్కేది బ్రాహ్మణుడు. అంతకన్న ఇహపరములందు వానిఆత్మకు శాంతిని ప్రసాదించవలసినదిగా భగవంతుని ప్రార్థించుట మంచిది. దైవానుగ్రహము వంటిది వేరొకటి లేదుకదా.''

నానక్ శిష్యసమేతుడై ముందుకు ప్రయాణము చేయుచుండగా మార్గమధ్యమున ఒక సంపన్నుడైన వర్తకుని ఇంట బిడ్డ పుట్టెనని పెద్దఎత్తున వైభవోపేతముగా పుత్రోత్సవములు జరుగు చుండెను. ఆ మరునాటి ఉదయము ఆ బిడ్డ మరణించినందున ఆ ఇంటినుండి ఏడ్పులు, పెడబొబ్బలు, హాహాకారములు మెండుగా వినవచ్చెను. ఇది చూచి మర్దానా గురువు నడిగెను: ''ప్రభూ !

మానవునకే సుఖదుఃఖములు వంతులు వేసుకున్నట్లు వరుసవారీగా ఎందుకు వచ్చును? మానవులు చచ్చుటకు మాత్రమే పుట్టు ఈ ప్రపంచములో శాంతి ఎట్లు లభించును?" గురువు: "జ్ఞానము లేకపోవుట చేతనే ప్రతివారు భోగలాలసులై పోవుదురు. అవి తరిగి పోయినప్పుడు మానవుడు బాధపడును. భగవధ్యానము చేసి కష్టసుఖముల పట్ల సమబుద్ధితో మనస్సును ప్రశాంతముగా నుంచుకొని, ద్వంద్వము లన్నియు భగవంతుని ఆశీఃఫలితమని భావించిన ఎడల మానవుడు బాధపడడు" అని చెప్పి నానక్ మానవుని నాలుగు అవస్థలను (బాల్యము, యవ్వనము, వార్ధక్యము, మరణము) వివరించుచు వాటిని రాత్రి నాలుగు యామములతో పోల్చుచు ఒక పద్దెమల్లి వినిపించెను. మొదటి యామమున తన్ను తాను మరచి ప్రవర్తించుననియు, రెండవ యామమున నిద్రించుననియు మూడవయామమున మేల్కొనుననియు, నాలుగవయామమున పశ్చాత్తప్తుడగుననియు కూడ ఆ పద్యములో వివరించెను.

దోవలో గురువు ఒకచోట మకాము పెట్టెను. అక్కడికి ఆయన భక్తుడొకడు తరచు వచ్చి పోవుచుండెను. మరొకడు అట్లే చేయదలచెను. కాని వానికి ఒక జారిణితో వానికి సన్నిహితసంబంధమేర్పడెను. వాడు గురూపదేశమును విస్మరించి విషయ సుఖములందే నిమగ్నుడాయెను. ఇట్లు కొంతకాలము గడచుసరికి విషయలాలసునకు బంగారు మొహిరీల పాతు దొరికెను. గురుభక్తునకు కాలియందు విషకంటకము గుచ్చుకొనెను. ఈ సంగతిని విన్నవించుచు, "ఓ గురూః నిన్ననుసరించువాడు శిక్షించబడెను. భోగలాలసుడైనవానికి బహుమానము లభించెను. దైవ లీల లతి విచిత్రము కదా!"

గురువు: బిడ్డా, ఆత్మసంతృప్తి, ఆనందము కలవేమో నీ గుండె నడిగి చూడుము. అటులే వానినికూడ అడుగుము. సదా కామాగ్నితప్తుడైన వాని మనసులో కూడా ఇట్టి శాంతి నెలకొని యున్నదేమో తెలుసుకొనుము. ఇంతకు ధనము సేకరించుట వలన ఈ లోకములో సుఖశాంతులు లభించవు. దివ్యపథముల ననుసరించుట వలననే మనస్సుకు, హృదయమునకు శాంతి, స్థైర్యము లభించగలవు. తనకు ఇప్పుడు అందుబాటులో నున్న సౌఖ్యములు దూరమై పోయినప్పుడు నీ మిత్రుడు ఎంతో దుఃఖించ గలడు. అయితే నీకున్న ఐశ్వర్యము తరుగనిది. నిప్పున కాల నిది, నీట మునుగనిది, సదా నీతోనే ఉండునది. క్షణిక సుఖముల కాశించిన వారు శాశ్వతానందమును పోగొట్టుకుందురు.

ఈసరికి గురువు ఒక గ్రామమును చేరుకొనగా, అక్కడి వారందరు ఆయనను ఎంతో ఆదరించి, అభిమానించి ఉపచారము లెన్నో చేసిరి. గురువు వారిని ఆశీర్వదించుచు "తక్షణమే ఇచ్చట నుండి సకుటుంబముగా తరలిపొండి" అని ఆజ్ఞాపించెను. పొరుగు గ్రామములో వారు ఆయనను అంతగా ఆదరించనే లేదు. అయి నను "మీరు ఇక్కడనే స్థిరముగా నుండుడని ఆయన వారికి శాప మిచ్చెను. ఇదిచూచి మర్దానా మనసులో ఎంతో కలవరపడెను. గురునిచూచి "ప్రభూ! నీ మార్గములు అతి విచిత్రములు. నిన్ను సేవించినవారిని ఇల్లువీడి పారిపొమ్మంటిరి. ఇతరులు నిన్ను అవ మానించినవారిని 'స్థిరోభవ' అని చెప్పిరి." గురువు: "ఓ మర్దానా! ఇతరులను ఆదరించినవారు నలువైపులకు వెళ్లి పోయిన ఎడల ఇతరులలోకూడ అట్టి సేవాదృష్టినే ప్రేరేపించ గలరు. ఇతరులను ఆదరించజాలని మూర్ఖులు ఉన్నచోటనే

ఉండిపోయిన ఎడల వారి దుర్బుద్ధిని ఇతరు లనుకరింప జాలరు కదా !''

ఈ విధముగా అనేకమైన మజిలీలు చేసుకొనుచు చివరకు నానక్ మర్దానా సహితుడై కామరూపదేశము (అస్సాము) చేరు కొనెను. అక్కడి స్త్రీలు అతి లావణ్యవతులు. పురుషులను మోహ పెట్టుటలో జాణలు. నూర్ షా ఈ సుందరసీమకు రాణి. మర్దానా యథాప్రకారము ఆకలిబాధ కోర్వజాలక, పట్టణములోనికి పోయి ఏదైన తినివచ్చుటకు అనుమతించవలసినదని గురువు నర్థించెను. వాడును పోయి పోయి రాణి భవనము చెంత నిలిచెను. వానిని చూచి రాణి లోనికి ఆహ్వానించి వాడు అమాయకుడని భావించి, వానిపై తన జాణతనము ప్రదర్శింప దలచెను. మర్దానా ఆమె అందచంద ములకు ముగ్ధుడై పూర్తిగా ఆమెకు వశుడై పోయెను. వాడు ఒడలు మరచి, గురువును మరచి రాణి వాసములోనే ఉండిపోయెను. వాడెంత కాలమునకు తిరిగి రాకపోయినందున వానిని వెదకి కొనుచు గురువు నగరములోనికి పోయెను. చూడగా మర్దానా ఒక సుందరాంగి చేతి కీలుబొమ్మయై ఆమె ఇంటిఖైదీగా పడియుండుటను గమనించి తన మిత్రుని ఇకనైన వదలిపెట్టవలసినదిగా ఆమెను ఎంతో ప్రోత్సహించెను. ఆమె వినకపోయెను. మర్దానా తనంత తాను వచ్చెననియు, అందువలన తాను వానిని విడువననియు స్పష్టముగా చెప్పివేసెను. పైగా ఆ జాణ గురువుపైనే తన ఎత్తు లను ప్రదర్శింపజొచ్చెను. ఆమె సైగలను నిరాకరించి గురువు ఇట్లనెను : "మట్టితో వ్యాపారము చేయునది అది ఇచ్చి, కస్తూరి పుచ్చుకొనజాలదు. సత్కృత్యములు పుణ్యకార్యములు చేయని వానికి నిజమైన ప్రియురాలు లభించదు.''

అంతట నూర్ షా తన నృత్య హావభావ విలాస ప్రదర్శనము లతో గురువును అలరించి లోబరుచుకొన జూచెను. ఆమె లావణ్యము, సోయగము, లాలిత్యము, నేర్పరితనము, హావభావములు అన్నియు పూర్తిగా ప్రయోగించి వశపరచుకొన జూచెను. సామాన్యులకు అట్టి వారి మాయా వాగురలనుండి తప్పించుకొనుట సాధ్యము కానే కాదు. గురువుమాత్రము ఏమీ చలించక ఈ పద్యమల్లి చదివెను :

"గుండెలో కోరికలు తాళములవలె గజ్జెలవలె మధురముగా మ్రోగుచున్నవి. ప్రపంచపు మద్దెల లయబద్ధముగా మ్రోగుచున్నది మహామునులుసైతం ఈ పాటకు అనుగుణ్యముగా గంతులువేసిన సమయములు లేకపోలేదు. ఓ ప్రభూ! అప్పుడు సంయమ లెక్కడ ? సర్వసౌఖ్యములు, ఆశీఃపరంపర అంతయు వ్యాపారపు సరుకులై క్రయవిక్రయములకు గురి యగుచున్నవి. అయితే ఎంతకాలము ఈ ఆనందము ? ఎంతకాలము అంతర్వాణిని, భగవంతుని విస్మరించగలరు ? మానవులలో దయలేదు. ప్రభువులలో న్యాయములేదు. కాని ఈ సుందరోద్యానమునకు తాను అతిధిని మాత్రమేనని గుర్తించి మాయావాగురలలో చిక్క భగవంతునికి దూరము కానివాడే ఉత్తముడు. స్వీకారయోగ్యుడు !"

అంతట తమ సంపదలు, ఇతర వైభవము ప్రదర్శించి గురునానక్‌ను మభ్యపెట్టవలసినదని నూర్ షా తన చెలికత్తెలకు ఆజ్ఞాపించెను. వారును గురువుకు సమర్పించుటకై బంగారము, ఆభరణములు, అత్తరులు, దుస్తులు, రుచ్యములైన భక్ష్య భోజ్యములు ఎన్నింటినో తెచ్చి ఆయనకు సమర్పించిరి. కాని గురువు ఎంత మాత్రము చలించక మరొక పద్యమల్లి చదివి వినిపించెను.

"ఓ మూర్ఖ మానినులారా! మీ సౌందర్యము, సంపద చూచుకొని మీ రెందుకు గర్వించుచున్నారు? మీ మనస్సులో, హృదయములో నున్న మీప్రియుని చూచి మీ రెందుకు సంతోషించరు. మీకు అతి దగ్గరయైన వాటికంటె దగ్గరయైన వాడుండగా దూర తీరములలో, బయలు ఎక్కడో అన్వేషించబోయెద రెందుకు? ఆయన భయమే మీకు కాటుకగాను వాని ప్రేమయే మీకు ఆభరణములుగాను భావించి ధరించుడు. అట్లుకాక మీరు వానిని ప్రేమించక, వానిపై మీ జిత్తులు ప్రయోగించి, వానిని సంతోషపెట్టుటకు ప్రయత్నించక, మనసునిండ దురాశ నింపుకున్నఎడల వాడును సంతోషించడు. మీరు ఆయన ఇచ్ఛకు మనస్ఫూర్తిగా లోబడిన ఎడల, ఎల్లప్పుడు ఆయన పాదములచెంతనే బంధితులై పడియున్న ఎడల, తను మనములను ఆయనకే అంకితము చేసినఎడల స్వామి మిమ్ము ప్రేమించి తనవారుగా స్వీకరించును. నానక్ చెప్పెను: తన ప్రేమలో తన సర్వమును సంలీనమొనర్చుకొన్నదే సుందరి, వివేకి, జాణ అన్నిను."

నానక్ ఈ విధముగా అందచేసిన సందేశమును విని నవ్యోత్తేజమును పొంది నూర్ షా అతని ఎదుట చేతులు జోడించి నిలిచి, తన అపచారమును మన్నించి, శిష్యురాలిగా స్వీకరించి అనుగ్రహించవలసినదని పరిపరి విధముల ప్రార్థించెను. గురువును అట్లేయని ఆమెకు ఈ విధముగా ఉపదేశించెను: "నీ వేపని చేయుచున్నను భగవంతుని సదా సంస్మరించుచున్నఎడల నీవు భగవదనుగ్రహమునకు పాత్రమై ముక్తి నందుదువు." ఆమె మర్దానానునై తము విడుదల చేసెను. వాడును నానక్ పాదములపైపడి తాను

ఎల్లప్పుడూ గురువుచూపిన త్రోవను తప్పిపోకుండునట్లు ఆశీర్వదించవలసినదని ప్రార్థించెను.

ఇక్కడినుండి గురువు ఆయన శిష్యుడు అరణ్యసీమలకు వెళ్లిరి. ఆ సమయమున ముసలిచీకు మ్రానులను కూకటివేళ్లతో పెల్లగించుచు హోరుగాలి వీచుచుండెను. వెంటనే మరి కొంచెము సేపటికి ఉరుములు మెరుములతో కుండపోతగా వాన కురిసెను. ఆకసము మేఘావృతమయ్యెను. మధ్య మధ్య మెరుపు మెరిసినప్పుడెల్ల అగ్నికీలలవలె రక్తపుటేరులవలె ఎఱ్ఱగా కనబడుచుండెను. ఇదిచూచి మర్దానా భయకంపితుడయ్యెను. "గురూ, నీ చైదము లతి విచిత్రములు. నీ విప్పుడు నన్ను ఈ నట్టడవి మధ్యకు తీసుకువచ్చితివి. ఇప్పుడిక్కడ నేను మరణించిన ఎడల నన్ను పాతిపెట్టుటకుకూడ ఎవ్వరు దొరకరు. బహుశా అడవిజంతువులు నా మాంసమును పీకికొని తినును కాబోలు" అని ఏడువదొడగెను. వానినిజూచి నానక్ నవ్వి ఇట్లనెను:

"మర్దానా! చావు పుట్టుకలు రెండును భగవంతుని చేతిలో నున్నవి. దైవభయము సమస్త ప్రపంచమును, ఆకాశమును సర్వభూతములందును నిండియున్నది. కనుక నిర్భయుడైన తన శాశ్వతప్రభుని యందును రక్తుడైవాడు దేనికిని విచారించవలసిరాదు".

గురుశిష్య లుభయులు ఇట్లు చర్చించుకొనుచుండగా సగము మానవరూపముననున్న వన్యమృగమొకటి భయంకరాకారము కలది వారిని సమీపించెను. గురువు వానినిచూచి "సోదరా, నీ వెవ్వరవు? వేళకానివేళ మావద్ద కెందుకు వచ్చితివి?" వాడు జవాబిచ్చెను కదా: "నేను కలియుగము ఆత్మను. నేను నిన్ను మభ్య

పెట్టుటకై వచ్చితిని. నేడు నీవు చూచిన భయంకర చైదము లన్నియు నేను కల్పించినవే. అయినను నీవు భయపడలేదు. అందు చేత నేను స్వయముగా నీకు బంగారు, జవహారీ, దివ్యప్రాసాద ములు, అపరూప సుందరాంగులను సమర్పించి నిన్ను నాదోవకు త్రిప్పుకొన దలచితిని. నిన్నుచూచి ఇతరులుకూడ నన్ననుస రించుదురని నా ఆశ."

గురువు మర్దానాను పిలిచి శ్రుతిని వాయింపుమని చెప్పి ఈ క్రింది పద్య మల్లెను :

"ముత్యములతో నిర్మించి రత్నములు పొదిగి, కస్తూరి వాసన
పూతలుపెట్టి కుంకుమపువ్వు చందనము వగైరా సుగంధ
వస్తువులు చేర్చిన భవనములో
భూమి వజ్రములతో వైడూర్యములతో పొదగబడినప్పుడు,
సుందరాంగులు మణులవలె మెరయుచు హావభావ
లావణ్యముతో నన్నలరించునప్పుడు నైతము నేను
నా దేవుని చేయి విడువను, ఆయన నామము ఆధారమును
వదలను.
నేను సమాధిగతుడనై సిద్ధుడు కౌగలిగినను, మహిమలు
చూపగలిగినను,
ఇచ్ఛానుసారము దృశ్యాదృశ్యుడను కౌగలిగినను, ప్రజలందరు
ఇందుకు నన్ను మెచ్చుకున్నను,
నేను నా దేవుని చేయివిడువను, ఆయన నామము ఆధారమును
వదలను.
నేను సామ్రాట్టునై సింహాసన మలంకరించినను నా ఆజ్ఞలను
శిరసావహించు అక్షౌహిణులు ఎన్నో నాకున్నను,

ఓ నానక్ అవి అన్నియు గాలివలె వృధాయైనవి.
అయినను కేలూని కాపాడవలసినదని భగవంతుని వేడి
కొందును."

ఇట్లు నానక్ తా నెన్నివిధముల మభ్యపెట్టి జూచినను లొంగ కుండుట గమనించి ఆ భూతము ఆయన పాదములపైపడి 'ఓ నానక్ ని న్ననుసరించు వారందరికి నేను సమస్త సంపదలను అనుగ్రహించెదను కాని వాని మనశ్శాంతిని మాత్రము చెడ గొట్టను.

అస్సామునుండి బ్రహ్మపుత్రానదిలో పడవ ప్రయాణముచేసి బంగాళాఖాతముద్వారా పూరి క్షేత్రమును చేరుకొనెను. ఇక్కడ విష్ణుడైన కృష్ణుడు జగన్నాధుడను పేర పూజలందుచున్నాడు. అక్కడ సాయంకాలమున పూజారులు హారతి ఇచ్చుచు జగన్నాదుని విగ్రహముచుట్టు ప్రమిదలలో వెలిగించిన దీపములను వెండి పళ్లెములలో నుంచి, దూపము వెలిగించి ప్రదక్షిణ చేయుచుండగా గురువు వారి నిట్లు ప్రశ్నించెను: "ఇదంతా ఏమిటి?" పూజారులు : జగన్నాధుని పూజించు విధానమిది. ఇతరు లందరి వలెను నీవు నైతము పూజలో పాల్గొనవలెను. ఆ సమయమున గురువు అద్భుతము మనోహరము అయిన గీతమల్లి వినిపించెను:

"గగనమే థాళి. సూర్యచంద్రులు దివ్వెలు. తారకలే అందు
పొదిగిన రత్నములు.
మాలయాచలముమీది చందనము సువాసనలను వెదజల్లును.
భూమిలోని పుష్పముల పరిమళమును గంధవహుడు
అందించును.

ఈ విధముగా పూజ జరుగును. భయ నిర్మూలికి నీ మాట
అనాహత శబ్దము.
నీ ప్రపంచమంతట ప్రతిధ్వనించును.

సహస్రములు నీ కనులు అయినను నీకు కనులున్నవా ?
సహస్రములు నీ రూపములు అయినను నీకొక రూపుకలదా ?
సహస్రములు నీ పాదములు అయినను నీకు పాదములు
కలవా ?

సహస్రములు నీ నాసికలు అయినను నీకు నాసిక కలదా ?
అద్భుతములలోకెల్ల అద్భుతము నీవు.

అన్ని హృదయములను వెలిగించు వెలుగువు నీవు. గురూప
దేశముననే అది వ్యక్తమగును.

ఓ! మనుజులార, నా దేవుని మెప్పించునదే పూజ.
భ్రమరమువలె నా మనస్సు ఆయన చరణ మధువును గ్రోల
నుంకించుచున్నది. కోరుచున్నది.
ఓ ప్రభూ నానక్‌ను, నీ చాతకమును నీ కరుణామృత సృష్టిచే
అనుగ్రహింపుము.
వాడు నీ నామములో లీనమగుగాక.''

గుడిలో పూజారులు నానక్‌తో వాదించుట లాభములేదని తలచి మిన్నకుండిరి.

పూరీ పట్టణములో నున్నప్పుడు నానక్ ఇంద్రియ నిగ్రహమును సాధింపదలచి తన కన్నులు, ముక్కులు మూసికొన్న ఒక బ్రాహ్మణుని కలుసుకొనెను. ఈ విధముగా తను చిత్తైకాగ్రతను సాధించ

గలిగితిననియు, ఇతరుల రహస్యాలోచనములను కనిపెట్టగలుగుదు ననియు దంభములు పలికిన వానిని గురువు పరీక్షించదలచెను. వాని ముందున్న కమండలవును తీసి వాని వెనుకను పెట్టి ఇప్పు డెక్కడున్నదని ప్రశ్నించెను. ఇక్కడ, కాదు, అక్కడ, కాదు, ఇక్కడ, కాదు అక్కడ అని పరిపరివిధముల ఊహించి ఊహించి ఎన్నిసార్లు చెప్పిన అన్నిసార్లు తప్పుకాగా విసిగి వాడు తన ఓటమి నంగీకరించెను. అంతట గురువు ఈ క్రింది పద్యమును ఆశువుగా ఉపదేశించెను.

"మానవులకు కాలముసంగతి తెలియదు, యోగసారము తెలియదు, సత్యమార్గము తెలియదు.
పుణ్యతీర్థములను కలుషిత మొనర్చిరి, రూపుమార్చిరి.
అయ్యో సమస్త ప్రపంచము మునిగిపోయెనుకదా.
కలియుగములో మానవునికి మోక్షసాధనము భగవద్భక్తి.
మానవులు వృథాగా ముక్కులు చెవులు మూసికొని తాము ముల్లోకములను చూచుచుంటి మందురు.
కాని వారు తమ వెనుక నున్నదానినే చూడలేరు. ఎంత విచిత్రమిది?"

# 4

*"సాధువొక్కడే సత్యము పలుకును*
*ఎందుకనగా వాడు పలుకునది తాను చూచునదే"*

—గురు అర్జున్

గురునానక్ పంజాబ్‌కు తిరిగివచ్చెను. ఆయన గృహస్థువలె దుస్తులు ధరించి, 13-వ శతాబ్దికి చెందిన ముస్లిమ్ సూఫీ షేక్ ఫరీదుద్దీన్, *గంజ్-ఐ-షకర్* దర్గాను దర్శించెను. గృహస్థువలె దుస్తులు ధరించి వచ్చిన నానక్‌ను చూచి దర్గాసంరక్షకుడు షేక్ బ్రామ్ (ఇబ్రాహిమ్) ఇట్లనెను :

"ఎవరైన భగవంతునైన కోరుకోవలెను, ప్రపంచమునైన కోరుకోవలెను.

కాని ఎవ్వరూ రెండు పడవలపై కాళ్లు పెట్టకూడదు, మునిగి పోయే ప్రమాదముంది."

నానక్ : రెండింటిని ఎందుకు వాడుకో కూడదు. ఒక దానిలో సరుకులు పెట్టుకోవచ్చు, రెండవదానిలో ఆత్మను పదిల పరచుకొనవచ్చును.

అట్టివానికి పడవ మునగడమంటూ ఉండదు. నష్టమూ ఉండదు. అసలు ఇంతకీ పడవ ఎక్కడ ? నీరు ఎక్కడ ?

వాడు సత్యస్వరూపుడు, సర్వవ్యాపి అయిన భగవంతుని సరకును మాత్రమే గుర్తించుకొనును."

అంతట వారుభయులకు ఆధ్యాత్మిక సంబంధమైన సంభాషణ జరిగెను. షేక్‌బ్రామ్ దేవునిగురించి, మానవుని గురించి, ప్రపం

చము గురించి, తన విశ్వాసములను - వివరించుటకై ఎన్నో గుర్తులు, ఉపమానములు వాడుక చేసెను. ఈ ప్రపంచమంతయు లోనిమాయకు లోబడి మోహితులై యున్నారు. ఇట్లు చూచు చుండగనే క్షేత్రమంతయు చెడిపోవుచున్నది."

గురువు తన జవాబులో వారికి అదే ఉపమానము నుపయోగించెను: "మానవులు ఆదినుండి మాయామోహితులై యున్నారు. అయితే తన క్షేత్రమును జాగ్రత్తగా చూచుకొనువానికి నష్ట ముండదు."

ఇబ్రాహిమ్ : "నా బల ముడిగినది. నా మనస్సు విరిగినది. నా శరీరము చేష్ట లుడిగినది. నా రోగములను నివారించగల ఔషధ మును తెచ్చిపెట్టుము."

నానక్ : "నీకు వైద్యుడు సత్యమే. అది నీలోనే ఉన్నది. బయట లేదు. బయటనుండి వానిని పిలిపించుట కల్ల. తన ఆత్మలో నున్న వానిని తానే గుర్తించవలెను."

ఇబ్రాహిమ్ విచారించుచు ఇట్లు చెప్పెను : "వ్యవధి యున్నప్పుడు నేను పడవను కట్టుకోలేదు. ఇప్పుడు నదికి వరదలు వచ్చినప్పుడు నేను ఎట్లు దాటగలను? ఓ ప్రియా, పువ్వును తాకకుము. అది వాడిపోగలదు. ఆత్మ బలహీనముగా నున్నది. ప్రియుని ఆదేశము దుర్భరముగా ఉన్నది. ఒకసారి పాలు పిండి వేసిన తరువాత ఆవు మరల వెంటనే చేపునా? అలాగే మన జీవితముకూడ. పరలోకమునుండి పిలుపువచ్చును. హంస ఆత్మ దుఃఖితమగును. మట్టి మట్టిలో కలిసిపోవును."

నానక్ ఎంతో ఆశాభావముతో జవాబిచ్చెను: "ధ్యానము ఆత్మ సంయమము అను పడవను నిర్మించుకొన్నవానికి తరించుట సుల

భము. అట్టివానికి కోపముతో పొంగులువారు నది కానరాదు. దోవ పూర్తిగా సుగమ మగును. తన చెంగులో గుణములను చేర్చుకొన్న వారిని భగవంతుడే చేపట్టును. అహమును, చెడును, విడనాడినయెడల దేవుడు ఎన్నటికి విసర్జించడు.''

షేక్ ఇబ్రాహిమ్ : ''నీవు చెప్పుదానితో నేను పూర్తిగా ఏకీభవించుచున్నాను. కాని జీవితవృక్షము రాత్రి ప్రధమయామమందే పూచును. ఉదయమున అది ఫలించును. రాత్రియంతయు జాగరణము చేసినవాడే దన్యుడు.''

నానక్ : ''దాతయైన దేవుని చేతిలోనే సర్వసంపద లున్నవి. కొందరు మేలుకొని ఉన్నను ఆయన చూడకయే ముందుకు సాగిపోవును. మరికొందరు నిద్రపోవుచున్నను లేపి ఆశీర్వదించును. తన ప్రయత్నములకు పలితముగా మానవుడు ఆనందమును పొందగలిగిన ఎడల భగవంతునివలని, ఆయన కృపవలని ప్రయోజనమేమి? ప్రయత్నములు తాను చేసినప్పటికి పలితమును మాత్రము భగవంతునికి సమర్పించవలసి యున్నది. అప్పుడే అహము నశించును. భగవదనుగ్రహము లభించును. లేదా ఆత్మశక్తి క్షీణించి బేరసారములు చేయు విఫణి వీధిగా మారిపోవును.'' అని చెప్పి ఈ క్రింది పద్యమును ఆశువుగా వినిపించెను :

''ఓ ప్రభూ నీవు నాచెంత నున్నప్పుడు నాకు అన్నీ ఉన్నవి.
నీవేకదా ప్రియా, నాకు మూలధనానివి.
నేను నీలో ఉన్నప్పుడు నాకు శాంతి కలిగినది. ధన్యుడ ననుకొంటిని.
నీవు దయచేసి మానవునికి ఆసనమును శోభను అనుగ్రహించితివి.

నీ సంకల్పము వల్లనే మానవుడు బిచ్చగాడైనా, విచారించినా.
నీ సంకల్పము వల్లనే నదులు ఎడారులలో ప్రవహించును.
నీ సంకల్పము వల్లనే గగనములో తామరలు వికసించును.
నీ సంకల్పమువల్లనే మేము దుస్తరసముద్రమును తరింతుము.
నీ సంకల్పము వల్లనే నట్టేట మునిగిపోదుము.
నీ సంకల్పము వల్లనే నీవు పరిశుద్ధుడవుగా సుందరముగా
కానిపింతువు. నీ స్తుతిలో సంలగ్నమగుదురు.
నీ సంకల్పమువల్లనే నీవు భయంకరముగా కానిపింతువు.
రాకపోకలలో ఒకడు పూర్తిగా అలసిపోవును.
ఓ ప్రియా, నీవు అగమ్యుడవు .అసమాన అనుపమమూర్తివి.
ఈ మాటలతో నేను నీకు ఆత్మార్పణ చేసుకొనుచున్నాను.
ఓ ప్రభూ, నేను నీ నుండి కోరునది నీ దర్శనము మాత్రమే.''

షేక్ ఇబ్రాహిమ్‌కు సైతము తన పూర్వీకుడైన బాబాఫరీద్ *గంజ్-ఐ-షకర్* వలె ఆధ్యాత్మికౌన్నత్య సాధనను, అన్నాతురత్వ నిర్మూలనకు ఆయన ఓపినన్ని దినములు ఉపవాసము చేయుచుండు వాడు. ఎవడైన తినుబండారములు కానుకగా తెచ్చినప్పుడు తాను ఇదివరకే భుజించితినని చెప్పి వాటిని నిరాకరించు చుండును. ఒక నాడు నానక్ సమక్షమున కూడ ఇట్లే చెప్పి ఆ వచ్చినవారిని పంపివేయ జూచెను. కానుక లివ్వవచ్చిన వ్యక్తి కోపగించుకొని ఇట్లనెను : ''పూర్వము ఒకడు మనస్సులో కోరిక పీకుచున్నను భోజనము చేసితి నను మిధ్య సంతృప్తిని కాంక్షించి పొట్టకు కొయ్యరొట్టెను కట్టుకొని ఆకలిలేనట్లే నటించుచు తిరుగువాడు. వానిని నీవు ఇతర విధములకూడా అనుకరింతువా ?'' అని

ముదలకించెను. ఈ మందలింపు షేక్ బ్రాహ్మ్ మనస్సులో గాఢముగా నాటుకొనెను. అంతట ఆయనను నానక్‌ను ఈ విధముగా వేడుకొనెను: "నా గతి ఏమికావలెను? నేను నిజమునకు ఉపవాసము చేయుచున్నను అబద్ధము లాడుచుంటిని. నా మనస్సులో కోరిక పీకుచున్నను నేను భోజనము చేసితినని అందరికి చెప్పుచుంటిని."

గురువు: "జీవితావసరములను తీర్చుకొనకుండా ఉండుట పాపము. సుఖలాలసత్వము పనికిరాదు కాని దైవమేది అనుగ్రహించిన దానిని కృతజ్ఞతతో స్వీకరించి అనుభవించవలెను. ఆకలికి మాడియుండుట వలన ఆధ్యాత్మికానందము కలుగదు." తన వాదమును సమర్థించుకొనుటకై ఆయన కబీరు సూక్తులను ఉల్లేఖించెను. "అన్నము మాని భగవంతుని ప్రేమ పొందితినని భ్రమసిపోవువారు తాళికట్టిన భార్యవంటి వారు కాదు. నియమనిష్ఠలతో జీవనము గడుపు వితంతువు వంటివారూ కారు. సౌష్ఠవమైన శరీరము లేనిదే భగవంతుని ప్రార్థించజాలము, గుర్తించజాలము. ఆధ్యాత్మికోన్నతికి ఉపవాసముకాని ఆత్మ నిరాకరణము కాని సాధనములు కావు. ఆత్మార్పణ, ఆత్మసంతృప్తి, కారుణ్యము, వినయము అందుకు అమోఘసాధనలు."

ఈ సంభాషణాక్రమమంతయు విని షేక్ ఎంతో సంతోషించెను.

అక్కడినుండి బయలుదేరి మర్దానా సహితుడై గురువు ఒక చిన్న ఎడారి మీదుగా తన ప్రయాణమును కొనసాగించెను. దోవలో వారికి తినుట కేమియు దొరకలేదు. మర్దానా ఆకలి బాధకు తాళలేకపోయెను. "ప్రభూ! నా కేమి కానున్నది? చెప్పుము. నీవు కనీసము నన్ను ఆకలికి మాడ్చి చంపవను ఆశతో

నీ వెంట వచ్చితిని. ఇప్పుడు ఆకలి నా గుండెను నులిమివేయు చున్నది. కడుపు నింపుకొనుటకు ఇక్కడేమియు కనబడకున్నది.'' అంతట నానక్ ఆ సమీపమున నున్న అడవిచెట్టు నొకదానిని చూపి దాని ఫలములను భుజించమని ఆదేశించెను. ఆకలి తీరువరకు మాత్రమే తినవలసినదనియు, వెంట ఒక్క పండైన తెచ్చుకొన వలదనియు కూడ ఆజ్ఞాపించెను. వల్లెయని మర్దానా కడుపునిండుగ ఆ పండ్లను మెక్కెను. కాని గుర్వాజ్ఞను ధిక్కరించి కొన్ని పండ్లను జేబులో వేసుకొని వచ్చెను. మర్నాడు ఉదయమున తిరిగి ఆకలి వేసినప్పుడు వాటిని పూర్తిగా భుజించెను. తినీ తినగానే కడుపులో పోట్లు ప్రారంభమాయెను. బాధ భరించలేక పోయెను. ఏమి జరిగినదని గురువు ప్రశ్నించగా తను వేసిన తప్పిదము నంతను ఆయనకు విన్నవించుకొనెను. అది విని గురువు నవ్వి ఇట్లనెను: ''బిడ్డా! మానవుడిట్లే బాధపడును. నేటికి కావలసినదే కాక రేప టికి కావలసిన దానికై కూడ భగవంతునిపై ఆధారపడకుండ శ్రమపడును. ఈ విధముగా సంపాదించి దాచుకున్న ఆహారము మర్నాటికి పాసిపోవును. దానిని ఎవ్వరు దోచుకొనక పోయినను ఇతరుల మనస్సులో ద్వేషమును బాధను కలిగించును. అందుకనే మిగిలిన వాటిని దాచుకుని తిన్నవానికి బాధ తప్పదు.'' మర్దానాకు కొంచెము నేపటికి బాధ తగ్గిపోయినది. వాడు ఇంటికి తిరిగిపోవుద మని పట్టుబట్టెను. 'నీతోబాటు నేను ఆకలికి ఇంతమాత్రము తాళ జాలను' అని రోదించెను. నానక్: ఓ మర్దానా! నేను నిన్ను ఆశీర్వదించుచున్నాను. ఇహపరములయందు నీకు సుఖము కలుగు గాక! నీవు రక్షింప బడెదవు. నీవు మున్నెవ్వరు ప్రదర్శింపని విధముగా నా యందు భక్తిశ్రద్ధలు ప్రదర్శించితివి. సేవలు చేసి

తివి. వీటిని నేను ప్రాణాధికముగా భావింతును. ఇక నీవు నిశ్చింతగా నీ ఇంటికి మరలిపోవచ్చును. మర్దానా వెంటనే నేలకొరగి గురువుకు పాదాభివందన మొనర్చెను. ఆయన వానిని లేవనెత్తి కౌగలించుకొని, గుండెలకు హత్తుకొని సంతోషించి ఇట్లనెను: "బిడ్డా! నీవు పొమ్ము. నీ వెనుకనే నేనును వచ్చెదను. కాని నే నెక్కడ నున్నది ఎవ్వరికి చెప్పకుము.''

మర్దానా తల్వాంది గ్రామమునకు తిరిగిరాగానే నానక్ తల్లి ఎంతో సంతోషించెను. ఉత్సాహోద్రేకములు పొంగులువార ఆమె మర్దానాను సమీపించి "నా కుమారు డెక్కడ? అని ప్రశ్నించెను. వాని ముఖము తిరిగి నాకెప్పుడు కనబడును?''

ఆమె ప్రశ్నలన్నింటికి మర్దానా ఏమియు జవాబు చెప్పలేదు. తనవారి నందరిని చూచి అక్కడినుండి వెడలిపోయెను.

మర్దానా ఇంత హఠాత్తుగా, వచ్చినవాడు వచ్చినట్లే వెడలిపోవుటకు నానక్ ఆదేశమే కారణమై యుండవచ్చుననియు, నానక్ సైతము ఆ చుట్టుప్రక్కల యుండి యుండవచ్చుననియు నానక్‌తల్లి ఊహించెను. గ్రామమునకు మూడుమైళ్ళలోపుగానున్న ఒక తావున మర్దానా నిలిచిపోయెను. నానక్ తల్లి ఊహించినట్లే తన కుమారుడు కూడ అక్కడే ఉండెను. ఇన్నాళ్ళకు, ఇన్నేళ్ళకు తన కుమారుని చూడగలిగినందుకు ఆమె ఎంతో సంతోషించెను. తల్లినిచూచి నానక్ పరుగెత్తుకొని ఎదురేగి ఆమెకు పాదాభివందన మొనర్చెను. తల్లి ఆయనను కౌగలించుకొని ముద్దాడి, చెమర్చిన కళ్ళతో తల నిమురుచు ఇట్లనెను: "నాయనా! నీవు బలిహారివి. నీవు మెట్టిన ప్రతిచోటు పరమపవిత్రమైనది. నిన్ను దర్శించిన

ప్రజలు ధన్యులు. నిన్ను కన్నందుకు నీతల్లి ధన్యమైనది. దేవుని దయవలన నిన్ను తిరిగి చూడగలిగితిని!''

నానక్ సైతము ఉద్రేకముతో ఏమియు మాట్లాడజాలక పోయెను. తల్లి ఆయనకు కొన్ని మిఠాయిలను తిననిచ్చెను. నానక్: ''అమ్మా నాకు ఇదివరకే కడుపు నిండినది.'' తల్లి అడిగెను: ''నీవు ఎప్పుడు తింటివి? ఏమి తింటివి?''

నానక్ మర్దానాను పిలిచి శ్రుతివాయింపుమని చెప్పి క్రిందిపద్యమును ఆశువుగా అల్లి వినిపించెను: ''విశ్వాసమున్నవాడు తియ్యనిదెల్ల రుచిచూచును. ఆయనమాట విన్నవాడు ఉప్పువాటిని మాత్రమే రుచిచూచును. ఆయనగురించి ప్రస్తావించినవాడు పుల్లని పదార్థములను భక్షించును. ఆయనను స్తుతించినవాడు మసాలా దినుసులన్నింటిని రుచిచూచును. నాలుకకు పసందైన ముప్పదియారు రుచులు భగవంతుని ప్రేమించి ఆయన ఆమోదమును పొందినవానివే. మిగతా రుచులన్నియు వ్యర్థములు. అవి మనస్సును చెరుపును. శరీరమునకు బాధ కలిగించును.''

తల్లి: ''నాయనా! ఆ బిచ్చగాని చొక్కా తీసివేయుము. నేను నీకై తెచ్చిన ఈ కొత్తబట్టలు కట్టుకొనుము.''

నానక్: ''భగవంతుని రంగు అద్దుకున్నవానికి కాషాయపు బట్టలు ధరించుట ఆనందమిచ్చును. సత్యజీవనము చేయుచు, తనకున్నదానినెల్ల దానము చేయువానికి తెల్లబట్టలు ధరించుట తగును. మనసులోని మురికి మచ్చలను, పాదరక్షలను విసర్జించి దైవ సన్నిధానమున సదా నిలుచువానికి నీలిబట్టలు ధరించుట ఆనందమిచ్చును.''

ఇంతలో నానక్ ఆగమనవార్త తెలిసి ఆయనతండ్రి గుర్ర మెక్కి అక్కడికి పరుగు పరుగున వచ్చెను. నానక్ సన్యాసిదుస్తులు ధరించుట చూచి ఇట్లనెను.

"బిడ్డా! ఈ నా గుర్రమెక్కి నీవు నీ ఇంటికి పొమ్ము. నావంటి సద్గృహస్థు కుమారుడు ఇట్లు బిచ్చగానివలె తిరుగుట చూచి నా మనసెంతో క్షోభించుచున్నది."

ఇది విని నానక్ తండ్రి పాదములకెరగి సాష్టాంగ దండప్రణామము లాచరించి ఇట్లు జవాబిచ్చెను: "తండ్రీ! గుర్రములవలన నా కేమియు ప్రయోజనములేదు. ఆయన దోవ తెలిసినవాడు మారు దోవల పోడు. భగవంతుని సమక్షమున శోభిల్లువాడు ఆయన అనుగ్రహమున తాను సమస్త ప్రపంచాధిపతినని భావించుకొనును. నేను నాప్రభువు ఆజ్ఞలను మాత్రమే శిరసావహించెదను."

ఈ మాటలు విని కాలూ ఎంతో బాధపడెను. "ఈ జీవితమన్న నీకు ఎందు కింత విరక్తి కలిగెనో నాకు తెలిసినఎడల నేను సర్వము చక్కబరచెదను. నీవు మరొక స్త్రీని వివాహము చేసికొనదలచిన ఎడల నేను అట్టి ఏర్పాటులు చేసెదను. మరొక ఇల్లు కావలసిన ఎడల కట్టించి పెట్టెదను."

నానక్: "నేను భగవంతుని మాత్రమే పెండ్లి చేసికొంటిని. ఈ ప్రపంచములో ప్రతివారిని శాసించెడి ఆ శాసకుని ఆజ్ఞానుసారమే నేను సంచరించెదను. ఎవరెన్ని తప్పులు చేసినను నా దేవుడు మాత్రము తప్పుచేయడు."

ఇట్లు వివరించి నానక్ అక్కడినుండి పోవుటకు సెలవీయవలసినదని తల్లిదండ్రులను ప్రార్థించెను. "తిరిగివచ్చి మిమ్ము చూచెదనని నేను వాగ్దానము చేసితిని. ఆ మాట నిలబెట్టుకుంటిని.

ఇప్పుడింక నాకు సెలవీయ వలసినదని వేడుకొనుచుంటిని. భగవదా దేశమునే నేను నిర్వర్తించెదను." ఇట్టివానితో వాదించుట నిష్ప్రయోజనమని భావించి, దుఃఖము దిగమ్రింగికొనుచు ఆయన తల్లి దండ్రులు వెడలిపోయిరి.

గురువు అక్కడినుండి బయలుదేరి పాక్ పట్నమేగి షేక్ ఇబ్రాహిమ్‌ను మరల సందర్శించెను. ఊరు వెలుపల మర్దానాతో సహా ఒకచోట పాటపాడుకొనుచు కూర్చొనెను.

"నీవే పలక. నీవే కలము. నీవే వ్రాత. నిజమునకు నీవే మా ఏకైక దైవము. కనుక ఇతరమును గురించి యోచించుటేల?"

ఈ పాటను షేక్ ఇబ్రాహిమ్ అనుచరు డొకడు విని పరుగు పరుగున తన యజమానివద్దకుపోయి నానక్ తిరిగి వచ్చెనని విన్నవించెను.

షేక్ ఇబ్రాహిమ్ వెంటనే నానక్ ఉన్న తావును వెదకికొనుచు వచ్చి ఎంతో మర్యాదచేసి ఇట్లనెను: "నానక్! దేవుడొక్కడే యని నీవు చెప్పితివి. కాని మార్గములు రెండు. వీటిలో దేనిని స్వీకరించవలెను? దేనిని నిరాకరించవలెను?"

గురువు: "భగవంతుడొక్కడే అయిన వానిని చేరుటకు వాని మార్గమొక్కదానినే అనుసరించవలెను. రెండవదానిని నిరాకరించవలెను. చచ్చుటకు మాత్రమే పుట్టినవానిని ఆరాధించకుము. కాని నిత్యుడై, సకల విశ్వమును నిండియున్న వానిని మాత్రమే పూజించుము."

అంతట షేక్ ఇబ్రాహిమ్ తన గురువైన షరీదుద్దీన్ *గంజ్-ఐ-షకర్* బోధలను జ్ఞాపకము చేసికొనుచు "ప్రాపంచిక పథమును వీడనిదే ఎవ్వరును దైవమార్గమున పోజాలడందురుకదా" అనెను.

నానక్ : పరిశుద్ధ మనస్కుడైనవాడు, తానెక్కడ నున్నప్పటికి భగవంతుని తప్పక చేరగలడు."

షేక్ : "ప్రియుని మనస్సును ఆకర్షించగల మాట ఏది? గుణమేమి?"

నానక్ : "వినయమే ఆ మాట. క్షమ ఆ గుణము. నాగరిక వర్తనమే ప్రియుని ఆకట్టుకొనగలదు."

షేక్ : "ఇతరుల రక్తముపీల్చి బ్రతుకు లౌకికుడు భగవదనుగ్రహమునకు పాత్రుడెట్లు కాగలుగును?"

నానక్ : "సత్యమను కత్తిని గుణమను ఒరలోనుంచి తీసి పీకకోసుకున్న అందుండి ఆశయను నెత్తురు ధారలు కట్టి బయటికి ప్రవహించును. అప్పుడావ్యక్తి భగవదనుగ్రహమునకు పాత్రుడగును."

షేక్ : "శిక్ష తగ్గించుమని కోరువానికి భగవంతుని దర్శించుట అవసరమా?"

నానక్ : "పరిశుద్ధాత్మయే అట్టి వ్యక్తి. భగవంతుడే గురువు. తన ఆత్మను భగవంతునికి అర్పించుకొనువాడు అట్టి వాడే అగును."

ఇదివిని షేక్ గురువు ఆశీర్వచనములను అర్థించెను.

నానక్ : "భగవంతుడు నిన్ను అనుగ్రహించుగాక. నీ సరుకు క్షేమముగా ఇల్లు చేరగలదు."

దోవలో ఒంటరివాడొకడు కనబడి వైరాగ్యమును నిర్వచించమనెను. నానక్ : "సర్వమును ఉపయోగించుకొనుచు ఏదియు తనది కాదని భావించువాడే విరాగి. అట్టివాడు దేవుని తప్పక చూడగలడు."

గోయింద్‌వాల్ పురములో ఆయన, అందరు విస్మరించి ఊరు బయటకు గెంటివేసిన ఒక కుష్ఠరోగి, ఇంటికివెళ్లెను. కుదరని జబ్బుతో, తోడివారందరు వెలివేయగా ఎంతో బాధపడుతున్న ఆ కుష్ఠరోగికి పరిచర్యలు చేయుచు నానక్ ఆ ఊరిలో కొన్నినాళ్లుండెను. ఆ కుష్ఠరోగి ఇట్లడిగెను :

"గురూ : మానవునికి వ్యాధి ఎట్లు వచ్చును ?"

గురువు : "భగవంతుని విస్మరించుటవలన. ఈ జబ్బు నిజానికి శరీరముది కాదు. ఆత్మది. మానవుడు శరీరమునకు వచ్చిన వ్యాదులన్నిటిని కుదుర్చుకొనగలడు. కాని ఆత్మకు వచ్చువాటిని కుదర్చగలవాడు భగవంతు డొక్కడే. ఆత్మ ఆరోగ్యముగా ఉన్నవాడు శరీరపీడను లెక్కచేయడు. కాని శరీరముపై ఆధారపడినవాని ఆత్మ సదా దుఃఖించుచుండును." అచిరకాలముననే ఆ కుష్ఠరోగికి పరిపూర్ణమైన ఆరోగ్యము కలుగగా వాడు గొప్ప దైవభక్తుడాయెను.

# 5

*భగవంతుడే భూమిని సృష్టించినది తన ధర్మమును ప్రతిష్ఠించుటకే*

*—గురునానక్*

పంజాబు మధ్యప్రాంతములలో పర్యటించుచు గురునానక్ సయ్యద్‌పూర్ చేరుకొని అక్కడ తన భక్తుడైన లాలో ఇంటికి మరల వెళ్లెను. అక్కడి పఠాను పరిపాలకులు ఎంతో పీడించు చుండిరని లాలో గురువుతో మొరపెట్టుకొనెను. నానక్ వాని నిట్లు ఓదార్చెను: "మానవుల మనస్సులనుండి, జాతి మనస్సునుండి మంచితనము నిష్క్రమించినప్పుడు వారు తప్పక విచారింతురు. పఠానుల పరిపాలన అంతము కాబోతున్నది." పంజాబులో ఘోర మైన సంగ్రామానంతరము ఢిల్లీ సింహాసనమును బాబర్ అధి ష్ఠించగలడని సూచించుచు ఒక పద్దెమల్లి వినిపించెను:

"ఓ లాలో! దైవవాణిగా నాకు వినిపించిన దానిని నీకు
తెలియపరచుచున్నాను.
పాపపు ఊరేగింపుతో బాబర్ త్వరలోనే ఇక్కడకు వచ్చి
కత్తిచూపి పాణిగ్రహణము చేయ నుంకించును.
మానవులు మతమును కోల్పోయిరి, సిగ్గు కోల్పోయిరి, తల్లి
సర్వత్ర సంచరించుచున్నది.
బ్రాహ్మణులేమి కాజీలేమి దయ్యపు అవతారములే పెండ్లిండ్లు
జరిపించును.
స్త్రీలు హిందువులైన నేమి, ముస్లిములైన నేమి తమ పర
దాల చాటునుండి పెండ్లిపాటలు పాడెదరు.

పురుషులు తమ హంతకులను కీర్తింతురు. తమ నుదుట
రక్తాక్షతలు ధరింతురు.
నానక్ మాంసపట్టణములో భగవంతుని స్తుతించి ప్రకటించును.
నిత్యసత్యమైన న్యాయము చెప్పుచు అందరికి అన్నిపనులు
పురమాయించువాడు వేరుగా కూర్చుండి సర్వము తిల
కించుచుండునని.
అయ్యో! మన శరీరములు తునా తునకలుగా ఖండించబడును.
అప్పుడే హిందుస్తానమునకు నా యీ చెప్పునది అర్థము
కాగలదు.''

అప్పటికి కొలది దినముల అనంతరము బాబరు దండెత్తి వచ్చి నగరమును కొల్లగొట్టి నానక్, మర్దానాలతో సహా పౌరులందరిని బందీలుగా పట్టి బంధించి తీసుకొనిపోయెను. గురువు నెత్తిపై పెద్ద బరువు పెట్టి బరబర ఈడ్చుకొని పోవుచుండగా మర్దానా మాలీసుగా పనిచేసెను. తరువాత నానక్‌కు ధాన్యమిచ్చి తిరగలి విసిరించిరి. ఇతర ఖైదీలందరు ఏడ్చుచు, శ్రమపడుచు నలిగిపోవుచుండగా నానక్ భగవంతుని నుతించుచు పాటలు పాడెను.[1]

''ఓ భగవంతుడా, నేను నీకు కట్టుబడ్డదాసుణ్ణి. నేనెంత అదృష్ట
వంతుణ్ణి. నీవు నన్ను కొంటివిగదా.
నీ దుకాణములో నీవు ప్రత్యుపకారముగా నీ శబ్ద మనుగ్ర
హించితివి.

1. నానక్ బరువు నెత్తిపైన తలకు తగులకుండా ఎప్పుడో ఎత్తి పట్టుకొన్నట్టున్నదని ప్రయత్నములేకయే తిరగలి తనకుతానే విసురుచుండగా నానక్ ధ్యానమగ్నుడై కూర్చొన్నాడనియు లేదా ఆనందముతో నర్తించెడివాడనియు కొందరు చరిత్రకారులు వ్రాసియున్నారు.

ఇప్పుడు సేవించెదను. నీవు ఆజ్ఞాపించినట్లే.
ఓ దైవమా, నీ దాసుడు నీతో యుక్తులాడగలడా?
వేరు గతిలేదు నీసంకల్పమునకు. ఎందుకననకుండ లొంగుట కన్న.
ఓ ప్రియా! నా తండ్రికూడ నీ దాసుడే. అట్లే నా తల్లికూడ. నేను నీ దాసుల బిడ్డను.
నా తల్లి నర్తించుచుండగా నా తండ్రి పాడుచుండును. నేను కూడ నీకు నా భక్తిని తెలుపుకొందును.
ఓ ప్రభూ! నీకు దాహమైన నేను నీరు తెత్తును. ఆకలిగా నున్న నీకై పిండి విసిరెదను.
నీకు వింజామరలు వేసి నీ పాదము లొత్తెదను. ఎల్లప్పుడు నీ నామమునే స్మరించెదను.
ఓ ప్రభూ! నీకు ద్రోహమాచరించితిని. నన్ను మన్నింపుము, నీ శోభను అనుగ్రహించుము.
నీవు ఎల్లప్పుడు దయాళుడవు. దాతవు. మొదటినుండి నీ స్వభావమే ఇంత.
నీవులేక ఎవ్వడు ముక్తుడు కాలేదు.

తన కప్పగించిన పనిని చూచి సన్యాసి ఒకడు ఆనందముతో గంతులు వేయుచున్నాడన్న ఫిర్యాదును విని సైన్యాధిపతియైన మీర్ఖాన్ ఆ విషయమును బాబరుకు తెలియపరచెను. ఆ సన్యాసిని తక్షణమే తన ఎదుట హాజరు పెట్టవలసినదని బాబరు చక్రవర్తి ఆజ్ఞాపించెను. అట్టి పుణ్యపురుషుని బంధించినందుకు తన బాధను వెలిబుచ్చెను. నానక్‌ను బాబరు సమక్షమునకు తీసుకు

వచ్చినప్పుడు చక్రవర్తి గురునిజూచి తన అపచారమును మన్నింపు మని వేడుకొనెను. నానక్ ఒక పాటపాడెను

"నిగనిగలాడు కురులతో పాపిట కుంకుమ అలదుకొన్న
వారి జడలు గొరిగి తలలపై దుమ్ము పోసిరి.
సౌధములలో నివసించిన వారి కిప్పుడు తలదాచుకొన తావు
లేకున్నది.
ఓ ప్రభూ, నీకు వందనములు.
ఓ ఆదిపురుషా, నీ అంతు తెలియ దెవ్వరికి. అన్ని వేషములు
నీవు ధరించినవే.
సౌందర్యము, సంపదలు చూచి మానవులు మురిసిపోయిరి
కాని అవే వారికి శత్రువులను తెచ్చిపెట్టినవి.
ముందే ఆలోచించుకున్న,
విచారించవలసి రాదుకదా."

బాబరు: "నేను భారతదేశముపై దండెత్తినది, ఇక్కడి ప్రజ లను పఠానుల నిరంకుశత్వము నుండి తప్పించుటకే."

గురువు: "నిజమే. కాని నీ ప్రజలపై నిరంకుశత్వము చలా యించిన నీకూ అదే గతి. ఈ సంపదలు ఈ అధికార లాలసత్వము నీ కళ్ల ఎదుట అనేకమందిని బలిగొన్నవి. పాపములేక అవి రావు. అవి ఎవ్వరివద్ద శాశ్వతముగా నుండవు. హృదయపు మంచి తనము పోగొట్టుకొన్నవారిని నా దేవుడు నశింపచేయును."

ఈ మాటలు విని బాబరు ఎంతో సంతోషించెను.

"ఓ భాగవత శిరోమణీ, నా పాపములను క్షమింపుము. ఇక నుండి పేదలపై నిరంకుశత్వము చలాయించనని నీకు వాగ్దానము చేయుచున్నాను."

"భగవంతుడే నీకు మార్గదర్శకు డగుగాక" యని చెప్పి గురువు సెలవు తీసుకొని వెడలిపోయెను.

వా రుభయులు సయ్యద్‌పూర్‌కు మరలివచ్చిన వెంటనే బాబరు మూకల చేతిలో దుర్మరణముపాలైన తమ బంధు మిత్రులను తలచుకొని స్త్రీ పురుషులందరు రోదించుట చూచి మర్దానా గురువుకు ఇట్లు విన్నవించెను: "కొలదిమంది దోషులతోబాటు ఇంతమంది అమాయకులెట్లు వధింపబడిరి? గురువు వానిని మర్రి చెట్టు నీడను విశ్రమింపుమని కోరెను. కొంచెమునేపైన తరువాత తిరిగి వచ్చిన పిదప ఈ ప్రశ్నకు జవాబు చెప్పెద ననెను. మర్దానా ఆ చెట్టు నీడను విశ్రమించుచుండగా వానికి నిద్ర కూరుకొని వచ్చెను. ఇంతలో వానిని ఒక చీమకుట్టగా ఆ బాధకు వానికి మెలకువ వచ్చెను. తనచేతితో కుట్టినచోట పాముకొనుచు ఎన్ని చీమలనో వాడు ఒక్క పెట్టున చంపివేసెను. నానక్ ఇది చూచి, మర్దానా తన ప్రశ్నకు జవాబును కోరకమునుపే ఇట్లనెను "దోషులతోపాటు అమాయకులు కూడ ఎందుకు శిక్షింపబడెదరో ఇప్పుడు నీకు అర్థమైన దనుకొందును." మర్దానా: "ఓ ప్రభూ! నీ విచిత్రములు నీకే తెలియును," చుట్టూ ఎంతలో ఎన్ని విధములుగానో బాధపడుట చూచి మర్దానాను శ్రుతి వాయించుమని చెప్పి నానక్ ఒక పాటను పాడెను:

"ఓ దైవమా! నీవు ఖురసానును రక్షించి హిందూస్తానమునకు
భయము కల్పించితివి.
కాని ఇందుకు నిందమాత్రము నెత్తిన వేసుకోవు. మాకు
వినాశము చావు తెచ్చుటకై మంగోలులను పంపితివి.

ఓ దైవమా! మానవు లిట్లు శిక్షించబడి విచారించు చున్న
ప్పుడు నీ కేమీ బాధలేదా?
ఓ సృష్టికర్తా! నీ వందరివాడవు.
శక్తిమంతుడు శక్తిమంతునితో పోరాడినప్పుడు ఎవ్వరూ
పట్టించుకోరు.
కాని భీకరమైన సింహము గోవుల మందపై పడినప్పుడు యజ
మాని జవాబు చెప్పవలసినదే.
భారతదేశపు అమూల్యాభరణమును కొల్లగొన్నవారు కుక్కల
వలె వర్తించినవారు, పోయిన తరువాత పూర్తిగా
విస్మరించబడుదురు.
ఓ దైవమా నీవే మానవులను నీలో కలుపుకొందువు. నీవే విడ
దీయుదువు. ఇదే నీ శోభ.
ఎవరికైన పెద్ద పేరుండి సర్వము సంతృప్తిగా అనుభవించిన
నీవు వానిని క్షుద్రకీటకము కన్న హీనముగా చూచెదవు.
కాని బ్రతికి ఉండగానే మరణించి నీ ప్రేమలో జీవించువా
డొక్కడే జయించును."

బాబరు ఈ పాటవిని గురువును మరొకసారి పిలిపించుకొని ఆయన కేది కావలెనన్న దానిని సమర్పించెదనని వాగ్దానము చేసెను.

నానక్ : "మూర్ఖులు మాత్రమే భగవంతుని తప్ప తదితరుల నుండి కోరుకొందురు."

ఏదైన కోరుకొనుమని వినయ వినీతుడై బాబరు అనేక విధముల ప్రోత్సహించగా ఖైదీలుగా పట్టుకున్న వారందరిని తక్షణమే వదలిపెట్టవలసినదని నానక్ కోరెను. బాబరు అట్లే వారందరిని వదలివేసెను. బాబరు గురువుకు కొంత మధువు త్రాగనిచ్చెను.

దానిని నానక్ నిరాకరించి, మానవునికి కొంచెము నేపు మత్తెక్కించి తరువాత కాళ్లు చేతులు చల్లబడగా నిరాశోపహతుని చేయు మాదక పానీయములతో తన కేమియు పనిలేదనియు, ఇంతకన్న శాశ్వతానందము కలిగించునది తన వద్ద కలదనియు చెప్పెను. బాబరు గురువు చెప్పునది సరిగా అర్థము చేసుకొనక ఈసారి కొంచెము గంజాయి తెప్పించెను. గురువు న వ్వాపుకొనలేక నవ్వి మరొక పద్యము చదివి ఇట్లనెను :

"ప్రేమ నా గంజాయి నా హృదయమే చిలుము
ఓ దైవమా నీవంటే నాకు పిచ్చి మిగతావేవీ నాకు వద్దు
చేతులు జోడించి, నీ దర్శనము కాంక్షించి నిలబడితిని
నీ ద్వారము చెంత
ఓ ప్రియా! నా కీ బిక్షపెట్టుము
కుంకుమపువ్వు, పూలు, కస్తూరి, చందన మలదికొన్న ప్రతి
వారికి సుగంధమంటును
అట్లే సాధువులున్నా వారికి ఆత్మపరిమళము
వెన్న చెడిపోవదందురు లేదా పట్టుబట్టలు
అటులే భక్తుని ఆత్మయున్న వాని కుల మేదైనప్పటికి
ఓ దైవమా! నానక్‌నకు నీ కృపాదానము చేయుము
ఎల్లప్పుడు నీ నామమునే స్మరించుచు నిన్నెప్పుడు విస్మరించ
నటుల అనుగ్రహించుము."

అంతట నానక్ బాబరు చక్రవర్తి వద్ద సెలవు తీసుకొనుచు, ఆయన న్యాయముగా పరిపాలించుచు సాధువులను గౌరవించుచు, సుఖలాలసుడుకాక, పేదలను కనికరించుచు, తానే పనిచేయుచున్నను భగవంతుని మరచిపోక యున్న ఎడల విచారించవలసి

యుండదనియు, ఆయన పరిపాలన చిరకాలము కొనసాగగల దనియు ఆశీర్వదించెను.

ఈసారి నానక్ పస్రూరు మీదుగా సియాల్‌కోటకు వెళ్లెను. ఇక్కడున్నప్పుడు ఆయన ఒక కీకరవృక్షము నీడను కూర్చుండెను. ఆ చెట్టు ఇప్పటికినీ కలదు. మర్దానాను నగరములోనికి పంపి ప్రతి దుకాణమువద్దకు వెళ్లి ఒక పైసకు సత్యమును ఒక పైసకు అబద్ధమును కొనుక్కొని రావలసినదని పంపెను. మర్దానాయు, గురుని ఈ విచిత్రమైన కోరికకు ఆశ్చర్యపడియు, ఆయన మరేదో మహాత్తర సత్యమును తనకు బోధించ దలచియుండునని భావించి ఆయనతో వాదమున కియ్యకొనక అటులే యని నగరములోని కేగెను. ఆత డట్లు ప్రతి దుకాణములోను ప్రశ్నించుచుండగా కొంద రితనిని పిచ్చివా డనిరి. మరికొందరు ఇతడు తమ్ము పరిహసించ దలచె ననుకొనిరి. ఇంతలో మూళ అనబడు ఒక దుకాణదారు మర్దానా కిట్లు జవాబిచ్చెను "నీవు వెళ్లి జన్మ అబద్ధమనియు మృత్యువు సత్యమనియు నీ గురువుగారికి విన్నవించుము."

మర్దానా ఈ జవాబును గురువుకు తెలియపరచగా 'ఇట్టి మేధావిని నేను కలుసుకొనగోరుచున్నా'నని ఆయన అనెను. ఇట్టి జవాబు చెప్పినవానికి నిజము తెలియునని కూడా ఆయన అనెను. మూళ వచ్చి గురువు దర్శనము చేసెను. గురువు ఆతనినిచూచి, మాట్లాడి దేశాటన సందర్భమున తన వెంట రావలసినదని కోరెను. అటులే యని వాడును కొంతకాలము పాటు గురునివెంట పర్యటించెను. మరల ఆ పట్టణమునకు తిరిగివచ్చి మూళ డెక్కడయని గురువు ప్రశ్నించగా, తిరిగి తీసుకొనిపోవునేమో యను భయముతో ఆయన భార్య తన భర్త దూరదేశమునకు వెళ్లెనని

అబద్ధము చెప్పెను. మూఢుడు సైతము గురువు వెంట ప్రయాణము లన్న విసిగిపోయి, ఆయనతో విందు భోజనమునకు పోవుటకైన నిచ్ఛగించకుండెను. ఎక్కడో అడవులమధ్య దిక్కులేనిచావు చచ్చుటకన్న ఇంటివద్ద కుటుంబముతో కలిసి సుఖముగా నుండుటయే మంచిదని వాడు భావించెను. వీడు ఇప్పుడు తన్ను మోసగించ దలచినట్లు గుర్తించిన గురువు ఇట్లనెను: "జీవితము మిధ్య,మృత్యువు సత్యము అని పెద్దకబుర్లు చెప్పిన వీడు ఇప్పుడు మిధ్యకే అంటిపెట్టుకు ఉండదలచినట్లు కనబడుతున్నది. సరే కానిమ్ము. కాని మృత్యువును తప్పించుకో గలవా రెవ్వరు?" ఆ తరువాత కొలది కాలమునకే మూఢుడు పాముకాటుచే మరణించెను.

అక్కడినుండి గురువు మిరాన్‌కోటకు వెళ్లెను. ఇక్కడ మియామిరా అనబడు ముస్లిమ్ సూఫీ గురు వొకడుండెను. వాని పేరు మిరాయి. కాని వాడు వట్టి దురహంకారి. వాడు నానక్ రాక విని అనుచరులవద్ద ఇట్లు దంభములు పలికెను. "నేను పోయి వానిని చూచెదను. నిమ్మకాయ పిండినట్లు పిండివేసెదను. వాడు రాగానే నానక్ వానినెంతో మర్యాదచేసెను. మియామిరా దుర్గర్వముట్టిపడుచు ఇట్లనెను: "ఓ నానక్! ఏ రెండు వస్తువులను స్వీకరించిన మానవుడు భగవంతుని కృపకు పాత్రుడగును? ఒకటి భగవంతుడు. రెండవది ప్రవక్త. కాని నీవు ప్రవక్తను అంగీకరించవు. కురాను చదువవు. నీకు ముక్తి ఎట్లు కలుగును?" నానక్: "సత్ప్రవర్తనయే నేను చదువు కురాను. నేను భగవంతునిలో నివసించుచున్నాను. నాకు వేరేమీ ఆధారమువలదు. ఒక్కదానిని ప్రేమించువాడు మరొకదానిని ప్రేమించజాలడు." మియామిరా: "చమురులేక దీపమెట్లు వెలుగగలదు?"

నానక్: "దీపములో వివేకమే చమురు. దైవభీతి వత్తి. సత్యమగు జ్వాలతో వెలిగించబడినప్పుడు మనలో జ్యోతి ప్రకాశించును. దేవుని చూడగలిగెదము. తను బ్రతికి ఉండగా ఇతరులకు సేవ చేయువానికి భగవంతుని సన్నిధానమున చోటు దొరకగలదు."

మితా: "వివేకమననేమి? భగవంతుడన్న భయమెట్లు కలుగును? సత్యజ్యోతిని వెలిగించుటెట్లు? నిజమునకు సత్యమనగానేమి?"

నానక్: "ప్రేమించుటయే వివేకము. వినయముతో భగవంతునికి ఆత్మార్పణ చేసికొనుటయే ఆయనపట్ల భయము కలిగియుండుట. విశ్వాసము కలిగియుండుటయే జ్యోతిని వెలిగించుట. ఆయన ఒక్కడే అందరిలోను అన్నింటిలోను ఉన్నవాడని తెలుసుకొనుటయే తెలుసుకోదగిన సత్యము."

మియామిరా: "భగవంతునికి అత్యంత పవిత్రమైనది, ఆయనకు అత్యంతప్రీతిపాత్రమైన నామమేది?"

నానక్: "అందరు ఆరాధించదగిన పేరు ఏది అయితే అది. మీ మహమ్మదీయులకు అల్లా అటువంటి పేరు."

అంతట మూడుసార్లు అల్లా నామ ముచ్చరించి నానక్ మితాకు సెలవిచ్చి పంపివేసెను.

ఈసారి గురువు లాహోరు పట్టణమునకు వచ్చెను. ఇక్కడ దునీచంద్ అనబడు కోటీశ్వరుడు తన ఇంటి ఎదుట ఎన్నో పడగలెత్తించెను. ఇవెందుకని ప్రశ్నింపగా ఒక్కొక్క పడగ ఒక్కొక్క లక్షరూపాయలకు చిహ్నమని ఎవరో వివరించిరి. దునీచంద్ గురువురాక విని ఆయనను తన ఇంట తనతండ్రి శ్రాద్ధదినమున విందారగించవలసినదని ఆహ్వానించెను. నానక్ అందుకు

సమ్మతించి తన ప్రశ్నలకు సరియైన సమాధానము లభించినప్పుడే తాను భోజనము చేసెదనని షరతుపెట్టెను. "అదేమి"? అని దునీ చంద్ ఎంతో నమ్రుడై అడిగెను.

నానక్ : "నేను ఎంతకాలమునుండియో భద్రముగా దాచుకున్న చిన్నసూదిని నాకు నీవు పరలోకములో అందించినప్పుడే నేను నీ ఇంట భోజనము చేయుదును." "అదెట్లు సాధ్యమగును ?" అని దునీచంద్ ఎదురుప్రశ్న వేసెను.

నానక్ : "అటులైన ఒక చిన్న సూదినైనను నీవెంట పరలోకమునకు తీసుకుపోలేని నీవు నీ ద్వారముచెంత నీ సంపదనంతను ఎందుకు ప్రదర్శించితివి ?"

ఈ మాట వినగానే తన అవివేకమునకు, ఆడంబరమునకు దునీచంద్ ఎంతో సిగ్గుపడిపోయెను. గురువు ఆదేశించినట్లుగా పేద సాదలను పిలిచి తన కున్నదంతయు పంచిపెట్టెను. భగవధ్యానమునకు పేదలసేవకు తన శేషజీవితమును అంకితము చేసెను.

అనంతరము నానక్ రావీ తీరమున నున్న కర్తార్‌పూర్‌కు వెళ్లి అక్కడ మకాము పెట్టెను. ఇక్కడ ఉన్నప్పుడు ఏడేండ్ల బాలు డొకడు అనుదినము ప్రొద్దుట, సాయంత్రము గురువు దర్శనమునకు వచ్చుచుండెను. అంత చిన్న వయస్సుననే గురుదర్శనమున కెందుకు వచ్చుచుంటివని గురు వొకనాడు వాని నడిగెను. ఆ బాలు డిట్లు జవాబిచ్చెను : "నా తల్లి ప్రతిదినము కట్టెలు అంటించుచుండగా చూచుచుంటిని. అందు చిన్న చిన్న కట్టెలే అన్నింటికంటె ముందుగా అంటుకొనెడివి. దానినిబట్టి జీవితావసాన సమయమున ఎవ్వరూ ఏమీ నేర్చుకొనజాలరని తెలుసుకొంటిని. అందుచేత బాల్యమునుండియే దైవపథగామి కావలె

ననుకొంటిని.'' ఈ జవాబు విని గురునానక్ ఎంతో సంతోషించెను. ఆ బాలుడు పెరిగి పెద్దవాడై విశుద్ధవర్తనుడై నానక్ గురుపదమునకు అర్హులైన అయిదుగురిలో ఒకడుగా పేర్కొనబడినాడు. ఈతనిని అందరూ బుడ్డా బాబా, అని ముద్దుగా పిలుచువారు.

గురువు కర్తార్‌పూర్‌లో స్థిరపడెనని తెలియగానే వేలాది స్త్రీ పురుషులు అక్కడికి వచ్చి ఆయన ఎడ భక్త్యనురాగములను ప్రదర్శించిరి. హిందూదేశములో నలుమూలలకు ఆయన పేరు ప్రఖ్యాతులు వ్యాపించెను. ఆయనతండ్రి సైతము కుటుంబ సభ్యులతో అక్కడికి వచ్చిచేరెను. నానక్ తల్లి, భార్య, బిడ్డలు, తదితర బంధుమిత్రులు అందరు అక్కడికి వచ్చి చేరిరి. నానక్ తాను అంతవరకు ధరించిన అసాధారణ వేషమును త్యజించి, మిగతా ప్రపంచంలోని అందరివలెనే సాధారణ వేషము ధరించెను. తలకు పాగా చుట్టుకొనెను. భుజముపై ఉత్తరీయము వేసుకొనెను. నడుముకు బట్ట చుట్టుకొనెను. ఉదయము సాయంకాలము ప్రార్థనలు జరిపెను. వ్యవసాయము మొదలుపెట్టి పొలములో పండిన పంట నుండి వచ్చినవారందరికి సదుపాయము చేయుచుండెను. ఆ విధముగా కులమత వివక్షణలేక మానవులందరు ఏకపంక్తి భోజనములు చేయు 'లంగర్' (సమష్టి వంటశాల) మొదలాయెను. ఒక రోజున ఒక బ్రాహ్మణుడు వచ్చి బిచ్చము వేయుడనెను. ఇతరులతో కలిసి పంక్తి భోజనము చేయవలసినదని ఆయనను కోరిరి. ఆయన తాను స్వహస్తపాకి ననియు, తన చేతితో వండుకున్నది తప్ప మరేమియు భుజించనినియు చెప్పెను. ఇతరులు వండినది తిన్నఎడల తాను మైలపడిపోదునని వాదించెను. మొదట భూమి త్రవ్వి, కీటకములు రాకుండ శుభ్రముచేసి, పేడతో అలికి

ముగ్గులు పెట్టి, కట్టెలు కడిగి వంటచేసుకొనెను. గురువు ఆయనకు అపక్వపదార్థము నిచ్చెదనని కబురు పంపెను. కాని బ్రాహ్మణుడు తవ్వినకొలది భూమినుండి పురుగులు బారులు బారులుగా అనంతముగా వచ్చుచునే యుండెను. అంతట నానక్ ఇట్లు అనెను: "మనము మైలపడునది భోజనము ద్వారా కాదు. చెడ్డ మనస్సునుంచి."

మాలో, భాగో అనబడు సిక్కులిద్దరు 'విధినిషేధములను పాటించుట వలన ప్రయోజనమేమి?' అని గురువును ప్రశ్నించిరి.

"విధి నిషేదముల పాటించుట అనగా భగవంతుని మంచిని గుర్తించక పోవుటయే. భగవంతుని మందిరమైన శరీరమునకు కావలెనని బాధ కలిగించుటవలన భగవంతు డెట్లు సంతసించును? తగులపెట్టవలసినది కోరికలనే కాని శరీరమును కాదు. శరీరమును క్షోభపెట్టుటవలన మనస్సుకు నిలుకడ కలుగదు. జీవచైతన్యమును నిర్బంధించుటవలన కూడా కలుగదు. కాని భగవత్స్మరము చేసినప్పుడే దానికి నిలకడ. మనస్సు పవిత్రముగా నున్నవాని శరీరము కూడా పవిత్రముగా నుండును. ఇతరుల కెట్టి హాని చేయనివాడు అందరికి సేవలు చేయువాడు తాను ధరించిన దుస్తులను గురించి అంతగా పట్టించుకొననివాడు వినయ వినీతు డగువాడు విషయసన్నిధిని వికారహీనుడుగా ఉండగలిగినవాడు ఉత్తముడు."

ఇక్కడ ఉన్నప్పుడే గురువు తన రచనలలో ఉత్తమమైనదిగా ప్రశస్తికెక్కిన "బారామాహ్" గీతములను రచించెను. ఇందు ఆయనకు తనదేవుని యందుగల నిశ్చలభక్తిని నిరూపించుకొనెను. ప్రియుడు దేశాంతరమున కేగగా వియోగదుఃఖ మనుభవించు

ప్రియురాలివలె ఆయన భగవంతుని దర్శనమునకై తనలోని తహ తహను అందు చక్కగా వర్ణించెను. నెలనెలకు ఆమె ఆలోచన లలో కలుగు మార్పులన్నింటిని ఆయన ఎంతో సొంపుగా వివ రించెను.

ఇంతలో తన కుమార్తెకు పెండ్లిచేయుటకై ధనసహాయము చేయవలసినదని ఒక సిక్కువచ్చి గురువును కోరెను. గురువు తన శిష్యులలో భగీరథుడను వానిని పిలిచి లాహోరువెళ్లి బంగారు నగలు తీసుకురావలసినదని చెప్పి, రాత్రికి అక్కడ ఆగవద్దని ఆజ్ఞాపించెను. ఈ భక్తుడు గురువాజ్ఞను సుగ్రీవాజ్ఞగా పాటించుట చూచి ఆ నగలుచేసిన కంసాలికూడ అతనితోబాటు ఆశ్రమమునకు పయనమయ్యెను. కర్తార్‌పూర్ వచ్చి గురువు శ్రద్ధ, దీక్ష, వివేకము చూచి ఆయనకు శిష్యుడాయెను. ఆతడు తనకున్నదంతయు పేద లకు పంచిపెట్టి గురునానక్ సందేశమును వ్యాప్తిచేయుటకై సింహళమున కేగెను. అక్కడ ఆతడు సింహళప్రభువైన శివనాభ మహారాజును నానక్ శిష్యునిగా నొనర్చెను.

అంతట గురునానక్ తన దక్షిణదేశయాత్రకు బయలుదేరెను. ఈసారి ఆయనవెంట సయిదో, ఘీవో అను ఇద్దరు జాటురైతులు పయనమై వెళ్లిరి. నదిలో స్నానముచేయుచు గురునానక్ జలాధి పతియైన క్వాజా కిజార్‌ను అర్చించెనని వారు భావించిరి. వారుభయు లకు క్వాజా కిజార్ దర్శనమిచ్చి తాను నీటి దేవుడనియు నానక్ నీటిలోనున్న వాయువు అని వివరించినట్లు ఒక ఐతిహ్యము కలదు. ఈ విధముగా తమకుగల సందేహములన్నియు నివృత్తి కాగా వారు గురువును మరింత భక్తిశ్రద్ధలతో సేవించ మొద లిడిరి.

దక్షిణాదికి పోవునప్పుడు వారొక ప్రసిద్ధ జైన దేవాలయమును సందర్శించిరి. దానికి ధర్మకర్త నారభీ గురువును చూడవచ్చెను. "నీవు పాతధాన్యము తిందువా? క్రొత్తదా? నీవు చెట్లను కుదిపి పండ్లు రాలగొట్టి తిందువా? ఈ విధముగా నీవు జీవహింస చేయువాడవు నీవు సాధువె ట్లగుదువు?" అని పలువిధముల ప్రశ్నలవర్షము కురిపించెను.

నానక్: "నీటినుండి పద్మాలుగు రత్నములు వచ్చినవి. నదీ తీరములనే హిందువుల పుణ్యక్షేత్రములన్నియు నున్నవి. నీరు మనలను పరిశుభ్రము చేయుచున్నది. మనకు జీవనదాతయగు చల్లని ప్రవాహజలమును ఎవరు నిరాకరించగలరు? ఇక జీవ హింస యందువా? జీవములేని దేది? పూవులు, పండ్లు అన్నింటి లోను జీవ మున్నది. అటులే నీరు కూడ. దానిపేరే జీవనము. అటులే ధాన్యములోను, పాలలోను, పెరుగులోను జీవ మున్నది. వివేకము వల్లనే ప్రతివారు తరించెదరు కాని భగవంతు డనుగ్రహిం చిన ఆహారమును నిరాకరించుటవలన కాదు."

వారు సముద్రమధ్యమున నున్న ద్వీపముమీదుగా ప్రయాణము చేయుచుండగా మానవ మాంసమును భక్షించుచున్న వికృతాకారు డొకడు వారిని అటకాయించెను. ఈ ప్రయాణములో గురువువెంట మరొక జాటు యువకుడుకూడ వచ్చెను. వాని పేరు సీహో. వీరిని చూచి ఆ వికృతాకారుడు చంపి తినదలచెను. ఇదిచూచి సయిదో, ఘీవోలు ఉభయులూ ఎంతో బాధపడి ఏడువసాగిరి. గురువు మాత్రము నిశ్చలముగా నిలబడి ఈ గీతము చదివెను.

"భగవంతుడు కరుణాళుడే అయినఎడల తన భక్తునికి ఆదే శానుసారము జరుపును.

వాడు తన భాగమునకు ఏదివచ్చినను భగవంతుని ప్రార్థించు
చునే యుండును.
అట్టివాడే భగవంతునికి ఆమోదయోగ్యుడు.

గురునానక్ పవిత్ర ప్రశాంత వదనమునుచూచి ఆ నరమాంస భక్షకుని మనసు మారిపోయెను. అనంతరము వాడు గొప్ప నానక్ భక్తుడాయెను.

దోవలో నానక్ ముస్లిమ్‌పీరు మఖ్దుమ్ బహాూదిన్ కురేషీని కలుసుకొనెను. ఈయన తన ఆధ్యాత్మికసిద్ధులు, పేరుప్రతిష్ఠలు చూచి ఎంతో గర్వించువాడు. తన మహిమలనుగురించి ఆయన గురువుతో ఎంతో గొప్పగా చెప్పుకొనెను. అంతయు విని విని నానక్ ఇట్లనెను.

"నీవు ఆధ్యాత్మిక సంపన్నుడవు. అయినా నీ హోదాను చూచు కొని నీకీ మురుపేమి? గర్వమెందుకు? వినయము దైవమార్గము. ఆత్మస్తుతియందు అమితానురాగముకలవాడు భగవంతుని పోగొట్టు కొనును." ఈ విధముగా గురునానక్ మందలించుట విని పీరు ఎంతో నొచ్చుకొనెను. తనతో మరికొంతకాలము వసించి తన్ను తిరిగి దైవపథానువర్తిని చేయవలసిందని నానక్‌ను కోరెను. నానక్ :

ఏమీ ఉండనిచోట ఎవ్వరు ఉండగలరు?
నేను తప్పక ఉండవలసిన చోటనే ఉందును.
భగవంతు డొక్కడే ఉండువాడు. కనుక వానితోనే ఉందును.
ప్రపంచముండదు. ఆకాశము, పగలు, రాత్రి, చంద్రుడు,
సూర్యుడు, నక్షత్రములు ఏమీ ఉండవు.
రాజులు, పీరులు, దేవతలు, సాధువులు, మానవులు, పుస్తక
ములు, కర్మకాండ ఏమీ ఉండవు.

ఉండేది భగవంతు డొకడే. లేదా ఆయన వాక్కు—''

ఇది విని పీరు మరింత క్రుంగిపోయెను. "ఇంతకీ నేను నాకు ఎవరిని గురువుగా స్వీకరించవలెను?" నానక్. "అందరికి గురువైన భగవంతుని."

అక్కడనుండి గురునానక్ సింహళమున కేగెను. భారతదేశము నుంచి గొప్ప సాదు వెవరో తమ దేశమునకు వచ్చెనని విని శివ నాభ మహారాజు అందమైన ఆటకత్తెలను పంపి ఆయనను వశపరచు కొనవలసినదని ఆదేశించెను. కాని నానక్ వారి ఉనికినే గమనించ లేదు. అంతట రాజు స్వయముగా వచ్చి ఇట్లు ప్రశ్నించెను: "నీ పేరేమి? నీ కులమేమి? నీవు యోగివా?"

నానక్. "ఎవని అంతరంగము భగవంతునియందు ప్రేమతో పునీతమయ్యెనో, సత్యముద్రపడి రాకపోకలు నిలిచిపోయిన వాడే యోగి. ఓ ప్రభూ, నీ పేరేమి? నీ కులమేమి? నన్ను నీ సమక్ష మునకు రావలసినదని ఆహ్వానించినప్పుడు నా మనస్సులోని ప్రశ్నలన్నింటిని నిన్ను అడిగెదను."

అంతట రాజు అడిగెను "నీవు బ్రాహ్మణుడవా?"

నానక్ "భగవంతుని వివేకమున స్నానముచేసి ముల్లోక ములందు తన తేజస్సుచే ప్రకాశింపచేయువానిని తెలుసుకో గలి గినవాడే నిజమైన బ్రాహ్మణుడు."

రాజు: "నీవు క్షత్రియుడవా? వ్యాపారివా?"

గురువు: "నా నాలుకయే దండము. నా హృదయమే తుల. నేను అజ్ఞాతనారమును తూచెదను. ఉన్నదొకటే దుకాణము. ఒకడే వ్యాపారి. ఖాతాదారులు సైతం ఒకే రకమువారు"

రాజు: "నీవు హిందువువా? ముసల్మానువా?"

నానక్ : "నిజమైన గురువు ఈ రెండు దోవలలోని భిన్నపద్ధతులను సమన్వయపరచి ఒక్కనికే చేర్చెను. ఆయన వాక్కును మన్నించి సందేహములను నివారించును."

ఈ జవాబులు విని రాజు ఎంతో సంతోషించెను. రాజు అడిగిన అన్నిప్రశ్నలకు నానక్ యుక్తియుక్తముగా సమాధానములిచ్చి మెప్పించెను.

"భాగవతుడు సచ్చిదానందస్థితిలో నుండును. అది శూన్యము. అక్కడ సంతోషము లేదు, దుఃఖములేదు, ఆశలేదు, కోరికలేదు, కులములేదు, కులపు గుర్తులు లేవు, నీతిబోధలు లేవు, పాటలు లేవు. తనలో తాను సమాధిగతుడై మానవుడు ధ్యానమగ్నుడగును. ఆకాశమువలె వ్యాపించి తన్ను తాను తెలుసుకొనును."

"ప్రాణ సాంగ్లి" అను నలభై వృత్తముల ఈ గీతము ఇప్పుడు లభ్యము కావడము లేదు. రాజు ఆయన జవాబులకు ముగ్ధుడై నానక్‌ను తన వీపుమీద కూర్చొనమని చెప్పి లంకవీధులలో ఊరేగించెదనని చెప్పెనట. గురువు వానిని ఆశీర్వదించి నీ భక్తిని భగవంతుడు మెచ్చుకొనును గాక! యని ఆశీర్వదించెను. రాజు గొప్ప నానక్ భక్తుడాయెను. తన ప్రజలను న్యాయముగా పరిపాలించెను. ప్రజలు ఆయనను గురించి ప్రస్తావించుకున్నప్పుడెల్ల "మన రాజుకు ఐహిక సుఖములందు ఇచ్ఛ ఏమియులేదు. ఆయన ఎల్లప్పుడు నానక్‌యందు, భగవంతునియందు ధ్యాసతో కాలక్షేపము చేయుచుండును" అని చెప్పుకొనెడివారు.

పంజాబుకు తిరిగి వచ్చిన తరువాత గురువు బటాలా—అచల్‌లో జరిగిన యోగుల సమావేశములో పాల్గొనెను. అప్పుడాయన గృహస్థుల వేషము ధరించెను. అనేకవేలమంది ఆయన

దర్శనమునకై గుమిగూడిరి. దానితో ఆ యోగులందరికి ఎంతో ఈర్ష్య కలిగెను. వారి నాయకుడైన బంగారనాధుడు ఇట్లు ప్రశ్నించెను: "బిడ్డా, నీవు పాలనెందుకు పులియబెట్టితివి? గృహస్థుల దుస్తు లేల ధరించితివి? పైగా సాధువు నందువేమి? నవనీత మీ విధముగా లభించదు."

నానక్: "అవివేకియైన తల్లి కడుపున పుట్టినవాడు కవ్వమును సరిగా కడుగక పాలను పులియబెట్టును. సంసారమును పరిత్యజించి, దానిని శపించువారు గృహస్థుల ఇండ్లకు వెళ్లి బిచ్చమెత్తరాదు. ఇహలోకమున ఏమీ చేయనివానికి పరలోకమందు ఏమియు దొరకదు."

యోగులు: "నీవు మహిమాన్వితుడవని అందరు చెప్పుకొనుచుండెదరు. ఒకటి రెండు మహిమలు మాకును చూపవా?"

గురువు. "మహిమలన్నియు దైవవిరుద్ధములైనవి. నాకు మహిమలన్న నమ్మకములేదు. ఒక్క భగవంతునియందు సత్సాంగత్యమందు నాకు పరిపూర్ణమైన విశ్వాసము కలదు. నేను అగ్నిని దుస్తులుగా ధరించి, మంచుతో కట్టిన ఇంటిలో నివసించుచు, ఇనుము మ్రింగుచు బాధను పరిహరించి, భూమిని నా సమక్షమున గిరగిరా త్రిప్పుకొనుచు, క్షణములో ఆకాశమును తూచి అసాధ్యము లెన్నింటినో సాధించినను, భగవంతుడు అనుగ్రహించి ఆశీర్వదించనిచో, ఆయనతో సదా సంలీనుడనై నివసించు అవకాశమివ్వనిచో, ఈ అద్భుతము లన్నియు వృధాకదా."

సమాధిమగ్నుని చేయుటకై కొందరు యోగులు నానక్‌కు నాటుసారా ఒక గిన్నెనిండుగా పోసి అందించిరి. దానిని నిరాకరించి నానక్ ఇట్లనెను: "దివ్యజ్ఞానము కలవానికి, దేవుని

ధ్యానించ గలిగినవానికి, మంచిపనులనే చేయువానికి, భగవంతుని ప్రేమించువానికి వేరే మత్తుమందు లెందుకు ?"

యోగులు : "ముని అంటే నీ దృష్టిలో ఎవ్వరు ?"

నానక్ : "వివేకమను కత్తితో అయిదుగురు అంతశ్శత్రువులను ఖండించి దశ కర్మేంద్రియములు పంచ జ్ఞానేంద్రియములు ఎట్లు పని చేయునో తెలుసుకొని మనసునంతను భగవంతునితో నింపు కొని, ఏటికేడాది పొడుగున తనలోనే తీర్ధయాత్రలు చేయుచు, తన ఎడదనంటిన గర్వమును కడిగివేసిన వాడే నిజమైన ముని."

అంతట తమ తమ శాఖలలో దేనిలోనైన చేరవలసినదని నానక్‌ను ఆహ్వానించిరి. అట్లు చేరనియెడల మోక్షము రాదని చెప్పిరి. గురువు వారి కిట్లు జవాబిచ్చెను. "చిరుగుల చొక్కా, కుండలములు, జోలె, దండము, జింకకొమ్ము ధరించినంతమాత్ర మున నిజమైన యోగి కానేరడు. నా దృష్టిలో, పంచకామములను అదుపులోనికి తెచ్చుకున్నవాడు, కొంచెముగా నిద్రించువాడు, స్వల్పముగా భుజించువాడు, సదా దైవధ్యానము చేయువాడు, మితమైన కోరికలు కలవాడు, వివేక పూరితమైన పలుకులు పలికెడి వాడు, శరీరమును మనస్సును సదా పరిశుద్ధముగా నుంచుకొను వాడు, భగవాదాదేశము మన మేలునకే అని దృఢముగా విశ్వ సించువాడు మాత్రమే యోగి. అట్టి వానిలో భగవానుని అనాహత వాణి సర్వత్ర వ్యాపించియుండును."

అక్కడనుండి నానక్ కాశ్మీరుకు వెళ్లెను. ఈ ప్రయాణమందు ఆయన పాదములకు తోలుచెప్పులు, తలకు తోలుటోపీ, ధరించి నడుముకు తాడు చుట్టుకొని, శుద్ధ హిందువువలె నుదుట కుంకుమ బొట్టు పెట్టుకొనెనని పేర్కొనబడినది. ఈసారి ఆయనవెంట

హస్నూ అనబడు కమ్మరి, సిహన్ అనబడు కలంకారీ అద్దకపు పనివాడు వెళ్లిరి. శ్రీనగర్‌లో బ్రహ్మదాస్ అను ఒక బ్రాహ్మణ పండితుడు రెండు గాడిదల బరువుగల సంస్కృత గ్రంథములతో వచ్చి గురునానక్‌కు స్వాగతమిచ్చెను. తన భక్తికి నిదర్శనముగా తన మెడలో సాలిగ్రామము వేసుకొనెను. గురువు విచిత్ర వేషమును చూచి ఆతడిట్లు ప్రశ్నించెను: "నీ వెట్టి సాధువవు? సాధువులు ధరించరాదని నిషేధించబడిన తోలును నీవు ధరించితివి. నీ నడుముకు ఆ తాడు దేనికి? నీ పంథా ఏమి?"

నానక్: "ఒకే ద్వారమునకు చేర్చు ఒకే రాస్తా నాది. సద్గురువు వివేకమే ప్రతివారికి దోవచూపును."

బ్రహ్మదాసు: ఈ ప్రపంచమెట్లు సృష్టింపబడెనో నీకు తెలియునా? ఆది ఏది? అంతమేది?" నానక్:

"ఆదిలో సర్వత్ర అంధకారమే. అల్లకల్లోలము.
అప్పుడు భూమిలేదు, స్వర్గము లేదు, భగవంతుని అనిర్వచనీయమూ అద్భుతమూ అయిన సంకల్పము తప్ప మరేమీ లేదు.
పగలు లేదు, రాత్రిలేదు. సూర్యుడు లేడు, చంద్రుడులేడు. ఉన్నది శుద్ధశూన్యమున తన్నుగురించి యోచించుకొనుచుండిన భగవంతుడు మాత్రమే.
గాలిలేదు, నీరులేదు, సృష్టి ఉపాయములు లేవు, పలుకులేదు
సృష్టిలేదు, లయములేదు, రాకపోకలు లేవు
సముద్రములులేవు, నదులులేవు, ఖండములులేవు, నరకము లేదు, స్వర్గములేదు, ప్రపంచములేదు, పాతాళమూలేదు.

బ్రహ్మలేడు, శివుడులేడు, విష్ణువులేడు. ఉన్నది నా దేవు
డొక్కడే
కర్మకాండము లేదు, నియమములు లేవు, పురాణములు లేవు,
మంత్రములు లేవు, తంత్రములు లేవు, ఇన్ని విధములూ
లేవు
కులములేదు, గర్వములేదు, మృత్యువు లేదు, ప్రాణములేదు,
మానవుడూ లేడు, ఆత్మలేదు, ప్రజలూ లేరు, రాజూలేడు
భగవంతుడు తన స్వేచ్ఛమెయి మనకు కనుపించుచున్న,
మనము విశ్వసించుచున్న ఈ ప్రపంచము నంతయు
సృష్టించినాడు."

గురువు జవాబుతో సంతృప్తిపడి నప్పటికీ ఈ బ్రాహ్మణ పండితుడు తన పాండిత్య గర్వమును వదలుకొన డాయెను. తాను చదువుకొన్న దానికి గురువు జవాబులో కొన్ని భాగములు వ్యతిరేక ముగా ఉన్నవని బాధపడసాగెను. నానక్ ఆయన మనోభావము లను గుర్తెరిగి "నీవొక గురువును స్వీకరింపుమని సలహా ఇచ్చెను."

"నాకు గురువుగా ఉండదగిన వాడెవ్వడు? తెలుసుకోవలసిన దంతా నేను ఇదివరకే తెలుసుకుంటిని". అంతట నానక్ అతని అరణ్యమధ్యమున ఉన్న ఇంటిలోగల నలుగురు సాధువులు ఆయ నకు గురువును చూపగలరని సలహా ఇచ్చెను. "బహుశా కావ చ్చును" అని ఆ బ్రాహ్మణు డప్లిగెను ఆ సాధువులు దూరమున ఉన్న ఒక గుడిని చూపించి గురు వక్కడ దొరకునని చెప్పిరి బ్రహ్మదాసు అక్కడికి పోగా ఆయనకు అందమైన నగ్నసుందరి యొకర్తుక కనిపించి వానికి స్వాగత వచనములు పలుకుటక

బదులు అవమానపరిచి పంపెను. మరలివచ్చి సంగతిని ఆ సాధువులకు విన్నవించగా వా రిట్లు చెప్పిరి "ఈ స్త్రీ మాయ. నీహృదయము ఈ మాయతో నిండియున్నది. అందుకనే నీకు మనశ్శాంతి లభింపకున్నది." ఇది విని ఆ బ్రాహ్మణ పండితుడు ఎంతో ఆలోచించి నానక్‌వద్దకు తిరిగివచ్చి తనకు ఉపదేశము చేయవలసినదని కోరెను.

గురువు. "పాండిత్యము వివేకము కాదు. వివేకము అనుభవము వలన వచ్చును. అనుభవము ఆధ్యాత్మిక శిక్షణవలన కలుగును. ఇందువలన నిర్లిప్తుడుగా వినీతుడు వర్తించినఎడల భగవదనుగ్రహము లభించగలదు."

ఆ బ్రాహ్మణ పండితు డంతట తన అహమువీడి భగవధ్యానము చేసుకొనుచు, తోడివారికి సేవలుచేయుచు శేషజీవితమును గడిపెను.

గురువు పెక్కు హిమలయోత్తుంగ శృంగముల నధిగమించి సుమేరు శిఖరము చేరుకొనెను. అక్కడ మహిమాన్వితులు జరయు రుజయు లేని సిద్ధుల నెందరినో కలుసుకొనెను. వారు గురువును ఆదరించి దేశపు తీరుతెన్నులు వివరించవలసినదని కోరగా నానక్ ఇట్లు జవాబు చెప్పెను:

"కలియుగము ఖడ్గయుగము, రాజులు కసాయివారు, న్యాయమునకు రెక్కలు వచ్చినవి.
మధ్యాంధకారము సర్వత్ర వ్యాపించినది.
సత్యచంద్రోదయ మెప్పుడైన జరుగునేమో ఎవ్వరికి తెలియదు.
ప్రజలు అంధులు, లొంగిపోవువారు, అవివేకులు, కల్ల జీవనము చేయువారు.
గురువులు శిష్యుల అజ్ఞానుసారము ప్రవర్తింతురు.

కాజీలు లంచము పుచ్చుకొని తీర్పుచెప్పుదురు.
స్త్రీ పురుషులను కలుపునది ఆశ. ప్రేమకాదు."

అంతట సిద్ధులు అడిగిరి: "నీ పేరేమి? నీ పంథా ఏది? నీ ధ్యానమునకు కేంద్రమేమి? నీవు ఎచ్చటనుండి వచ్చితివి? నీ వెక్కడ నుండెదవు? నీ వెక్కడికి పోయెదవు?"

నానక్: "ప్రతివారి హృదయమున నుండు భగవంతునియందే నా నివాసము. సద్గురువు చెప్పిన చొప్పున నేను చేయుదును. భగవంతుని ఇచ్ఛప్రకారము నేను వచ్చితిని. ఆయన పిలుపు నిచ్చిన పోదును. నా ఏకైక దైవమును ధ్యానించుకొనుటయే నా ప్రార్థన. తన్ను తాను తెలుసుకున్నవా డీ విధముగానే ప్రవర్తించి చివరకు సత్యస్వరూపునిలో లీనమైపోవును."

సిద్ధులు: "ఈ ప్రపంచము మహాసాగరమువలె దుస్తరమని నీకు తెలియదా? ఇందుండి తప్పించుకో గలిగినవాడు మునిగి పోడు."

నానక్: "పద్మమువలె, బెగ్గురు పక్షివలె నేను నీటియందే నివసింతును. అందుచేత నేను మునిగిపోను. భగవంతుని పలుకులను ధ్యానించువాడు ఆ ప్రకారము జీవించువాడు, విషయ సన్నిధిని వికార హీనుడుగా నుండువాడు దుఃఖమునకు అతీతుడుగా నుండును. అట్టివానికి రాకపోక లుండవు."

గురువు చెప్పినదానిలో గర్భితమైన మహత్తర సత్యమును సిద్ధులు గుర్తించిరి. ఇక్కడ విన్నప్పుడే గురువు 'సిద్ధగోష్ఠి' అనబడు అద్భుత గేయములను రచించెను.

తిరుగు ప్రయాణములో గురువు హసన్ అబ్దల్ అనబడు ముస్లిమ్ మత విద్యాకేంద్రమును సందర్శించెను. ఆ సమయమున

'వలీ కాంధారీ' అను పండితుడు దీనికి ప్రధానిగా నుండెను. ఈ మౌల్వీకి తాను గొప్పపదవిలో నుంటిననియు, తాను గొప్ప పండితుడననియు అహంకారము గర్వము హెచ్చు. మర్దానాకు దాహము హెచ్చుగా నుండెను. వలీ నివసించుచున్న కొండ కొమ్ముపై తప్ప పరిసరములలో నీరు మరెక్కడా దొరకకుండెను. మర్దానా అట్లే ఆయాసపడుచు కొండపై కెక్కి కొంచెము మంచి నీరిచ్చి పుణ్యము కట్టుకోమనెను. వాడు తాను కాఫిరులకు మంచినీ రివ్వననెను. దానికితోడు ఒక గొప్ప హిందూ సాదువు వెంటవచ్చెనని అపహసించెను. "గురువువద్ద ఈ పాటి దాహము తీర్చగల మహిమ లేమియు లేవా? లేనిఎడల అతడెట్టి గురువు? ఉన్నఎడల కావలసినప్పుడు, కావలసినచోట నీరు పుట్టించడా?" అని అధికప్రసంగము చేసెను. ఈ మాటలువిని మర్దానా మనసులో ఎంతో బాధపడి, తిరిగి వచ్చి అంతయు గురువునకు విన్నవించెను. నానక్ ఇదంతయు విని ఒక్కనిముష మాలోచించి మర్దానాను పిలిచి ఒకచోటు చూపించి, ఆ చోటున త్రవ్వమని చెప్పెను. వాడును గురువు తోడ్పాటుతో అక్కడి ఒక పెళ్ల త్రవ్వెనో లేదో జలప్రవాహము పైకి ఉబికెను. ఈ ముస్లిము మతగురువు ఇదిచూచి ఉక్రోషపడి ఒక బండరాతిని వారిపై దొర్లించెను. గురువు దానిని తన కుడిచేతితో ఆపివేసెను. ఈ సంఘటనకు గుర్తుగా హసన్ అబ్దల్‌లో ఒక ఊట సమీపమున రాతిపై హస్తముద్ర కలదు. దానినే 'పంజాసాహిబ్' (పవిత్ర హస్తము) అందురు. ఇది పాకిస్తాన్ రాజధాని అయిన ఇస్లామాబాదుకు ముప్పైమైళ్ల దూరములో కలదు. ఇది సమస్తమతముల వారికి గొప్ప తీర్థయాత్రా కేంద్రముగా విరాజిల్లుచున్నది. ఏటేటా వైశాఖ దినమున ఇక్కడ గొప్ప తీర్థము జరుగుచుండును.

# 6

*ఎవ్వారిని చూచినా నీవు తప్ప వేరెవ్వారిని నేను చూచుటలేదు.*

—గురునానక్

గురునానక్ చేసిన ఆఖరుపర్యటన మక్కా, మదీనా, మెసపొటేమియాలకు. ఈ పర్యటనలో ఆయనవెంట మర్దానా వెళ్లెను. ఈసారి నానక్ ముస్లిమ్ హాజీవలె నీలిదుస్తులు ధరించెను. ఒక చేత కుండకమండలము చంకలో పవిత్రగ్రంధము, రెండవచేత ప్రార్ధన చేసుకొనుటకు చాప తీసుకువెళ్లెను అవకాశము దొరకినప్పుడెల్ల శుద్ధ మహమ్మదీయునివలె ఆయన ప్రార్ధనలు చేసెను. తానెవ్వరో ఎవ్వరికీ చెప్పనే లేదు.

నానక్, నడిచి నడిచి అలసిపోయి మక్కా చేరినవెనుక రాత్రి పూట కాబావైపు కాళ్లుపెట్టి నిద్రపోయెను. మహమ్మదీయు డెవరూ ఇట్లు చేయరు కనుక ఇది దేవునికి అపచారము చేయుటే యని భావించి ఒక మౌల్వీ కోపముతో నానక్‌ను తన్ని నిద్రలేపి "మూర్ఖుడా ! దేవాలయమువైపు కాళ్లుపెట్టి పడుకొనరాదని నీకు తెలియదా ?" అని గద్దించెను. గురువు కలతచెందక నిబ్బరముగా ఇట్లు పలికెను : "అటులైన ఇంత అట్టహాసమెందుకు ? దేవుడు లేనివైపు నా కాళ్లను త్రిప్పరాదా ?" మౌల్వీ వెంటనే నానక్ కాళ్లు పుచ్చుకొని వాటిని అటువైపు బరబరా ఈడ్చెను. వానికి అక్కడకూడ భగవంతుడు కనబడెను. అదిచూచి అక్కజపడి "అల్లా! అల్లా! వీడెవడో అద్భుతములు చేయువానివలె ఉన్నాడు. వీడు మానవులకు దేవుడు కనబడునట్లు చేయును." అని పరుగెత్తి

పోయి తోడివా రందరికి ఈ ఉదంతమును వివరించెను. ఇది వారందరు ఆయనను చుట్టుముట్టి, హిందూ ముస్లిములలో ఎవరు గొప్పవారో వివరించ వలసినదని ప్రార్థించిరి. సదా సత్కృత్యములు చేయుచు భగవంతునియందు నివసించువాడే గొప్పవాడని గురువు జవాబు చెప్పెను.

"రంజాను మాసములో ఉపవాసము చేయుదువా?" అని వారు ఆయనను ప్రశ్నించిరి?

"నేను ప్రతిరోజు ఉపవాసము చేయుదును. నా చేయు ఉపవాసము నా దృష్టిని ఇతరముపై మరల్చక ఒకదానిపై కేంద్రీకరించుటయే కాని అన్యముకాదు. దయను పెంపొందించి, కోరికలను వదల్చుకొనుటయే నా ఉపవాసము."

"అయితే నీవు కురాను పఠింతువా?"

గురువు: "నేను చదవను. భగవంతుడు ఏమి ఆదేశించిన అదే చేయుదును. చదువుట వలన మనశ్శాంతి కలుగదు. ఆందోళన అణగదు. ప్రేమించువాడు మాత్రమే పూజించగలడు. అయితే వాని వాని దేవతలు పరస్పరము కలహించుకున్నప్పుడు దైవసన్నిధి ఎట్లు లభించును?"

అనేకమంది ముస్లిమ్ పండితులు భారతదేశమునుండి వచ్చి నానక్‌ను సందర్శించి ఆయనతో చర్చించిరి. వారిలో షేక్ ఇబ్రాహిమ్, మఖ్దుమ్ బహూదిన్ ప్రభృతులు ప్రముఖులు. వారు మక్కాలోని కాజీలందరికి నానక్ అసాధారణ ప్రజ్ఞను గురించి వివరముగా తెలియచేసిరి. వారు ఆయనను సందర్శించి నమస్కరించి, ఇతరులెవ్వరు నానక్‌తో వాదమునకు దిగరాదని సూచించిరి.

వారు అడిగిన అనేక ప్రశ్నలకు జవాబు చెప్పుచు "భగవదాదేశమును వినమ్రతతో శిరసావహించుట వల్లనే భగవదనుగ్రహము కలుగునని నానక్ వివరించెను.

కొంతకాలమైన తరువాత గురువు మదీనాకు, అక్కడనుండి బాగ్దాదుకు వెళ్లెను. అక్కడ ఆయన నగరమునకు వెలుపల కూర్చుండి ఎలుగెత్తి ప్రార్థన చేసెను. "లక్షలకొలది పాతాళము లున్నవి. ఆకాశములున్నవి. వీటి అంతు ఎవరికీ తెలియలేదు. తానెంతదూరము వ్యాపించెనో నా భగవంతునికి మాత్రమే తెలియును." ఇది విని మౌల్వీలందరు ఎంతో కోపగించు కొనిరి. ఎందుకనగా వారి సిద్ధాంతము ప్రకారము ఏడు స్వర్గములు, ఎన్నో పాతాళములు కలవు. కాని భగవంతుని శక్తి సామర్థ్యములను పూర్తిగా కనుగొనదలచిన మానవుడు చివరకు అలసిపోవునని నానక్ చెప్పెను. ఆయన గౌరవార్థము నిర్మించబడిన మందిరమొకటి నేటికిని బాగ్దాదులో ఉన్నది. దీని నొక మౌల్వీ నిర్వహించుచుండును. దానిగోడకు తాపడముచేసిన శిలా ఫలకములో ఇట్లున్నది: "గురుబాబా నానక్ ఫకీర్ జౌలియా సంస్మృతిగా ఈ భవనము సప్తసాధువుల సహాయముతో కొత్తగా నిర్మించబడినది." సంవత్సరము 927 హిజరీ (క్రీ. శ. 1520-21).

అనంతరము గురువు ముల్తానుమీదుగా మన దేశమునకు తిరిగి వచ్చెను. ఆ రోజులలో ముల్తాను నగరమును పెక్కుమంది సాధువులు సందర్శించుచుండిరి. అక్కడి సాధువొకడు ఒకదొన్నె

నిండుగా పాలుపోసి గురువు వద్దకు పంపించెను. దానికి అర్థము "ఈ నగరము నిండ ఇదివరకే సాధువులున్నారు. నీ కిక్కడ తావు లేదు" అని. దానికి జవాబుగా గురువు, ఆ దొన్నెలో పాలపై తేలియాడునట్లుగా ఒక మల్లె పువ్వుంచి తిరిగి పంపివేసెను. పాలపై బరువులేని మల్లెపువ్వు తన సౌరభమును దశదిశల విర జిమ్ముచుండునట్లుగా తను సైతము వారికి భారముకాకుండ ఇక్కడ నుందునని ఆయన ప్రత్యుత్తరము!

# 7

*తేజస్సు తేజస్సులో కలిసిపోవును - మానవుడు పరిపూర్ణుడగును*

—గురు అర్జున్

ఈ సరికి గురునానక్ పేరు ప్రతిష్ఠలు చాలదూరము వ్యాపించెను. ఆయన వయోవృద్ధుడాయెను. ఆత్మ పరువముగా నున్నను శరీరము జరాగ్రస్థమగుట ఆయన రావీ తీరమున కర్తార్‌పూర్‌లో స్థిరనివాస మేర్పరచుకొనెను. ఆయన యాత్రికుని దుస్తులు వదలి గృహస్థు దుస్తులు ధరించెను. ఆయన భార్య, బిడ్డలు ఇదివరకే కర్తార్‌పూర్ చేరియుండిరి. తన కుమారుడైన లక్ష్మీదాసుతో కలిసి వ్యవసాయము చేయ మొదలిడెను. శ్రీచంద్ ఇల్లువీడిపోయెను. గురువు పునరాగమన వార్త విని దేశము నాలుగు చెరగులనుండి స్త్రీ పురుషు లనేకమంది కర్తార్‌పూర్ వచ్చి ఆయన ఉపదేశమును స్వీకరించుచుండిరి.

ఇక్కడే గురువుకు ఆజన్మ సహచరుడుగా ఉన్న మర్దానా మరణించెను. గురువు మర్దానా కుమారుడైన షాజాదాను తన పరివారములో కలుపుకొనెను. వాడును తన తండ్రివలె చక్కగా సత్సంగములందు శ్రుతి వేయువాడు నేటికిని గురుద్వారాలలో హరి కీర్తనము జరుగునప్పుడు ముస్లిమ్‌లు శ్రుతివేయుట సంప్రదాయము.

ఇక్కడనే భాయి లెహ్నా గురునానక్ శిష్యుడాయెను. ఈయనే నానక్ తరువాత అంగద నామముతో గురుపీఠ మధిష్ఠించి సువిఖ్యాతుడాయెను. ఈ లెహ్నా తరచు వైష్ణోదేవి మందిరమునకు జని పూజలు చేయువాడు. ఒకసారి యథాప్రకారముగా యాత్ర

చేయుచుండగా దోవలో కర్తార్‌పూర్ ఆశ్రమమున ఒక రాత్రి మజిలీ చేయవలసినదని, ఆయనను సిక్కుభక్తుడొకడు ఎంతయో ప్రోత్సహించెను. ఆ సందర్భమున లెహ్నా గురునానక్‌ను సందర్శించెను. గురునానక్ పవిత్ర ప్రశాంత గంభీరవదనము, అపూర్వ వివేకము వాని నాకర్షించగా ఆయనకు శిష్యుడై శేషజీవితమును అక్కడే గడిపెను.

ఒకరోజున తన శిష్యులను పరీక్షించుటకై గురువు కిరాత వేషము ధరించెను. చిరిగిన చొక్కా, చేత కత్తితో వేటకుక్కలు వెంటరా ఆయన అడవివైపు వెళ్లెను. ఆయన ఈవేషముచూచి అనుచరులలో అనేకమంది భయపడి పారిపోయిరి. కొంతదూరము కూడా వెళ్లిన మరికొందరు అక్కడ నేలమీద రాగికాసులు కన బడగా వాటిని ఏరుకొనుచు వెనుకను నిలిచిపోయిరి. మరికొంత దూరము పోయిన వారికి వెండినాణెములు కానరాగా వాటిని ఏరు కొనుచు ఇంకొందరు నిలిచిపోయిరి. ఇక ఇద్దరు సిక్కులు, లెహ్నా మాత్రము గురువువెంట మిగిలిరి. వీరందరూ ఒక చితిని సమీ పించిరి. దాని ప్రక్కనే తెల్లని బట్టక్రింద కుళ్లిన శవమొకటి దుర్వాసన కొట్టుచుండెను. గురువు గుడ్లెర్రజేసి 'తనతో ఉండదల చిన వాడెవడైన ఈశవమాంస భక్షణము చేయవలసినదే' యని ఉరిమి చెప్పెను. మిగతా సిక్కు లిద్దరు వెంటనే గురువును వదలి ఉడాయించిరి. లెహ్నా మాత్రము అక్కడే నిలిచి "నేను మాత్రము నా స్వామి యానతిని నెరవేర్చెదను" అని చెప్పి శవముచెంత కేగ బోయెను. అంతట గురువు వానిని నిరోధించి "చాలు! నా దోవను ఎంతమంది అనుసరించ గలరో చూడదలచితిని. అంతేకాని అన్యము కాదు!" అని వివరించెను.

లెహ్నా పొలముపని చేయుటయే కాక పనిలేనప్పుడు నామ స్మరణముతో కాలక్షేపము చేయువాడు. నానక్ ఆయనను అనేక విధములైన పరీక్షలకు గురిచేసెను. వాటన్నింటికి లెహ్నా ఓర్చు కొనెను కాని నానక్ కుమారులు మాత్రము పదేపదే తండ్రిని ధిక్కరించుచు వచ్చిరి. ఇతర అనుచరులు పనిమాలి పారిపోవు చుండెడివారు. లేదా పనిచేసిన అర్థాసక్తితో చేసెడివారు. లెహ్నా మాత్రము తన విశ్వాసమును కొంచెమైన సడలనీయలేదు. తన అవసాన సమయము సమీపించుచుండెనని తెలుసుకున్న గురువు లెహ్నాను తన అనంతరము గురుపదమున కభిషేకించి అయిదు పైసలు, కొబ్బరికాయ ఆయన ముందుంచి నాలుగుసార్లు ప్రదక్షిణము చేసెను. భాయి బుడ్డా ఆమోదసూచకముగా ఆయననుదుట తిలకముంచెను. గురునానక్ వినయ మంతటిది. తన శిష్యు లామోదించువరకు తన నిర్ణయము సార్థకము సంపూర్ణము కాదని గుర్తెరిగిన మహానుభావుడు.

గురునానక్ భార్యకు ఈ నిర్ణయము సమ్మతము కాకపోయెను. ఆమె కుమారు లిద్దరిని తెచ్చి ఆయన పాదములపై పడవేసి ఇట్లడిగెను: "నా గతిఏమి ? వీరి గతిఏమి ?" నానక్: "మీకు భగవంతుడే గతి. భగవంతు డాదేశించిన ప్రకారమే నేను చేసితిని."

గురువు అంతట ఈ పద్యమల్లి వినిపించెను:

"జయము నా సత్యప్రభూ జయము. నీవే అందరిని సృష్టించి
అన్ని పనులు పురమాయించెదవు.
రోజులు తీరినవెనుక, గిన్నె నిండిన తరువాత నీవు ఆత్మనుండి
శరీరమును వేరుపరతువు.

ఆ క్షణము వచ్చినప్పుడు హంసను తీసుకు పోదువు. ప్రియ
బంధువులు ఏడ్తురు.
దేవుని స్మరించుడు, ఓ ప్రియబంధువులార, అందరు పోవలసిన
వారే.
ప్రపంచములో ఉండేది కొన్నిరోజులు మాత్రమే. తరువాత
మనము విడిపోయెదము.
అతిధివలె మనము సెలవుతీసుకొని పోవలె, గర్వించరాదు.
పరలోకమున పరగణింపబడునవి, చర్యలే తన ప్రేమలో
నివసించినవారినే భగవానుడు స్వీకరించును
ఓ తండ్రీ, వారే నిజముగా విచారించువారు, ప్రేమలో విచా
రించువారు మనమంచికే గాని వస్తువులకు గాదు.
ఓ ప్రియా, వారే మనకై విచారించెదరు, ప్రేమకై విచారించు
వారు.''

అంతట గురువు సోహిలా (దైవస్తుతి) ను పఠించుడని శిష్యు లందరిని కోరెను. ప్రతి రాత్రి పరుండబోవునప్పుడు తన శిష్యు లెల్లరు దీనిని పఠించవలెనని ఆయన ఆదేశించెను.

"నిదానమున నివసించు నా ప్రభుని స్తుతించుడు.
నా ప్రభుడు నిర్భయుడు. ఆయన గీతము మనస్సును కుదుట
పరచును.
ఆయన దానము అగణితము, దాతకు వెలకట్టగలవా రేదీ?
సాలు, మాసము, గంట వివాహ ముహూర్తము నిశ్చయ
మాయెను,
ప్రాంగణమున నూనెపోయుడు మిత్రులార, నా ప్రియ సమా
గమమును ఆశీర్వదించుడు.

ఇంటింట నేడు, రేపు పరలోకమునుండి వచ్చును పిలుపు.
కాన మీ దేవుని మనసులో నిలుపుకొనుడు ప్రతివారికి ఆ రోజు
వచ్చితీరును.''

అంతే. నానక్ సమాధిగ్రస్తుడాయెను. ఆయన ఐహిక జీవితము అంతతో ముగిసెను. అంతట నానక్ దేహమును దహనము చేయవలెనా లేక ఖననము చేయవలెనా అని ఆయన హిందూ ముస్లిము శిష్యులు తమలో తాము వాదులాడుకొనిరి. ఉభయులు గట్టిపట్టే పట్టిరి. అంతట మధ్యవర్తులు రాజీగా నానక్ శవమును రాత్రి అంతయు ఇరువురు తెచ్చిన పుష్పములతో కప్పి ఉంచవలెననియు, ఎవరిపుష్పములు వాడిపోయిన, వారు రెండవవారు చెప్పినట్లు చేయవలయునని ఆదేశించిరి. వల్లెయని వారట్లే చేసిరి. మర్నాడు ఉదయమున నానక్ దేహముపై కప్పిన దుప్పటిముసుగు తొలగించి చూడగా అక్కడ ఆయన దేహము లేదు. ఉన్నవల్లా పువ్వులు మాత్రమే. అంతట ఆ దుప్పటినే చెరిసగము పంచుకొని ఒకదానిని దహనము చేయుటకు, మిగతా భాగమును ఖననము చేయుటకు వారు నిశ్చయించుకొనిరి.

తన జీవితకాలములోనే మహాపురుషుడుగా ఖ్యాతి కెక్కిన మహానుభావుని జీవితగాథ ఈ విధముగా ముగిసినది. నిజమునకు ఆయన జీవితమంతయు సత్యానుభవమే తప్ప అన్యముకాదు. ఆయన జీవిత పరమార్థమును తన సంపూర్ణ వ్యక్తిత్వముతో నిర్వ చించి ప్రదర్శించినాడు. ఆయన చూపిన దోవను పయనించిననాడు మానవునికి స్వేచ్ఛ, సౌఖ్యములు లభించగలవు.

# నానక్ వాణి

''అన్నింటికంటె సత్యం గొప్పది,
అంతకంటె గొప్ప సత్యమార్గంలో నడవడం''

# భగవంతుడు

ఓం. అద్వితీయుడు. సద్రూపుడు. సత్యమూర్తి. సర్వవ్యాపి. సృష్టికర్త. పురుషోత్తముడు. నిర్భయుడు. నిర్వైరి. కాలాతీతుడు. అభవుడు. స్వయంభువు. విజ్ఞానదాత. దయామయుడు.

(ప్రథమ గురువు - గురునానక్, మూలమంత్రము)

ఆదిలో ఉన్నాడు. యుగాదిని ఉన్నాడు. భవిష్యంలో ఉంటాడు.

(జపజీ)

భగవంతుడు నియోజితుడు కాడు. సృష్టింపబడినవాడు కాడు. తనంతట తాను ఉన్నాడు. నిరంజనుడు.

(జప - 5)

సత్కర్మవల్ల మంచి జన్మ రావచ్చును. కాని, భగవంతుడి దయ లేనిదే మోక్షం మాత్రం రాదు.

(జప - 5)

భగవంతుణ్ణి మెప్పించిందే మంచిది.

(జప - 16)

మూలశబ్దమైన ఓంకారానికి ప్రణామాలు. మాయకు, సృష్టికి మూలకారణం అది. సచ్చిదానంద రూపమైన నీకు జయము.

(జప - 21)

భగవంతు డెంత మహిమాన్వితుడో అతనికే తెలియును.

(జప - 24)

సర్వత్ర భగవంతుడి ఆసనము ఉన్నది. అన్నిచోట్ల ఆతని అంగడి ఉంది. అక్కడ, తనకు తోచినది తా నుంచుతాడు.

(జప - 31)

భగవంతుణ్ణి దర్శించినవాళ్లను భగవంతుడే ఎరుగును.

(అస. 4 · 2)

భగవంతుడికి చావులేదు. ఆతనికోసం విచారించేవాళ్లూ లేరు.

(అస. 4 · 3)

దాత సర్వేశ్వరుడే. ఆయన దాతృత్వానికి అవధిలేదు.

(ఆస 4 3)

అతని దాతృత్వమే అమూల్యమైనప్పుడు, అతనికి వెలకట్టేవా ళ్లెవరు?

(గౌరీ. దీపకి. 4 1)

ఘటికను, విఘటికను, దినమును, ఋతువును - అన్నింటిని - కల్పించినది సూర్యుడు. ఇలాగే సర్వేసర్వత్ర వ్యాపించి ఉన్న వాడు భగవంతుడే.

(అస. 4 1)

నువ్వు సహస్రాక్షుడివి. కాని నీకు నేత్రాలు ఉన్నాయా? నీకు అనంతరూపాలు ఉన్నాయి. కాని, నీకు రూప ముందా? నీకు సహస్ర పాదాలు ఉన్నాయి. కాని, నీకు పాదాలు ఉన్నాయా? ఘ్రాణేంద్రియాలు నీకు వేలకొలది ఉన్నాయి. కాని, నీకు ముక్కు ఉందా? చిత్రాలలో చిత్రమైంది నీ స్థితి. సర్వవ్యాపివి నువ్వు.

(ధనశ్రీ. 4 · 3)

సత్యస్వరూపుణ్ణి దర్శించినప్పుడే సత్యస్వరూపము అభివ్యక్త మవుతుంది. అప్పుడే తాదాత్మ్యస్థితి లభిస్తుంది.

(శ్రీరాగ్ 4 . 10)

నా బుద్ధిని, తర్క-శక్తిని పరమేశ్వరుడి ముందు త్యజించాను. ఆయన నిర్వికారుడు.

(శ్రీరాగ్. 1 11)

దేవుడంటే, భయభక్తు లున్నప్పుడే మనకు భయముండదు.

(శ్రీరాగ్. 2 · 11)

మనకు ప్రాణదానాన్ని, ఆత్మదానాన్ని చేసిన సర్వేశ్వరుడు లభించినప్పుడే, మనకు చిత్తశాంతి కలుగుతుంది.

(శ్రీరాగ్ 2 11)

తన ప్రభువును ప్రేమించని వధువు వ్యర్థురాలు.

(శ్రీరాగ్. 1 . 13)

సర్వత్ర ఒకే ప్రకాశవస్తువును దర్శించి, గురూపదేశాన్ని గ్రహించినప్పుడే మనుష్యుడికి స్వస్వరూపజ్ఞానము కలుగుతుంది.

(శ్రీరాగ్. 4 : 14)

అహంకారము ఉన్నవాళ్లు పరమేశ్వరుడికి దూరమవతారు.

(శ్రీరాగ్. 4 : 18)

వస్తువును సృష్టించిన పరమేశ్వరుడే దాని భోక్త. ఆయనే వధువు. ఆయనే వరుడు. ఆయన సర్వవ్యాపి. లీలావినోది. ఆయనే చేప, ఆయనే జాలరి. ఆయనేనది, ఆయనే వల.

(శ్రీరాగ్)

. నీ జ్ఞానము మహానది. నేను ఒక చేపనే. నీ వైశాల్యాన్ని నే నెలా గ్రహించగలను ?

(శ్రీరాగ్)

ఆయన సత్యస్వరూపుడు. ఆయనకు సత్యమంటే ప్రేమ.

(శ్రీరాగ్. 2 32)

నిన్ను సృష్టించినవాడు ఆయనే. నీకు అతీతుడూ ఆయనే.

(శ్రీరాగ్. 1 . 79)

సృష్టికి, ఆయనకు ఇతరుల సాయము అనావశ్యకము. సంహారానికీ అంతే. ఇవ్వడము, తీసుకోడము ఆయన ఇష్టము.

(అష్టపదులు. శ్రీరాగ్. 4 1)

భగవంతుడి కృపకు అందరూ పాత్రులే. కాని, ఆయన ఎన్నుకొన్నవాడికే అది లభిస్తుంది.

(శ్రీరాగ్. అష్టపది. 4 : 1)

మనము పరాత్పరుడి వధువులము. ఆయన తృప్తికోసం అలంకరించుకొంటాము. కాని, మనకు అహంకారగర్వముంటే అలంకరణవల్ల లాభంలేదు.

(శ్రీరాగ్. అష్టపది. 1 : 2)

నీకు నువ్వే ఉదాహరణప్రాయుడివి. నువ్వే వజ్రానివి. నువ్వే దాని వెలకట్టే షరాబువి. కాని, నువ్వు అమూల్యమైన వాడివి. గౌరవమర్యాదలు నీవి. అవి అనుగ్రహించేవాడివి నువ్వే.

(శ్రీరాగ్. అష్ట. 1 : 3)

భగవంతు డొక్కడే నిరంజనుడు. మిగిలినవాళ్లందరూ మాయాబద్ధులే.

(శ్రీరాగ్. అష్ట. 4 . 3)

నీకు రూపం లేదు. కాని, నువ్వు అందరి హృదయాలలోను ఉన్నావు.

(శ్రీరాగ్. అష్ట. 2 . 3)

భగవంతు డంటే భయంలేనివాడికే భయం ఉంటుంది. వాడికి అంతా అంధకారమే.

(శ్రీరాగ్. అష్ట. 3 · 3)

నిన్నందరు "గొప్పకంటె గొప్ప" అంటారు. కాని, నిన్ను చూచిన వాళ్లెవరు? గురువు నిన్ను దర్శింపచేస్తాడు. అంతే. ఇంక అన్నిచోట్ల నువ్వే కనబడతావు.

(శ్రీరాగ్. అష్ట. 8 : 3)

నువ్వు మమ్మల్ని సృష్టించావు. నీతోటే మా బ్రతుకు. నీ ఇచ్ఛాను సారమే మా మృతి. నిన్ను పొందడంకూడా నీ దయమీదనే ఆధార పడి ఉంది.

(శ్రీరాగ్. అష్ట. 8 : 4)

ఆయనే అల్లా. తెలియరానివాడు, అగణిత శక్తిసంపన్నుడు, సృష్టికర్త, కారకుడు, దయాళువు.

(శ్రీరాగ్. అష్ట. 6 : 17)

ఇచ్చేవాడు ఆయన, ఇస్తూనే ఉంటాడు. "చాలు" అనేది, తీసు కొనేవాడే.

(జప - 3)

కానుకలన్నీ ఆయనవే. కొందరు మేల్కొని ఉండికూడ వాటిని గ్రహించలేరు. నిద్రలేపి, కొందరి కవి ఇస్తాడు ఆయన.

(శ్రీరాగ్. వార్. శ్లోకము)

భగవంతుడు ప్రపంచాన్ని సృష్టించి, దానిలో అంతర్లీనమై ఉంటాడు.

(శ్రీరాగ్. వార్. శ్లోకము)

సంశయంవల్ల ప్రపంచం అపమార్గం పడుతుంది. అలా దారి తప్పించింది నువ్వేగదా!

(శ్రీరాగ్)

భగవంతుడు నా మంచిచెడ్డలు చూడలేదు. నన్ను తన హృదయానికి హత్తుకొన్నాడు. అంతే, ఇంక నన్ను వేడిగాలికూడా ముట్టుకోవడానికి భయపడింది.

(శ్రీరాగ్)

నువ్వు యోగులలో యోగివి. భోగులలో భోగివి. స్వర్గ మర్త్య పాతాళలోకాలలో నీ ఆద్యంతాల్ని ఎరిగినవాళ్లు లేరు.

(శ్రీరాగ్)

ప్రపంచం గుడ్డిది. కన్నున్నవాడు ఆపన్నరక్షకు డొక్కడే.

(అస 2 : 4)

అన్ని కారణాలకు కారణం నువ్వు, సృష్టికర్తవి. ఇంక నేను ఈ ప్రపంచంమీద ఆధారపడి ఉండడం దేనికి?

(అస. 2 : 4)

నీ మహిమ గొప్పది. నీ పేరు గొప్పది. నువ్వు న్యాయమూర్తివి కాబట్టి నీ మహిమ గొప్పది. నీది అనంతస్థితి. అడగ

కుండా నువ్వే మాకు ఇస్తావు. నీ మహిమ గొప్పది. నానక్ అంటాడు : "నీ లీలలు అనిర్వచనీయాలు. భూతభవిష్యద్వర్తమానాలు నీవి," అని.

(అస. వార్)

నువ్వు సృష్టించిన ప్రపంచాలు, విశ్వాలు, సద్రూపాలు. నీ చేతలు, నీ ఆజ్ఞలు సత్యసమ్మతాలు. నీ న్యాయం, నీ నిర్ణయం, నీ మాట, నీ చేత - మాకు శిరోధార్యాలు. నిన్ను సచ్చిదానంద మూర్తి అంటారు. నీలో సర్వశక్తులు, సర్వ ఐశ్వర్యాలు రాశీభూతంగా ఉన్నాయి. నువ్వే నిజమైన ప్రభువవని నాకు తెలుసును.

(అస. వార్ శ్లోక)

నానక్ అంటాడు : "పరమేశ్వరుడు తన ధర్మసూత్రాల్ని అనుసరించి శాసిస్తాడు; యుక్తియుక్తంగా ప్రవర్తిస్తాడు," అని.

(అస. వార్)

భగవంతుడి శాసనభీతివల్ల గాలివీస్తుంది. నదులుప్రవహిస్తాయి. అగ్ని జ్వలిస్తుంది. మేఘాలు సంచరిస్తాయి. ధర్మరాజు (యముడు) తన విధ్యుక్త ధర్మాల్ని నెరవేరుస్తాడు. పరమేశ్వరుడి శాసనం వల్లనే సూర్యచంద్రులు ప్రకాశిస్తారు. సిద్ధులు, బుద్ధులు, నాథయోగులు, పరాత్పరుడి దయకు పాత్రులు. ఆజ్ఞకు బద్ధులు. సృష్టి సమస్తం ఆయన చెప్పుచేతలలో ఉంది. నానక్ అంటాడు : "భయరహితుడు ఒక్క పరమాత్మే" అని.

(అస. వార్. శ్లోకం)

ప్రభూ, నువ్వే సృష్టికర్తవి. నే నెంతవాణ్ణి? నేను సృష్టించగలనా?

నీ సృష్టిలో గర్భితంగా నీ తేజస్సు ఉంది. నీ తేజస్సునుబట్టి నీ "ఉనికి"ని గ్రహిస్తున్నాము. నువ్వు నిర్గుణుడవే అయినా అన్ని గుణాలు నీలో ఉన్నాయి.

సృష్టికి మూలకారణమయిన నీకు జయము. "ప్రభువును ఆజ్ఞాపించికాదు, ప్రార్ధనతో వశంచేసుకోవాలి" అంటాడు నానక్.

"ప్రభువంటే భక్తి కలగని సేవ ఏమి సేవ" అంటాడు నానక్. నిజమయిన సేవకుడు, ప్రభువులో లీనమైపోవాలి.

ఆయన చెప్పినపని నేను చేస్తాను. నాకు నేనై చేసేది ఏమీ లేదు.

(అస. వార్. శ్లోకం)

మా ప్రభువు యోగి; సృష్టికి పూర్వం ఉన్నాడు. అప్పుడు స్త్రీ పురుష వివక్ష లేనే లేదు.

(ధనశ్రీ. అష్టపది)

భక్తుడు ప్రభువుదగ్గిర ఆక్రోశిస్తే ఆయన వింటాడు. మంచి జరిగినా, చెడు జరిగినా – అది ఆయన కృప అనుకోవాలి.

(అస. 1 . 3)

పరమేశ్వరుడి మాయను తెలుసుకోగలిగినప్పుడు, పురుషుడు తానే భగవద్రూపుడు అవుతున్నాడు.

(రామ్‌కలీ)

పరమేశ్వరు డొక్కడే త్రికాలా బాధితుడు.

(అస)

ప్రభూ, నీ లీలల్ని నేను తెలుసుకోలేను. నువ్వు సర్వత్ర వ్యాపించి ఉన్నావు.

(సుహీ)

పరమేశ్వరుడు, హృదయంలో ఉన్నవాడికి, అక్కడ ఇంక దేనికీ స్థానం ఉండదు. అతను తన్నుతాను (మారు) మరచిపోతాడు.

సత్యానికి, దయకి, తృప్తికి, వివేకానికి, ధర్మానికి నిలయమయిన దేహనగరం చరితార్థం. అక్కడ నిరంజనుడు, నిస్సంగుడు అయిన ప్రభువు వసిస్తాడు.

(మారు)

అనిర్వచనీయమయిన మూలతత్త్వాన్ని తెలుసుకోడం ఎలాగ? గురు కృపవల్ల. గురువు నీలోనే ఉన్న పరతత్త్వాన్ని నీకు చూపిస్తాడు.

(వసంత్)

ప్రభూ, వృక్షాన్ని ఆశ్రయించిన పక్షుల్లాగ, మేము నీ అనంతత్వాన్ని ఆశ్రయించుకొని ఉన్నాము.

(గుజ్రీ)

నా ప్రభువునకు తల్లిలేదు. తండ్రిలేదు. కొడుకులు లేరు. 'నా' అనే వాళ్లెవరూ లేరు. కామంలేదు. భార్యలేదు. కులంలేదు. మతం

లేదు. నిరంజనుడు. గొప్పవాళ్లకంటె గొప్పవాడు. అంతటా వెలుగై ఉన్నాడు.

(సొరఠా)

వసంతం ప్రకృతిని వికసింపజేస్తుంది. కాని, పరమాత్మ అంతకి పూర్వమే వికసించి ఉన్నాడు. అన్నిటినీ వికసింపజేసే ఆయన వికాసానికి, ఎవరిసాయం అక్కరలేదు.

(వార్. రాగ్. సుహీ. శ్లోకం)

అద్వితీయుడు. ఓంకార స్వరూపుడు. నిరంజనుడు. త్రికాలాబాధితుడు. స్వయంభువు. కులం లేనివాడు. నిస్సంగుడు. రూపరహితుడు. నిర్గుణుడు. అవర్ణనీయుడు.

(బిలవల్ తిట్టీ)

సద్రూపుడు తానే స్వయంగా ఈ విశ్వాన్ని సృష్టించాడు. బ్రహ్మాండాన్ని రెండుగాచీల్చి, వేరుచేసి, మళ్లీ ఏకం చేశాడు. భూమ్యాకాశాలు ఆయన స్థావరాలు. రేయింబవళ్లని, భయ ప్రేమల్ని ఆయనే కల్పించాడు. వీటికి ఆయనే సాక్షీభూతుడు. సృష్టికర్త ఒక్కడే పరమాత్మ.

(బిలవల్. తిట్టీ)

సృష్టికి మూలం భగవంతుడు. అంతా ఆయనే. కాలాతీతుడు. అన్ని యుగాలలో ఉన్నవాడు. ఇంకెవ్వరూ లేరు. సృష్టికిగాని, ప్రళయానికిగాని ఆయనే కర్త.

(రామ్‌కలీ - 6)

ముల్లోకాల్ని సృష్టించి తన ప్రకాశంతో వాటిని పరమాత్మ నింపివేశాడు.

(రామ్‌కలీ . దఖ్ని. ఓంకార్ - 2)

అద్వితీయుడు అంతటా నిండి ఉన్నాడు. అన్ని రూపాలలో, అన్ని వర్ణాలలో ఉన్నాడు. పంచభూతాల ద్వారా పనిచేస్తాడు. ముల్లోకాల్లో సంచరించేవాడు ఒకే ఒక పరమాత్మ.

(రామ్‌కలీ. దఖ్ని. ఓంకార్ - 7)

ఆయన తనంతటివాడు తాను. అవాఙ్మానస గోచరుడు. ఇంద్రియాతీతుడు.

(రామ్‌కలీ. దఖ్ని. ఓంకార్ - 15)

అపరిమితుడు తనంత తాను పరిమితు డయ్యాడు. నిర్గుణుడు సగుణు డయ్యాడు.

(రామ్‌కలీ దఖ్ని. ఓంకార్ - 24)

మనలోపల, మనవెలుపల ఆయన ఉన్నాడు. త్రిలోకాల్లో ఉన్నాడు.

(రామ్‌కలీ. సిద్దగోష్ఠి)

ఆయన ఆజ్ఞ అయితే, 'కాకి' 'హంస' అవుతుంది.

నా స్నేహితుడికోసం నేను వెదుకుతున్నాను. నాకు తెలియకుండానే, ఆయన నాపక్కనే ఉన్నాడు. ప్రభువు అగోచరుడు. నానక్ అంటాడు- "గురుప్రసాదంవల్ల ఆయన్ని చూడవచ్చును," అని.

శరీరపురంలో మనోదుర్గం. అందులో పదో ఇంట ప్రభువు ఉంటాడు.

(మారు. దక్షి)

నీళ్లతో ఆరిపోయే నిప్పుని, భగవంతుడు సముద్రంలో ఉంచుతాడు.

నువ్వు నిర్ధనుల ధనానివి. దారి తెలియని వారి గురువువి. దుర్బలుల బలానివి. అంధుల వెలుగువి. ఓ ప్రభూ! ఓ గురూ!

(మారు. దక్షి)

## ప్రపంచం

యుగయుగాలుగా ప్రళయం. అనంతుడు, అపరిమితుడు, నిర్వికల్పుడు అయిన పరమాత్మ నిశ్చలంగా ఉన్నాడు. ఈ విధంగా ముప్పైఆరు యుగాలు గడిచాయి. ఆయన అద్వితీయుడు కాబట్టి నిర్వైరి. తరవాత నాలుగు యుగాల్ని సృష్టించినప్పుడు, వాటిలో అంతర్లీను డయ్యాడు. అన్ని యుగాలలో సాక్షీభూతుడయి భగ వంతు డొక్కడే ఉన్నాడు.

(మారు - 7)

పరమాత్మ తటస్థుడు. తన్నుతాను సృష్టించుకొన్నాడు. ప్రపం చాన్ని సృష్టించాడు ఆ కరుణామయుడు. పంచభూతాల్ని బంధించి

శరీరాన్ని సృష్టించాడు. ఈ 'కోట'కు నవద్వారాల్ని కల్పించాడు. పదోద్వారం దగ్గిర తా నుంటాడు.

(మారు - 16)

ఇంద్రియాతీతుడు తన నిర్వికల్ప సమాధిలో ఉన్నాడు. తాను ఆదిమధ్యాంతరహితుడయినా, ప్రకృతిని సృష్టించాడు. ప్రళయం లోంచి ప్రకృతి ఉద్భవించింది! ఆయన అపరిమితత్వంలోంచి ప్రపంచం, పాంచభౌతికదేహాలు, మనస్సు జన్మించాయి. తన ప్రకాశంతో వాటిని ఆయన ప్రకాశింపజేశాడు. సృష్టిఅంతా అనభి వ్యక్తంగా ఆయనలో ఉంది. అపరిమిత పరబ్రహ్మ కారణంగా, బ్రహ్మ విష్ణు మహేశ్వరులు ఆవిర్భవించారు. విశ్వం అంతా ఆయన నిండి ఉన్నాడు.

(మారు)

ఆయన అనంతత్వంలోంచే, ఏడు పాతాళలోకాలు పుట్టాయి. వాటికి ఆయనే ఆధారభూతుడు. సత్త్వరజస్తమోగుణాలు ఆయన కల్పించినవే. జనన మరణాలు, అహంకార మమకారాలు ఆయన నుంచి అభివ్యక్తమయినవే.

(మారు - 17)

పంచభూతాలకు మూలతత్త్వం ఆయనే.

(మారు - 17)

ప్రపంచంలోని ప్రతి జీవిలోను ఆయన ఉన్నాడు. కాని, మన ప్రభువు అన్నింటికి అతీతంగా కూడా ఉన్నాడు. ప్రపంచం ఆయన ప్రతిబింబం. ఆయనకు జననీ జనకులుగాని, అన్నదమ్ములుగాని,

ఆలుబిడ్డలుగాని లేరు. చావులేదు, పుట్టుకలేదు. కులంలేదు, మతం లేదు. ఆయన సనాతనుడు. నాకు ఆనందాన్ని ప్రసాదించేవాడు.

(మారు - 18)

ప్రభూ, సత్త్వరజస్తమోగుణాత్మకం ఈ ప్రపంచం. జాగ్రత్స్వప్నసుషుప్తులు ఉన్నది. నీది తురీయస్థితి. జననమరణాదులకు అతీతుడవు నువ్వు. అంతర్యామివి. ప్రపంచాన్ని నీ వెలుగుతో నింపుతావు. గురుప్రసాదంవల్ల, అతీంద్రియ నాదరూపమైన శబ్దం సాయంతో నిన్ను తెలుసుకోవచ్చును.

(మారు)

ఆయన ప్రభువు. పురుషోత్తముడు. ఆయన శాసనానికి తిరుగులేదు.

(మారు)

భగవంతుడు ఆత్మలో ఉన్నాడు. ఆత్మ భగవంతునిలో ఉంది. ఈ విషయం గురుప్రసాదంవల్ల తెలుస్తుంది.

(భైరో. అష్టపది)

దేవుడు ఎవడిలో ఉన్నాడో వాడే ప్రాణం ఉన్నవాడు.

(మజ్ఝ. వార్)

## భగవన్నామం

ప్రభూ ! నీ కున్న పేర్లకన్నిటికీ నేను దాసుణ్ణి.

(బసంత్)

భగవన్నామానికి స్థానమయిన శరీరం పవిత్రమయినది.

(శ్రీరాగ్. 2 : 15)

భగవన్నామం శరణం కాకపోతే, నీ దుఃఖాలు నిన్ను కాల్చి వేస్తాయి.

(శ్రీరాగ్. 3 17)

భగవంతుడు తన్నుతాను సృష్టించుకొన్నాడు. తన నామాన్ని తాను కల్పించుకొన్నాడు.

(అస. వార్)

నోటితో కాకుండా, హృదయంతో స్మరించిన స్మరణే స్మరణ. దాని స్వరూపం తెలిసినవాళ్ల సంఖ్య చాలా తక్కువ.

(మల్హార్)

నామసంకీర్తనం, రేయింబవళ్లు నన్ను మత్తెక్కిస్తోంది.
అగోచరంగా, ఇంద్రియాతీతంగా భగవంతుడి మధురనామం ఉంది.

(మారు)

నా హృదయంలో భగవన్నామం అనే మూలధనం ఉంచాను. నువ్వు దానితో ఎవర్ని కరుణిస్తావో వాడు ముక్తుడు. ఈ ధనాన్ని

అగ్ని కాల్చలేదు, దొంగలు దొంగలించలేరు, జలమయం కాదు. నశించదు.

(మారు)

నా కింకే ధ్యానమార్గం తెలియదు. జ్ఞానంలేదు. ప్రత్యేకమైన దీక్షావస్త్రాలు లేవు. నాకు బుద్ధిని శ్రమపెట్టవలసిన పనిలేదు. నిత్య సత్యమయిన భగవన్నామాన్ని నేను ఆశ్రయించాను.

(బిలవల్)

భగవంతుడు సత్యస్వరూపుడు.

(మారు)

భగవన్నామం ఆక్రమించుకొన్న మనస్సులో ఇతరమయిన వాటికి స్థానంలేదు.

(శ్రీరాగ్)

భగవన్నామంలోనే అన్ని నియమనిష్ఠలు, ధ్యానయోగాలు గర్భితమయి ఉన్నాయి.

(ధనశ్రీ - 4)

కలియుగంలో, భగవన్నామాన్ని మించిన ఉదాత్త విషయం లేదు.

(ధనశ్రీ - 8)

నిష్కళంకమయిన భగవన్నామం సమస్త కల్మషాల్ని, అహంకారదోషాన్ని హరిస్తుంది.

(ధనశ్రీ - 2)

"భగవన్నామం చాలా మధురమైంది. నామం సాయంతో మనస్సుని వశం చేసుకోవచ్చును," అంటాడు నానక్.

(ధనశ్రీ - 2)

సత్యాన్ని, తృప్తిని, సంయమాన్ని నీ స్నేహితుల్నిగా చేసుకో. "గురుప్రసాదం వల్లనే మనుష్యుడు భగవద్భక్తు డవతాడు" అంటాడు నానక్.

(రామ్‌కలీ. సిద్ధగోష్ఠి)

అంతా నామ మహిమ వల్లనే సిద్ధిస్తుంది. నామం వల్లనే జ్ఞానం. సద్గురువు కటాక్షంవల్ల నామం లభిస్తుంది. నామం మోక్షానికి దారి చూపిస్తుంది.

(రామ్‌కలీ. సిద్ధగోష్ఠి)

భగవన్నామానికి ఉన్న మహిమ అపారం. అది అత్యంత శక్తిమంతం అని గురూపదేశం.

(రామ్‌కలీ దఖ్ని ఓంకార్ - 11)

భగవన్నామాన్ని ఆశ్రయించుకొన్నవాడి మనస్సు, చంచలత్వాన్ని విడిచి, సత్యమార్గంలో సుప్రతిష్ఠిత మవుతుంది.

(రామ్‌కలీ సిద్ధగోష్ఠి)

భగవన్నామాన్ని ఆశ్రయించడంవల్ల అహంకారం తొలగిపోతుంది. సత్యమార్గం లభిస్తుంది. యోగనిష్ఠ కుదురుతుంది. మోక్షం సులభమవుతుంది. మూడులోకాల మూలతత్త్వం తెలుస్తుంది. అనంతానందం లభిస్తుంది.

(రామ్‌కలీ సిద్ధగోష్ఠి - 32)

సమస్త కర్మలకు కీలకం నామం. నామాన్ని ఆశ్రయించక పోతే దుఃఖం, మృత్యువు తప్పదు.

(రామ్‌కలీ. సిద్ధగోష్ఠి - 50)

నామమహిమ తెలిసిన యోగికి అణుమాత్రమయినా మాలిన్యం అంటదు.

(మారు)

నా నాలుక తులాదండం, నా హృదయం తక్కెడసిబ్బెలు. దీనితో, తులలేని నామాన్ని తూస్తాను.

(మారు - 11)

అరవై ఎనిమిది పుణ్యతీర్థాల్ని దర్శించిన పుణ్యం ఒక్క నామంలో ఉంది. దీని మహిమవల్ల పాపం పటాపంచలు అవుతుంది. మూఢుడు నీళ్లని చిలికి, దాని సారం తీయాలనుకుంటాడు. కాని, మానవుడు సుకృత దధిని గురూపదేశంతో మథిస్తే నామ మహిమ అనే నవనీతం లభిస్తుంది.

(రాగ్‌మారు. అష్టపదులు)

జీవుడు భగవన్నామాన్ని ఆశ్రయిస్తే, తన సమాజం, తన గృహం, తన ఆహారవిహారాలు అన్నీ సత్యనిష్ఠితా లవుతాయి.

(రాగ్‌మారు. అష్టపదులు)

## గురువు

గురుప్రసాదానికి పాత్రులైన వాళ్లు ఆయన ఎన్నుకొన్న వాళ్లే.

(అస. 4 . 4)

గురూపదేశాన్ని గ్రహించిన నాటినుంచి దైవభీతి కలుగుతుంది.

(శ్రీరాగ్ 4 · 10)

సన్మార్గంలో నడిచేవాళ్లంటే గురువులకు ప్రీతి హెచ్చు.

(శ్రీరాగ్. 4 11)

నిజమైన సద్గురువును మనం కలుసుకున్నప్పుడు, మనకు వివేకమణి లభించింది అన్నమాటే. మనల్ని మనం గురువునకు సమర్పించుకొని, ప్రేమస్వరూపుడైన భగవంతుణ్ణి వశం చేసుకొంటాము. మన పాపాలు క్షాళితములై మనకు ముక్తి లభిస్తుంది.

(శ్రీరాగ్. అష్టపదులు. 1 10)

చాలాసార్లు, నన్ను నేను నా గురువునకు బలిగా సమర్పించుకొంటాను. ఆయన మానవుల్ని దేవతలుగా చేస్తాడు.

(అస. వార్ శ్లోకం)

సద్గురు మహిమవల్ల, సంసారంలో ఉన్నవాడికి కూడా ముక్తి లభిస్తుంది.

(ధనశ్రీ - 4)

గురువు ముత్యాలు ఉన్న సముద్రం. యోగులు హంసలలాగ వాటిని స్వీకరించి గురువునే ఆశ్రయించుకొని ఉంటారు.

(ధనశ్రీ. అష్టపదులు - 1)

గురుదత్తమైన జ్ఞానమే శాశ్వతమైన తీర్థస్థానం. అక్కడే సమస్త పాపాలు క్షాళితములైపోతాయి.

(ధనశ్రీ. ఛంద్ - 1)

గురువుద్వారానే లోచూపు కలుగుతుంది. ఆయన ప్రసాదం వల్లనే, తోమిన పాత్రలాగ, శిష్యుడు ప్రకాశిస్తాడు.

(సుహీ - 6)

సద్గురువు లభించిన వెంటనే సంశయాలన్నీ ఛిన్నమైపోతాయి. మనోవికారం, చిత్తచాంచల్యం తొలగిపోతాయి. అప్పుడు అమృతం స్రవిస్తుంది. నాదానందంలో మనుష్యుడు లీనమైపోయి, తన ఇంట్లోనే పరమాత్మను దర్శించగలడు.

(సుహీ - 8)

గురుప్రసాదంవల్ల నా మనస్సునకు స్వాస్థ్యంవచ్చి, పరమాత్మతో తాదాత్మ్యత సిద్ధించింది.

(బిలవల్)

సద్గురుడి స్మరణవల్ల, స్వపరభేదం తొలగిపోతుంది. దోషాలన్నీ నాశనం అయిపోతాయి. పాపపంకిలమయిన మనస్సు నిర్మలం అవుతుంది. దేహానికి సువర్ణచ్ఛాయ వస్తుంది. ఆత్మ పరమాత్మలో లీనమవుతుంది.

(బిలవల్ - 3)

గురుముఖనాదం, గురుముఖవేదం. దీనిశక్తివల్ల పరమాత్మతో తాదాత్మ్యస్థితి సిద్ధిస్తుంది. దానిలో సమస్త పుణ్యకర్మల ఫలం ఉంటుంది. పరమాత్మ కృపవల్ల ముక్తి లభిస్తుంది.

(రామ్‌కలీ - 10)

మనస్సు గురూపదేశాన్ని శిరసావహించినప్పుడు, అజ్ఞానం పోయి, పరమాత్మలో లీనమైపోతుంది.

(రామ్‌కలీ - 3)

సద్గురువు సత్యవసనాన్ని ధరించి ఉంటాడు. ఎప్పుడూ భగవంతుడిలో లీనమయి ఉంటాడు. అతని నాలుక భగవన్నామాన్ని స్మరిస్తూ ఉంటుంది. గురువు, ప్రపంచం అంతా నిండిఉన్న పరమాత్మని మనచేత దర్శింపజేస్తాడు. పరమాత్మలో అంతా ఉన్నదని రుజువుచేస్తాడు.

(రామ్‌కలీ దక్నీ - 5)

సద్గురు దర్శనంవల్ల అజ్ఞానతిమిరం తొలగిపోతుంది. అహంకారం నశిస్తుంది. అప్పుడు ఆత్మ పరమాత్మలో లీనమవుతుంది.

(రామ్‌కలీ సిద్ధగోష్ఠి - 15)

గురూపదేశాన్ని మననంచేస్తే, శిష్యుడి అజ్ఞానం పోతుంది. గురుదర్శనం కావడంతో శిష్యుడు మోక్షద్వారాన్ని చేరతాడు.

(రామ్‌కలీ. సిద్ధగోష్ఠి - 56)

పరసువేది సోకితే, తుప్పుపట్టిన ఇనుంకూడా బంగారం అవుతుంది. పాపికూడా గురుసంపర్కంవల్ల కృతార్థుడవుతాడు.

(మారు - 3)

సద్గురువు కర్ణధారి. ఆయన ఉపదేశం తెడ్లు. ఈ సాయంతో శిష్యుడు సంసారసాగరాన్ని తరించి, నామరూపాలులేని స్థానాన్ని చేరతాడు. సద్గురువు కటాక్షం ఉన్నవాళ్లకిది తధ్యం. వాళ్లకి జన్మ-పునర్జన్మ లేదు. పరమాత్మలో లీనమయిపోతారు వాళ్లు.

(మారు - 2)

గురువు అమృతసరస్సు. మనం దాని ఒడ్డున ఉన్న హంసలము. భగవన్నామ సంకీర్తనమే నాకున్న వజ్ర వైడూర్యాలు. సంకీర్తనంతో నాదేహం, మనస్సు నిండిపోయి ఉన్నాయి.

(మారు - 8)

గురుప్రభావంకింద ఉన్నవాళ్ల పనులన్నీ సత్యనిష్ఠంగా ఉంటాయి. వాళ్లకి పునర్జన్మ బాధలేదు. మృత్యుభయంలేదు.

(మారు - 12)

నన్ను సన్మార్గంలో నడిపించగలిగిన వాడిని, అనిర్వచనీయాన్ని నాచేత నిర్వచింపచేయగలిగినవాడినీ, నాదంలో లీనమయ్యేటట్లు చేయగలిగినవాడినీ మాత్రమే నా గురువుగా నేను స్వీకరిస్తాను.

(ధనశ్రీ)

పరమాత్మ గురువు రూపంలో శబ్దాన్ని ప్రవచిస్తాడు.

(మల్హార్)

సద్గురువు సత్యస్వరూపాన్ని నేను చూడగలిగేటట్లు చేశాడు. అభవుడైన ఆ పరమాత్మను నా హృదయంలోనే చూడగలిగాను.

(సొరఠా)

సద్గురుడి దయ కల్గినప్పుడే పరమాత్మ దర్శనం మనకు లభిస్తుంది. అనేక జన్మల్లోకూడ ఆయనమాట వినిపిస్తుంది.

(ఆస)

గురుప్రసాదం లేకపోతే మనకు భగవద్భక్తి కలుగదు. మహా పురుషుల సాంగత్యం లభించదు. గురువులేని వ్యక్తి గుడ్డివాడు. గురువువల్లనే చిత్తశాంతి కలుగుతుంది. గురువు సందర్శనంవల్లనే శిష్యుడు తన ఆత్మని తాను సాక్షాత్కరించుకో గలుగుతాడు. భక్తి యోగంలో నిమగ్నుడు అవుతాడు. సంసారదుఃఖాన్ని దూరం చేసుకో గలుగుతాడు. "ఈ విధంగా గురుప్రసాదంవల్ల ఆత్మ సంయమం ప్రాప్తిస్తుంది" అంటాడు నానక్.

(బసంత్ - 6)

గురువును కలుసుకోడంవల్ల బుద్ధి ఉదాత్తస్థితిని పొందుతుంది. మనస్సు నిర్మల మవుతుంది. అహంకారం తొలగిపోతుంది.

(బసంత్ - 2)

ఒక్కణ్ణి అందరితో కలపగలిగినవాడే సద్గురువు.

(శ్రీరాగ్)

## మంచి చెడ్డలు

భగవంతుడి విచారణలో మంచివాడుగా తేలినవాడే మంచి వాడు.

(శ్రీరాగ్. 4 . 4)

మనస్సుని పాపంతోను, దేహాన్ని బాధతోను నింపే ఆహారం, విహారం చెడ్డవి.

(శ్రీరాగ్. 2 7)

భగవంతుడి అవలంబనం దొరికినవెంటనే నాచెడ్డదనం మంచి తనంగా మారిపోయింది.

(శ్రీరాగ్ - 11)

పొలాన్ని బాగా దున్నిన తరవాతనే విత్తనాలు జల్లాలని బుద్ధి మంతుడైన ప్రతి కర్షకుడికీ తెలుసును.

(శ్రీరాగ్. 2 13)

అహంకార పూరితుడయిన వాడికి చిత్తశాంతిలేదు. భగవద్భక్తు డికి శాంతి ఉంది. పరాత్పరుడి సృష్టివైచిత్ర్యం భక్తుణ్ణి ఆశ్చర్య చకితుణ్ణి చేస్తుంది.

(శ్రీరాగ్. 3 . 19)

మనదృష్టి భగవంతుడివైపు ఉండి, మన మనస్సు సద్గురువు మనస్సుతో ముడిపడిఉంటే, అహంకారం తొలగిపోతుంది. చిత్త చాంచల్యం దూరమవుతుంది, సర్వసంశయాలు సమసిపోతాయి.

(శ్రీరాగ్. 2 . 20)

మంచిపనుల పొలంలో, భగన్నామబీజాన్నిచల్లి, సత్యమార్గ మనే నీళ్లతో తడిపినట్లైతే, విశ్వాసం అభివృద్ధి పొందుతుంది. దానివల్ల స్వర్గనరకాల నిజస్వరూపం తెలుస్తుంది.

(శ్రీరాగ్. 1 : 27)

పాపపంకం నీ కంటుతుంది; పద్మం (భగవంతుడు) తో కలిసి ఉన్నా, ఆ సంగతి తెలుసుకోలేని కప్పలాగ ఉంది నీబ్రతుకు. తుమ్మెద మధురమయిన ప్రేమతత్త్వాన్ని నీకు నేర్పుతోంది; కాని, నువ్వది గ్రహించలేక పోతున్నావు.

(శ్రీరాగ్. 2 : 27)

మంచి పనులున్నచోటే, మంచి మనస్సూ ఉంది.

(శ్రీరాగ్ 2 : 32)

మనం భగవంతుడు పెంచే మొక్కలం. ఈ ప్రపంచం ఆయన తోట. పండ్లనిచూచి, చెట్లకి పేర్లు పెడతాడాయన.

(శ్రీరాగ్. 2 : 32)

అమ్మా, సత్ప్రవర్తన లేనిచోట సుఖంలేదు.

(శ్రీరాగ్. అష్టపది. 2 . 5)

ప్రభూ, నువ్వు ప్రేమించేవాళ్లందరూ మంచివాళ్లు.

(శ్రీరాగ్. అష్టపది. 3 · 11)

విశ్వాసం, తృప్తి అనేవి దేవతల ఆహారం.

(శ్రీరాగ్. వార్. శ్లోకం)

హృదయంలో ఉన్న వాంఛలు చిట్టి తాళాలులాగ, గజ్జెలులాగ ధ్వనిచేస్తున్నాయి. వాటితోబాటు ప్రపంచం మద్దెలలాగ మోగుతోంది. కలికాలానికి అనుగుణంగా మనస్సు ఆడుతోంది. అయ్యో, విరాగులయిన పురుషులికి స్థానం ఎక్కడుంది?

(అస 1 4)

ప్రతివాడి లోవెలుగు చూడండి. కులం అడగకండి. ఇంక దానికి ప్రాముఖ్యం పోయింది.

(అస. 2 3)

మంచి కోరినవాడు, మంచి చెయ్యా లనుకొనేవాడు, వినయంగా ఉండాలి.

(అస. వార్. పౌరి - 5)

సత్ప్రివర్తనగల వాళ్లు, దానికి ప్రతిఫలంగా మోక్షం కోరితే, దాని ఫలితం ఉండదు.

(అస. వార్. పౌరి - 5)

మన మనస్సుల అల్పత్వంచేత, మనం సేవాఫలాన్ని కూడా దక్కించుకోలేక పోతున్నాము.

(అస. వార్)

ఎవళ్లనీ చెడ్డవా ళ్లనవద్దు. ఇదే జ్ఞానం అంటే. బుద్ధిహీనుడితో ఎప్పుడూ వాదించవద్దు.

(అస వార్)

నానక్: వాక్పారుష్యం పనికిరాదు. అది ఉంటే మనస్సు, దేహం కూడా చెడిపోతాయి. భగవంతుడి సన్నిధానంలో వాక్పా

రుష్యం ఉన్నవాడికి స్థానం లేదు. వాడి ముఖంమీద అందరూ ఉమ్మివేస్తారు.

(అస. వార్)

ఎవళ్లు నిజంగా ప్రేమించేవాళ్లు? తమ ప్రేమలో మునిగి తేలే వాళ్లే నిజమైన ప్రేమికులు. తనకి మంచి జరిగితే మంచిగా ఉండి, చెడ్డ జరిగితే చెడ్డగా ఉండేవాడు ప్రేమికుడా? కాడు. ప్రేమని వ్యాపార పద్ధతికి దిగజార్చిన వా డతను.

(అస వార్)

ఓ వైపునుంచి నమస్కారాలు చేస్తూ ఇంకో వైపునుంచి గోతులు తీసేవాడు సమూలం నాశనం అవుతాడు. భగవంతుడికి వాడు నిలకడ లేనివాడని తెలుసును.

(అస. వార్)

బుద్ధిహీనుల స్నేహం, అహంభావం కల వాళ్ల ప్రేమ, నీటి మీద గీతల్లాంటివి. నిలవవు. కనబడవు.

(అస. వార్)

పరదూషణ వినే చెవులు చెడ్డవి. ఇతరుల వస్తువుల్ని కాజేసే చేతులు పాపపుచేతులు. పరస్త్రీల సౌందర్యాన్ని అనుభవించే కళ్లు చెడ్డవి. భగవన్నామాన్ని కాక ఇతరాన్ని రుచి చూచే నాలుక చెడ్డది. ఇతరాన్ని కాంక్షించే మనస్సు చెడ్డది; ఇతరులికి సాయం చెయ్యని శరీరం చెడ్డది. చెడ్డనుంచి వచ్చేది దుర్వాసనే.

(అస. వార్)

కేవలం పొట్టకోసమే జీవించడం దుర్భరం.

(రాగ్. సుహీ. వార్. శ్లోకం)

నీచుడు కాకిలాంటి వాడు. వాడికి నామరూపాలు ఉండవు. పంజరంలోని పిట్ట; లోపల నాట్యం చేసినా దానికి విముక్తి లేదు.

(బిలవాల్. అష్టి)

ఆశ, మమకారాలు ఉన్నవాడు, స్త్రీవాంఛ ఉన్నవాడు, ఇహ పరాలికి రెండింటికీ దూరం అవుతాడు.

(రామ్‌కలీ - 2)

కామక్రోధాలు రెండు పంటలు. మన మనఃక్షేత్రాన్ని దురాశ అనే నీటితో తడుపుతాము, మాయాబీజాల్ని దానిలో జల్లుతాము. మన వాంఛలే ఆ క్షేత్రాన్ని దున్నుతాయి. పాపపు పంట పండు తుంది. భగవంతుడి ఆజ్ఞానుసారం ఇదంతా జరుగుతుంది. చిట్ట చివరికి మనస్సు ఊషరక్షేత్రం అవుతుంది.

(శ్లోకం - ప్రథమ గురువు, రామ్‌కలీలోని వార్ - తృతీయ గురువు)

ప్రేమ క్షేత్రం; పవిత్రత నీళ్లు; సత్యసంతృప్తులు రెండూ ఎడ్లు; వినయం నాగలి; చైతన్యం దున్నేవాడు; భగవచ్చింత ఎరువు; భగవన్నామం పొలంలో జల్లే బీజాలు; ఆయన కృప పంట. దీని ముందు, ఓ నానక్ మిగిలిన ప్రపంచం అంతా మాయ! భక్తుడి కర్మ ఈవిధంగా ఉంటే అతనికి భగవంతుడితో ఎడబాటు ఉండదు.

(శ్లోకం - ప్రథమ గురువు. రామ్‌కలీలోని వార్ - తృతీయ గురువు)

భగవంతుడి ఆజ్ఞను ఉల్లంఘిస్తే, ప్రేమసూత్రం తెగిపోతుంది. చేతిని వెనక్కి తిప్పితే అది విరుగుతుంది. వాక్పారుష్యం ఉంటే కూడా ప్రేమ విరుగుతుంది. భగవంతుడు పాప వధువుని స్వీకరించడు.

(రామ్‌కలీ. దక్నీ. ఓంకార్ - 28)

వాంఛ అనే సిరాతో మనస్సు, మన పనులనే పుస్తకం వ్రాస్తుంది. వ్రాత, మంచిచెడ్డలనే రెండు విధాలుగా ఉంటుంది. కర్మానుసారం మనం నడుస్తాము. కాని, భగవత్కృపవల్ల మనస్సుని జయించి, మనం బాగుపడతాము.

(మారు)

దురాశ కుక్క; అనృతం తుడిచేవాడు, మోసం శవభక్షణం; పరదూషణ నా నాలుక రుచిచూచే వస్తువు. నాకోపమే నన్ను దహించే నీచుడు.

(శ్రీరాగ్. 4 . 4)

భగవంతుడి కృపకు పాత్రులైన వాళ్ల దురాశ పోతుంది. వాళ్లకు మమకారం తొలగిపోతుంది. అరిషడ్వర్గాలు నశిస్తాయి. మాయ పోతుంది.

(శిరాగ్ 3 14)

పాపపంకిలుడు అయిన వ్యక్తికి భగవంతుడి సభలో స్థానం లేదు.

(ధనశ్రీ - 5)

ఇనుము మళ్ళీ మళ్ళీ కరిగి మూసలో పోతపడ్డట్లే, దుర్మార్గుడు మళ్ళీ మళ్ళీ జన్మలు ఎత్తుతూ ఉంటాడు.

(సుహీ - 4)

## సుఖదుఃఖాలు

దుఃఖం మందు, సుఖం రోగం. ప్రభూ, సుఖం ఉంటే నువ్వు లేవు.

(అస. వార్ శ్లోకం)

భగవంతుడి ఇచ్ఛానుసారం నడుస్తూ, సుఖదుఃఖాల్ని సమానంగా చూచే వాడే జ్ఞాని.

(అస. వార్ శ్లోకం - 5)

భక్తుడు భగవంతుడి ముందు నిలబడి విలపిస్తే ఆయన వింటాడు. విని, మంచిచేసినా, చెడ్డచేసినా, మనం మాత్రం ఆయన ఘనతని కీర్తిస్తూనే ఉండాలి.

(అస. 1 3)

స్వచ్ఛమైన నీళ్లనుంచే పద్మం పైకి వస్తుంది. అక్కడ అడుగున బురదకూడా ఉంటుంది. పద్మం నీళ్లనిగాని బురదనిగాని లెక్కపెట్టకుండా జీవిస్తుంది. కప్ప మాత్రం బురదని తింటుంది. అది తుమ్మెదలాగ పద్మసౌరభాన్ని గ్రహించలేదు. తియ్యటి పాలని సహించలేక, పేను రక్తాన్ని మాత్రమే తాగుతుంది.

(మారు)

మనం ఎన్నో సుఖాలు అనుభవిస్తాము. కాని, అవన్నీ పోతాయి. శరీరం మట్టిలో కలిసిపోతుంది. భగవన్నామం లేకపోతే పాప పంకిలమయిన మనస్సు శుభ్రపడదు.

(బిలవల్)

గురుప్రసాదంవల్ల సుఖదుఃఖాల్ని సమానంగా చూచేవాడికి మృత్యుభయం లేదు.

(రామ్‌కలీ సిద్ధగోష్ఠి - 61)

వియోగదుఃఖం ఉంది. క్షుత్పిపాసలదుఃఖం ఉంది. మృత్యువు ఉంది. ప్రభూ, భిషగ్వరా, నువ్వు వీటిలో దేన్ని కుదురుస్తావు? భగవంతుణ్ణి మరిచిపోయి సుఖాలలో మునిగి తేలి దుఃఖం అనుభవిస్తాడు మనుష్యుడు. కాని, చావుపుట్టుకలు లేని ఆత్మహంస మనలో సంచరిస్తోంది. దానిలో భగవన్నామం నిక్షిప్తమై ఉంది. సర్వగుణాల పిండితార్థం అది. దాని దయవల్లనే మనుష్యుడికి జరామరణాదులు పోయి అమరత్వం సిద్ధిస్తోంది.

(మల్హార్)

నానక్ : ప్రపంచమంతా దుఃఖమయం.

(రామ్‌కలీ వార్)

భగవంతుణ్ణి మరచిపోయి, ఐహిక సుఖాలలో ఓలలాడే వాడికే దుఃఖం అంతా.

(మల్హార్)

# సన్మార్గ సాధన

సత్యమే జయిస్తుంది. అదే మనల్ని రక్షిస్తుంది.

(అస 4 2)

స్త్రీలాగ మనదేహాన్ని మనం మనప్రభువుకి అర్పిస్తే, ఆయన అనుభవిస్తాడు.

(శ్రీరాగ్. 3 20)

దేహం క్షేత్రం. మనకర్మలు బీజాలు. జగత్పతి చేతులో ఉన్న ఈ ప్రపంచంలో, భగవన్నామం అనే నీళ్లతో ఆ క్షేత్రాన్ని తడపాలి. మనస్సు కర్షకుడు. మనభక్తి మొలక ఎత్తినప్పుడు మనకి నిర్వాణసుఖం లభిస్తుంది.

(శ్రీరాగ్. 1 . 26)

భగవంతుడి ఆజ్ఞానుసారం జీవించేవాడికి మాయ అంటే భయంలేదు. అది అతన్ని ఏమీ చెయ్యలేదు. అహంకారం అనే బాకు అతన్ని బాధించలేదు.

(శ్రీరాగ్. 1 · 33)

ధర్మగ్రంథాలలోంచి సేకరించిన విజ్ఞాన తైలంతో మనస్సులో దీపాన్ని వెలిగించు. దైవభీతి అనే వత్తిని సత్యజ్యోతితో వెలిగించు. అప్పుడు నీకు, ప్రభువు దర్శనం ఇస్తాడు.

(శ్రీరాగ్. 2 33)

ప్రపంచంలో మానవసేవ చెయ్యి. నీకు తప్పకుండా భగవంతుడి సభలో స్థానం ఉంటుంది.

(శ్రీరాగ్)

గురూపదేశం వధువు ధరించే ఆభరణం. అలంకరించుకొని ఆమె, భగవంతుడి వశం అవుతుంది. చేతులు జోడించుకొని ఆమె ఆయనముందు నిలిచి ఉంటుంది. ప్రార్థిస్తుంది. కల్యాణాంబరాలతో అలంకరించుకొని ఆమె ఆయన్ని భయభక్తులతో సేవిస్తుంది.

(శ్రీరాగ్ అష్టపది. 2 2)

నిర్భయంగా ప్రియుడి పరిష్వంగంలో పవ్వళించే స్త్రీయే నిజమైన వధువు.

(శ్రీరాగ్. అష్టపది. 8 2)

నాకంటె అందరూ భక్తిగలవాళ్లే. అందం ఉన్నవాళ్లే. కాని, నేనుమాత్రం గురూపదేశాన్ని స్వీకరించి నిశ్చలంగా ప్రభువుని ప్రేమిస్తున్నాను. ఆయన నన్ను విసర్జించరు.

(శ్రీరాగ్ అష్టపది 8 6)

మన ప్రభువు మనల్ని గీటురాయిమీద పరీక్షిస్తాడు.

(శ్రీరాగ్ అష్టపది 4 7)

జ్ఞానాంజనం సమస్త భయాల్ని పోగొట్టుతుంది. అప్పుడు నిరంజనుడు సాక్షాత్కరిస్తాడు.

(శ్రీరాగ్. అష్టపది 3 7)

నేను వెదికి వెదికి నా ప్రభువుని కలుసుకొన్నాను. భయభక్తులతో ఆయన్ని చేరాను

(శ్రీరాగ్. అష్టపది. 8 7)

"అయ్యా, నాకు సాధనామార్గం చూపించండి" అని నా గురువుని ప్రార్థించాను. "భగవన్నామాన్ని ఎప్పుడూ మనస్సులో

ఉంచుకో, అహంకారాన్ని అణచుకో. బ్రహ్మానందంలో ఆయన పొందు నీకు లభిస్తుంది'' అన్నారు గురువులు.

(శ్రీరాగ్. అష్టపది. 4 . 8)

ప్రేమతో కూడిన భగవద్భక్తి లేకపోతే దేహం నిర్మలం కాదు.

(శ్రీరాగ్. అష్టపది. 8 9)

కర్మకాండకంటె పై మెట్టులో ఉండే భక్తుడు అదృష్టవంతుడు. పరాత్పరుడికి సమస్తం తెలుసును.

(శ్రీరాగ్)

అహంకారాన్ని నాశనంచెయ్యండి అనేదే ఆరు శాస్త్రాలలోని సారం. సర్వవ్యాపి అయిన పరాత్పరుడి తేజస్సు అన్నిచోట్లా ఉంది.

(అస. 2 11)

భక్తుడు పద్మంలాగ నిర్మలంగా ఉంటాడు. పద్మం వేళ్లు బురదలో ఉన్నా, నీటిపైకివచ్చి అది సుగంధాన్ని వెదజల్లుతుంది.

(అస. 2 15)

నువ్వే మా దేహాత్మలైనప్పుడు, పోషణకోసం వేరే నిన్ను ప్రార్థించడం శుష్క ప్రలాపం.

(అస. వార్ పౌరి - 5)

మన మనస్సుల్ని నిర్మలంగా చేసుకొని భగవంతుణ్ణి సమీపిస్తే, మనకి సత్యస్వరూపం గోచరిస్తుంది.

(అస. వార్)

మనం సత్యాన్ని ప్రేమిస్తే మనకు దానిస్వరూపం అర్థ మవు తుంది.

(అస. వార్)

మనకు సాధనామార్గం తెలిసి, మన దేహక్షేత్రాన్ని బాగుచేసి, దానిలో భగవన్నామమనే బీజాన్ని చల్లినప్పుడు, మనకు సత్య స్వరూపం తెలుస్తుంది.

(అస. వార్)

గురూపదేశాన్ని పాటించి, ప్రాణికోటిని ప్రేమించి, దానాన్ని చేసినప్పుడే మనకు సత్యస్వరూపం తెలుస్తుంది.

(అస. వార్)

దేహవస్త్రాన్ని వినయంతో ఉతికి, భక్తితో తడిపి ఉంచినప్పుడే, భగవద్వర్ణం దానికి బాగా పట్టుతుంది.

(అస. వార్)

భగవద్భక్తిని కాటుకగా పెట్టుకొని, భక్తితో అలంకరించుకొని ఉన్నప్పుడే నీకు ఆయన లభిస్తాడు.

(తిలాంగ్ - 4)

నువ్వువెళ్లి ఆయన భక్తుల్ని అడుగు. ఆ ప్రభువుకు నాయిక లైన వాళ్లిలా అంటారు: "ఆయన ఇష్టానుసారం మేము నడుచు కొంటాము. మా హృదయాల్ని దేహాల్ని ఆయన అధీనంచేస్తాము. ఆయన పొందువల్ల మాకు పరిమళం వస్తుంది. ఇదేమార్గం చెల్లాయీ".

(తిలాంగ్ - 4)

ఎరుక కవ్వం. మనస్సు తాళ్లు. భగవన్నామ సంకీర్తనం చిలకడం. అప్పుడే నవనీతం నీకు లభిస్తుంది. నీ జీవితం నైవేద్యంగా సమర్పించుకో; ఆయన నీవా డవతాడు.

(సుహీ - 1)

సంయమం, ధ్యానం అనేవాటితో నావ నిర్మించుకో. ఏ కష్టం, ఏ అడ్డం లేకుండా సంసార సాగరాన్ని తరిస్తావు. ఇది చాలా సులభమార్గం.

(సుహీ - 4)

యోగులది జ్ఞానమార్గం. బ్రాహ్మణులది వేదచోదితమైన కర్మమార్గం. క్షత్రియులది వీరమార్గం. శూద్రులది సేవామార్గం. కాని, అన్నింటికంటె సులభమార్గం నామసంకీర్తనా మార్గం. శబ్దం రహస్యాన్ని తెలుసుకొన్నవాడికి నానక్ బానిస. శబ్దరహస్యవేది సాక్షాత్తూ భగవంతుడే!

(అస. వార్. శ్లోకం - 2)

దయ పత్తి, తృప్తి దారం, సంయమం ముడి, సత్యం పురి. ఇదే ఆత్మయొక్క యజ్ఞోపవీతం. ఇది తెగదు. మాయదు. కాలదు.

(అస వార్ శ్లోకం)

అష్టసిద్ధుల్ని సాధించిన మనస్సును స్వాధీనం చేసుకొని, నిస్సంగుడై, భగవంతుడి పనులు నెరవేరుస్తూ, అరిషడ్వర్గాల్ని జయించిననాడు భక్తుడు భగవత్సాక్షాత్కారాన్ని పొందుతాడు.

(బిలవల్. తిథి)

జ్ఞానాంజనం సమస్త భయాల్ని దూరంచేస్తుంది అప్పుడు నిరం జనుడు సాక్షాత్కరిస్తాడు. స్థూల సూక్ష్మవస్తుజాతమంతా దృగ్గో చరమవుతుంది. అయితే, భక్తుడి మనస్సుమాత్రం తగిన స్థలంలో ఉండాలి.

(శ్రీరాగ్ - 7)

సద్గురువు లభిస్తే సంశయాలన్నీ ఛిన్నాభిన్నా లయిపోతాయి. మనోవైకల్యం తొలగిపోతుంది. ఆనందం లభిస్తుంది. అప్పుడు, ప్రతివాడికీ వాడిఇంట్లోనే పరమపురుషుడు దొరుకుతాడు.

(సహీ)

భగవన్నామాన్ని నమ్ముకొని, సత్యాన్ని ఆశ్రయించుకొని ఉంటే, మనస్సు కుదుటబడుతుంది. దాని చాంచల్యం పోతుంది. అప్పుడు సృష్టికర్త మనల్ని తనలో చేర్చుకొంటాడు.

(రామ్‌కలీ సిద్ధగోష్ఠి)

నా దేహం నిస్సంగుడైన సన్యాసివేషం ధరిస్తుంది. నామనస్సే మందిరం. నాహృదయ సరస్సులో నేను స్నానం చేస్తాను. భగవ న్నామమే నాకు రక్ష. ఇంక, నాకు పునర్జన్మ అనేది లేదు

(బిలవల్ - 2)

నీలో ఉన్న వాంఛాగ్నిని చల్లార్చు. అప్పుడు జ్ఞానజ్యోతి ప్రకా శిస్తుంది. దాని సాయంతో నువ్వు సంసార సాగరాన్ని తరించ గలవు.

(రామ్‌కలీ - 7)

సత్యమార్గాన్ని అనుష్ఠించు. మిగిలిన మార్గాలన్నీ ఎందుకూ పనికిరానివి. నీ మనస్సును ఆ పరాత్పరుడియందే లగ్నంచెయ్యి. నీ నాలుకతో ఆ సత్యాన్ని గురించే గానంచెయ్యి. ప్రభువు నామామృతాన్ని నాలుక చవిచూచిన తరువాత. మిగిలినవన్నీ ఎందుకూ పనికిరాని చప్పిడివి అయిపోతాయి. భక్తిలోనివాళ్లు పాపభారం మోస్తారు.

(మారు - 4)

తన్నుతాను తెలుసుకొన్ననాడు భగవంతుణ్ణి తెలుసుకొనగలుగుతాడు.

(మారు - 5)

కామాన్నుంచి తప్పించుకొని తటస్థంగా ఉండగలిగినవాడు, గురుప్రసాదంవల్ల భగవంతుణ్ణి నిర్భయంగా దర్శించ గలుగుతాడు.

(మారు - 20)

నిష్కామకర్మ వృక్షమూలం. భగవన్నామం శాఖలు. ధర్మం పువ్వులు. జ్ఞానం ఫలం. ప్రభువు శక్తిని నువ్వు కళ్లారా చూడు. ఆయన మాటని చెవులార విను. నోరార ఆయన నామాన్ని జపించు. ఈ విధంగా చేస్తే, ప్రశాంతంగా భగవంతుణ్ణి దర్శించ గలవు.

(రాగ్. బసంత్. చౌపదులు)

నీజుట్టు యముడిచేతుల్లో ఉంది. నువ్వు గ్రహించలేక పోతున్నావు.

(తిలాంగ్ - 1)

నా భార్య, కొడుకు, తండ్రి, సోదరుడు ఎవళ్లూ నాతో రాలేరు. ప్రాణప్రయాణ సమయంలో ఎవళ్లూ రక్షించలేరు నన్ను.

(రాగ్. తిలాంగ్ - 1)

గురూపదేశాన్ని పొంది, సత్యాన్ని గ్రహించి సత్ప్రవర్తనతో జీవించేవాళ్లు భగవదనుగ్రహంవల్ల పునర్జన్మనుంచి విముక్తి పొందుతారు.

(శ్రీరాగ్. 4 70)

భగవంతుడు నాయకుడయినప్పుడు, నాయికకు వియోగ దుఃఖం లేదు.

(శ్రీరాగ్. అష్టపదులు. 5 : 2)

అహంకార విమూఢాత్ముడు జన్మ మృత్యువు లనే చక్రంలో పడిపోతాడు. భగవద్భక్తుడు అజరామరుడు.

(రామ్‌కలీ. సిద్ధగోష్ఠి)

పరాత్పరుడి ఆదేశానుసారం మనుష్యుడు వస్తాడు, పోతాడు.

(రామ్‌కలీ సిద్ధగోష్ఠి)

గురుప్రసాదం ఉన్నవాళ్లు చావుపుట్టుకలు లేకుండా ఉంటారు. సృష్టికర్త పోలికే వాళ్లకి వస్తుంది.

(రామ్‌కలీ. సిద్ధగోష్ఠి)

గురుకృపవల్ల సుఖదుఃఖాల్ని సమానంగా చూడగలిగిన వాళ్లు మృత్యుముఖం చూడరు.

(రామ్‌కలీ. సిద్ధగోష్ఠి)

జీవితనౌకని పాపంతో నింపి, సంసారసాగరంలో విడి స్తే, దారితెన్నులు లేక అది కొట్టుకొని పోతుంది. ఒడ్డు దొరకదు. సముద్రం భయంకరంగా ఉంటుంది. నావికుడు లేడు, తెడ్లు వేసే వాళ్లు కూడా లేరు.

(మారు - 2)

దేహం మట్టి. ప్రాణం గాలి. మట్టి మట్టిలో కలిసిపోయి, గాలి గాలిలో కలిసిపోయినప్పుడు, ఇంక మిగిలేది ఏమిటి? అహంకార మమకారాలు పోతాయి. పోక, మిగిలేది ఆత్మ. అది సాక్షి.

(గౌరి)

## అనాహత నాదం

నువ్వు వినదల్చుకొన్న అనాహత నాదం గురుప్రసాదం వల్ల లభి స్తుంది.

(శ్రీరాగ్ 2 18)

నాదరూపుడై న పరాత్పరుడు అనాహత నాదమందే లీనమై ఉన్నాడు.

(అస. 4 8)

గురూపదేశాన్ని మనస్సులో ఉంచుకొని ఏకాగ్రత సాధించిన వాడికి, అనాహత నాదం వినబడుతుంది.

(శ్రీరాగ్)

జననమరణాలు లేకుండా చేసే ప్రభూ, నిన్ను ప్రార్థించడం ఎలాగ? అనాహత నాదం నీ గొప్పదనాన్ని ప్రతిక్షణం నాలో గానం చేస్తోంది.

(ధనశ్రీ ఆరతి)

నా సంశయాలు, నా భయాలు-అనాహత నాదం వినిపించడం వల్ల - పటాపంచ లయ్యాయి.

(మారు)

మనస్సు నిశ్చలంగా ఉంది. వాయుప్రసారం ఆగిపోయింది. యోగి మనస్సు అనాహత నాదంలో లీనమయి ఉంది. పంచతన్మాత్రలు సాక్షీభూతంగా ఉన్నాయి. అనాహత నాదాన్ని భగవంతుడే ధ్వనింపజేస్తున్నాడు.

(మారు)

కామ, క్రోధ, లోభాదులను జయించి, జ్ఞానాసితో అహంకారాన్ని కోసి పారవేసినప్పుడే వాంఛాలతలు నశిస్తాయి

(మారు)

అహర్నిశం అనాహత నాదం వినిపిస్తే, గురుప్రసాదం వల్ల అభవుడైన నిరంజనుడి దర్శనం లభిస్తుంది.

(రామ్‌కలీ)

అనాహత నాదానుభవం ఉన్నవాడి సర్వసంశయాలు, భయాలు సమసిపోతాయి.

(మారు. దఖ్ని)

తురీయావస్థలో అనాహత నాదం విను. నీకప్పుడే శబ్దబ్రహ్మ సాక్షాత్కారం అవుతుంది. మనస్సు నివాత నిష్కంప దీపంలా నిలిచి ఉంటుంది.

(మల్హార్)

ప్రేమించని వాళ్లకి భగవన్నామ రుచి తెలియదు శూన్య గృహంలో అతిధిగా ఉన్నవాడికి శూన్యమే లభిస్తుంది.

(ప్రథమ గురువు శ్లోకం, తృతీయ గురువు రాగ్ సుహీలో వ్రాసిన వార్)

ప్రేమ అనే గూటిలో మనస్సనే చిలక కూర్చుని ప్రేమ వాక్యాలు పలుకుతుంది. సత్యాన్ని కొరికి తింటుంది; అమృత పానం చేస్తుంది. అది ఒక్కసారి ఎగిరిపోతే మళ్లీ తిరిగి రాదు.

(మారు - 2)

ఒకే భక్తి, ఒకే ప్రేమ. భగవంతుడంటే భయభక్తులు లేనప్పుడు - ప్రేమ అనేది కేవలం మిథ్య.

(బసంత్ - 3)

## సత్సంగతి

సత్సాంగత్యం వల్ల కామధేనువు వంటి గురువు లభిస్తాడు. ఆయన కృపవల్ల మోక్షం సిద్ధిస్తుంది.

(శ్రీరాగ్. 2 : 12)

నీ నామం జపించే చోటే, సజ్జను లుండే చోటు.

(శ్రీరాగ్)

సత్పురుషుల సాంగత్యంవల్ల ధర్మమార్గగామి అయితే పుణ్యం వస్తుంది. చిత్తశాంతి కలుగుతుంది. పరసువేది ఇనుమును బంగారం చేసినట్లు, సత్పురుషుల పాదధూళి మనస్సుని పవిత్రం చేస్తుంది.

(రామ్‌కలీ దఖ్ని. ఓంకార్ - 3)

## మహాపురుషులు

మనం ఎక్కడికి పోతే అక్కడికే వచ్చి మన పక్కని అండగా నిలిచేవాళ్లే మహాపురుషులు.

(సుహీ)

అవతారపురుషుడు తనకి తోచినప్పుడు తాను అవతరిస్తాడు.

(రామ్‌కలీ)

## సృష్టిక్రమం

పరాత్పరుడినుంచి వాయువు, వాయువునుంచి జలం, జలంనుంచి ముల్లోకాలు వచ్చాయి. వాటిని ఆయన తన కాంతితో నింపి వేశాడు.

(శ్రీరాగ్)

## నిస్సంగత్వం

భగవంతుడిమీద మనస్సు ఉన్నవాడు, పద్మం నీటిలోను, హంస నీటిమీద, తటస్థంగా ఉన్నట్లు - ఈ సంసార సాగరంలో తటస్థంగా ఉండి తరిస్తాడు. పరాత్పరుణ్ణి మనస్సులో స్థాపించుకొని నిస్సంగుడై, నిరాశల మధ్య ఆశతో జీవించేవాడికి, చూడలేని దానిని చూడగలిగిన వాడికి, నానక్ బానిస.

(రామ్‌కలీ - సిద్ధగోష్ఠి - 5)

## దుస్సంగతి

దొంగలు, వ్యభిచారిణులు, తార్పుడుగాళ్లు కలిసి ఉంటారు. అధర్మవర్తనులు ఒక కంచంలో తిని, ఒక మంచంలో పడుకొంటారు. వాళ్లలో పాపం ఉండడంవల్ల వాళ్లకి భగవన్నామ మహిమ తెలియదు. గాడిదకి గంధం పూసినా, అది బూడిదలో పొర్లడం మానదు.

(ప్రథమ గురువు శ్లోకం; తృతీయ గురువు సుహీ రాగంలోని వార్)

## ఆచారాలు - కర్మకాండ

ధర్మగ్రంథాలు చదువుతారు. ప్రార్థనలు చేస్తారు. కాని దెబ్బలాడుకొంటారు. రాళ్లని రప్పల్ని పూజిస్తారు. కొంగజపాలు చేస్తారు. దేహంమీద ధార్మిక చిహ్నాల్ని ధరిస్తారు. గాయత్రిని

జపిస్తారు. కాని నోటివెంట ఎప్పుడూ అసత్యమే పలుకుతారు. వాళ్లకి మెళ్లో రుద్రాక్షమాల, ముఖంమీద జేగురురంగు బొట్టు, ఒంటిమీద కుట్టులేని బట్ట, తలకి గుడ్డకట్టు, భగవంతుడి సత్య స్వరూపం వాళ్లకి తెలిసిఉంటే, ఈ ఆచారాలు - కర్మకాండ అంతా అసత్యం అని గ్రహించరూ ?

(పైవాటినుంచే)

భగవన్నామమే యజ్ఞోపవీతం.

(పైవాటినుంచే)

మనుష్యుల్ని చంపుకొని తినేవాళ్లు ఐదుసార్లు ప్రార్థనలు చేస్తారు! మెళ్లో యజ్ఞోపవీతం, చేతిలో కత్తి! ముఖంమీద జేగురు రంగు బొట్టు, ఒంటిమీద కుట్టులేని బట్ట. చేతిలో కత్తి! ఇదీ వాళ్ల వేషం! వీళ్లే నిజమైన కసాయివాళ్లు!

(పైవాటినుంచే)

''లోపల ఒకటి, బైట ఒకటి'' గా జీవించేవాళ్లు, అరవై ఎని మిది పుణ్యతీర్థాల్లో స్నానంచేసినా కల్మషం పోదు. గుడ్డపీలికలు కట్టుకొన్నా, గుండె మెత్తగా ఉన్నవాళ్లే నిజంగా గొప్పవాళ్లు. భగవంతుడు ఏదిఇస్తే అదే తీసుకొని, ఆయన దర్శనంకోసం పడగాపులు పడి ఉండేవాళ్లే వాళ్లు

(పైవాటినుంచే)

మనం బ్రతికి ఉన్నంతకాలం ధార్మికగ్రంథాలు చదువుతూనే ఉంటాము, కాని భగవంతుడికి కావలసినది ఒక్కటే - మంచి మనస్సు. మిగిలినవన్నీ ఊకదంపుడు వాగుడు.

(అస. వార్)

హఠయోగంద్వారా కామాన్ని అరికట్టడానికి చేసే ప్రయత్నాల వల్ల శరీరం కృశిస్తుంది. అంతే. ఉపవాసాలవల్ల, కఠోర దీక్షలవల్ల మనస్సు స్వాధీనం కాదు.

(రామ్‌కలీ - 5)

పుణ్యతీర్థాల పర్యటనంవల్ల చిత్తచాంచల్యం, మనోమాలిన్యం పోవు.

(రామ్‌కలీ - 6)

బట్టలికి జేగురురంగు వేసుకొని, పరివ్రాజకుడివేషం ధరించి, తోలుసంచీ పట్టుకొని తిరుగుతే ఏమిలాభం? ఇంటింటికి పోయి, గడప గడప ఎక్కి పైసలు వసూలుచేసుకోడానికే ఆ సంచీని ఉపయోగిస్తూ, ఇతురులికి జ్ఞానోపదేశాలు చేస్తూ, తిరుగుతే ఆత్మవంచన కాదూ? సంశయాలు బాధిస్తూంటే, భగవన్నామాన్ని గ్రహించక తిరిగే, ఆ సన్యాసి జీవితం వ్యర్థంకాదూ?

(మారు - 7)

## అహంకారం

తన అహంకారాన్ని తాను గుర్తించ గలిగిననాడు మనుష్యుడికి మోక్షద్వారం తెరుచుకొంటుంది.

(మారు. శ్లోకం)

దురాశా దురహంకారాలతో వధువు మాయలోపడి ఉంది. ఈ పరిస్థితుల్లో ఆమెకు ప్రభువు లభించడు.

(తిలంగ్ - 4)

దురహంకారంగలవాళ్లకి అన్నీ పిచ్చిసంశయాలే.

(బిలవల్ - 4)

దేహాభిమానం, కాంతా కాంచనాదులమీది ప్రేమ అనేవి వ్యక్తి అహంకారానికి బాహ్యచిహ్నాలు. భగవన్నామంతప్ప మనుష్యుడితో వచ్చేది ఏదీ లేదు.

(బిలవల్ - 2)

భగవన్నామ జపంచేసినా, ధార్మిక గ్రంథాలు ఇతురులికి ఉపదేశంచేసినా, అహంకార మమకారాలు పోనప్పుడు ఏమీ ఉపయోగం లేదు.

(రామ్‌కలీ - 6)

పరనిందచెయ్యకు. ఎవరినీ రెచ్చగొట్టకు. అహంకార విమూఢుడు అజ్ఞాని. అంధుడు.

(రామ్‌కలీ దఖ్నీ ఓంకార్ - 13)

తృప్తి, సమత ఉన్నవాణ్ణి అహంకారం అనే వ్యసనం అంటదు.

(రామ్‌కలీ. సిద్ధగోష్ఠి)

ఆత్మకోసం బలిఅయ్యేవాడికి, సమస్త విజ్ఞానం కరతలామలకం అవుతుంది.

(రామ్‌కలీ. సిద్ధగోష్ఠి)

గురూపదేశం లేనివాడిని అహంకారధూమం ఆవరిస్తుంది.

(రామ్‌కలీ. సిద్ధగోష్ఠి)

నిజమైన భక్తుడు అహంకారాన్ని జయించి, మనస్సుని స్వాధీనం చేసుకొంటాడు.

(సిద్ధగోష్ఠి)

మా చావుపుట్టుకలకు కారణమైన అహంకారమా! పాప కేంద్రమా!

(రామ్‌కలీ సిద్ధగోష్ఠి)

అహంకారాన్ని జయించినవాడే నిజంగా జీవన్ముక్తుడు.

(మారు)

అహంకార మమకారాలతో మనుష్యుడు బాధపడతాడు. ఆశలు, వాంఛలు మనుష్యుణ్ణి పీక్కొని తింటాయి. కాని, ఎవడూ తనతో ఏమీ తీసుకొనిపోడు. అంతా మాయావిలాసం

(మారు - 10)

నాశమయ్యేది ఎవడు? చచ్చిపోయేది ఎవడు? మళ్లీ వచ్చేది ఎవడు? మోక్షం పొందేది ఎవడు? అహంకారంవల్ల చావు, మమకారంవల్ల నాశం. భగవన్నామామృతాన్ని ఆస్వాదించడంవల్ల మనస్సు పరిపూర్ణమై తృప్తిచెందుతుంది. అప్పుడేదీ లేదు.

(ప్రథమ గురువు శ్లోకం, తృతీయ గురువు వ్రాసిన మారులో వార్)

'నే' ననేభావం ఉన్నచోట 'నువ్వు' లేవు. 'నువ్వు' ఉన్నచోట 'నేను' లేదు.

(ప్రథమ గురువు శ్లోకం, తృతీయ గురువు వ్రాసిన మారులో వార్)

'నే' ననేభావం ఉండడంవల్లనే, సంసారానికి రూపకల్పన జరిగింది.

(రామ్‌కలీ సిద్ధగోష్ఠి)

## దృశ్యజగత్తు

సంపద, సౌందర్యం, నీడలాగ మారుతూ ఉంటాయి.

(ధనశ్రీ ఛందం - 3)

ఓ మనస్సా, జగత్తు 'మూన్నాళ్ల ముచ్చట' అనే సత్యాన్ని గ్రహించు.

(రాగ్. తిలాంగ్ - 1)

జగత్తు సముద్రతరంగాలలాగ వస్తూ పోతూ ఉంటుంది. మెరుపుతీగలాగ అది క్షణభంగురం.

(అస ఛంద్ - 5)

జగత్తులో ప్రతిచోట ప్రకృతి పురుషుల సంయోగం చూస్తున్నాను. సృష్టిలో అంతటా సర్వేశ్వరుడు వ్యాపించి ఉన్నాడు

(శ్రీరాగ్. 4 . 18)

జగత్తు అంతా నాటకం. ఒక్క నిమిషంలో ఈ నాటకం అయిపోతుంది.

(శ్రీరాగ్ 3 . 11)

ఈ జగత్తు ఏం మజిలీ! దీనికి కాస్త స్థిరత ఉంటే, ఎవళ్ల కైనా ఇది స్థావరం అయ్యేది!

(శ్రీరాగ్. అష్టపది. 1 17)

భూమ్యాకాశాలు నశిస్తాయి. పరాత్పరుడు ఒక్కడే నిత్యుడు. దినం, దినమణీ; రజని, రజనీకాంతుడు; లక్షలకొలది నక్షత్రాలు- అన్నీ మాయమైపోతాయి. ఒక్క పరమేశ్వరుడే తన స్థానంలో శాశ్వతంగా ఉంటాడు.

(శ్రీరాగ్. అష్టపది. 8 17)

ఈ విశ్వం ఆ సత్యమూర్తి నివాసస్థానం. ఇందులో ఆయన ఉంటాడు.

(అస. శ్లోకం. ద్వితీయ గురువు)

ఓ నానక్, పరాత్పరుడు ప్రపంచాన్ని సృష్టించి, దానిని తన నామంతో నింపివేశాడు. నింపి, నామాన్ని తన అనంత ధర్మానికి ప్రతీకగా చేశాడు.

(అస. వార్)

గురుప్రసాదంవల్ల, విశ్వాన్నంతా నాలోనే, చూడగలిగాను నేను. దీనివల్ల ప్రశాంతచిత్తంతో నేను సత్యాన్ని దర్శించగలిగాను.

(రామ్‌కలీ. సిద్ధగోష్ఠి)

అనిర్వచనీయుడైన పరమాత్మ తన్నుతాను ప్రకటించుకొన్నాడు. నిర్గుణుడైన ఆయన తన్నుతాను సగుణుణ్ణి చేసుకొన్నాడు.

(రామ్‌కలీ. సిద్ధగోష్ఠి)

భగవద్భక్తుడికోసం భగవంతుడు ఈ ప్రపంచాన్ని సృష్టించాడు.

(రామ్‌కలీ. సిద్ధగోష్ఠి)

సంపద, సౌందర్యం 'మూన్నాళ్ల ముచ్చట.' భగవన్నామం లభించినవాడికి "లోపలి పెంజీకటి" పటాపంచలు అవుతుంది.

(బిలవల్ - 3)

ప్రపంచం పశువు. అహంకారం కసాయివాడు. పరాత్పరుడు, మనకి మన నిర్ణయం మనమే చేసుకొనే స్వేచ్ఛ ఇచ్చాడు.

(రామ్‌కలీ. దఖ్ని ఓంకార్ - 18)

అహంభావం వల్లనే ప్రపంచం పృథక్త్వాన్ని పొందింది. కాబట్టి నామాన్ని విస్మరిస్తే స్వస్వరూపజ్ఞానం నశిస్తుంది

(రామ్‌కలీ. సిద్ధగోష్ఠి - 68)

ఈ జగత్తు కామానికి పుట్టిల్లు. ఇక్కడ ఎవళ్లుంటే వాళ్లు అహంకార మమకారాదులతో మండిపోతూ ఉంటారు.

(మారు - 11)

నూతిలోంచి నీరు తోడడానికి చక్రానికి కట్టిన బాల్చీలు, ఒకటి కాళీ అయిన వెంటనే రెండోది నిండేలా, ఈ జగచ్చక్రంలో తిరుగుతూ జీవి ఒకడి తరవాత ఒకడు వస్తూ పోతూ ఉంటాడు. ఇది పరాత్పరుడి లీల. ఆయన ఇచ్ఛానుసారం జరిగే మహిమా ప్రదర్శనం.

(ప్రభాతి - 2)

ప్రపంచం మట్టి! మట్టితో వ్యాపారం చేస్తే బూడిద వస్తుంది. దేహంకూడా మట్టి. ఆత్మ ఎగిరిపోయిన వెంటనే అది మట్టిలో పొర్లాడుతుంది.

(ప్రథమ గురువు శ్లోకం; చతుర్థ గురువు 'సారంగ్' లో వ్రాసిన వార్)

## శకునాలు

మంచి తిథుల్ని మనం లెక్కపెట్టుకుంటాము. కాని పరాత్పరుడు వీటి కన్నింటికీ అతీతుడు అనే సంగతి గుర్తించము.

(రామ్‌కలీ - 4)

## సృష్ట్యాది

సృష్ట్యాదిని యుగయుగాలుగా అంతా ప్రళయం. భూమిలేదు, ఆకాశంలేదు. రాత్రిలేదు, పగలులేదు. పరమాత్మ నిశ్చల సమాధిలో ఉన్నాడు. అప్పుడు వాక్కులేదు. పంచభూతాలు లేవు. చావుపుట్టుకలు లేవు. ముల్లోకాలు లేవు. సప్తసముద్రాలు లేవు. నదీ నదాలు లేవు. కాలంలేదు. పరిణామంలేదు. వివర్తంలేదు. స్వర్గ నరకాలు లేవు. బ్రహ్మ విష్ణు మహేశ్వరు లనే త్రిమూర్తులు లేరు. స్త్రీ లేదు. పురుషుడు లేదు. కులమతాలు లేవు. సుఖ దుఃఖాలు లేవు. యోగులు లేరు. భోగలాలసులు లేరు. జంగాలు లేరు. నాథయోగులు లేరు. యమనియమాదులు లేవు. కర్మకాండ

లేదు. భక్తులు లేరు. పాపులు లేరు. ఉపవాసాలు చేసేవాళ్లు లేరు. ''నేను కాక ఇంకోళ్లు ఉన్నారు'' అనేవాళ్లు లేరు. పరాత్పరుడు తానే, కేవల సమాధిలో, ఆత్మానందాన్ని అనుభవిస్తూ, తన మహిమని తానే అనుసంధానిస్తూ, ఉన్నాడు.

(మారు - 15)

## చతుర్యుగాలు

ఆత్మకి నివాసస్థానమయిన ఈ దేహానికి ఒక రథం ఉంది. ఒక రథికుడు ఉన్నాడు. ప్రతి యుగంలోను వాటికి మార్పు ఉంది. జ్ఞాని ఆ మార్పుని గుర్తిస్తాడు. సత్యయుగంలో తృప్తి రథం, ధర్మం రథికుడు. త్రేతాయుగంలో సంయమం రథం, శక్తి రథికుడు. ద్వాపరయుగంలో నియమం రథం, దానం రథికుడు. కలియుగంలో అగ్ని రథం, అసత్యం రథికుడు!

(అస వార్)

## స్త్రీ

స్త్రీ నుంచే మన పుట్టుక. స్త్రీ గర్భంలోనే మనం పెరిగాము. స్త్రీకే మనం కట్టుబడ్డాము. ఆమెనే వివాహం చేసుకొంటున్నాము. స్త్రీ మన స్నేహితురాలు. ఆమెవల్లనే కుటుంబం. ఆమెవల్లనే ప్రపంచంతో మనకి సంబంధం. మరి, స్త్రీ 'పాపం' అనడం

ఎందుకు ? ఆమె మహా ప్రభువులకు కూడా తల్లిగదా ! స్త్రీనుంచి స్త్రీ. ఆమె లేకపోతే, పరాత్పరుడు తప్ప ఇంక ఎవళ్లూ లేరు.

(అస వార్)

## గార్హస్థ్యం

సంసారపంకంలో ఉన్నా, నిరంజనుడి సేవచేసేవాడికి యోగ మార్గం కరతలామలకం

(సుహీ)

నీటిలో పద్మంలాగ, నదిలో హంసలాగ, మనం 'అంటీ ముట్టకుండా' సంసారంలో సంచరించాలి.

(రామ్‌కలీ. సిద్ధగోష్ఠి)

## పునర్జన్మ

గురుప్రసాదం లేనివాడు ఈ సంసారంలోకి వస్తూ పోతూ ఉంటాడు.

(రామ్‌కలీ. సిద్ధగోష్ఠి)

గురూపదాన్ని శిరసావహించి సన్మార్గంలో సంచరించే వాళ్లకి పునర్జన్మ లేదు. వాళ్లని జననమరణాలు అంటవు.

(శ్రీరాగ్. 4 : 14)

అవతారపురుషుడు తన ఇచ్ఛానుసారం వస్తూ పోతూ ఉంటాడు.

(రామ్‌కలీ)

అహంకార మమకారాలే మనల్ని బంధించి, పునర్జన్మని ఇస్తున్నాయి.

(ఆస)

ఓ అహంకారమా! నువ్వే మా చావు పుట్టుకలకు కారణం. నువ్వే పాపానికి మూలం.

(రామ్‌కలీ. సిద్ధగోష్ఠి)

మనుష్యజన్మ పవిత్రమైంది, పరాత్పరుడివైపు దృష్టి తిప్ప డాని కోసమే అది లభిస్తుంది.

(సుహీ. కఫీ - 3)

## మనస్సు

నీ మనస్సులోనే - వజ్రాలు, రత్నాలు, ముత్యాలు, అన్నీ ఉన్నాయి.

(శ్రీరాగ్ 4 . 21)

జ్ఞాని అంటే ఎవరు? తన్ను తాను తెలుసుకొన్నవాడు!

(శ్రీరాగ్. 4 : 30)

నీ మనస్సు నిర్మలంగా లేకపోతే, నీ దేహం కూడా నీ వాక్కు-కూడా మలినంగానే ఉంటాయి.

(శ్రీరాగ్. అష్టపది ¹ 1 5)

ఓ మనస్సా, చేప నీటిని ప్రేమించినట్లు నువ్వు నీ ప్రభువుని ప్రేమించు. చాతకపక్షి వర్షాన్ని ప్రేమించినట్లు, నువ్వు నీప్రభువుని ప్రేమించు. భూమిఅంతా పచ్చగా కలకలలాడుతూ ఉన్నా, సరస్సులన్నీ జలమయంగా ఉన్నా, చాతకం మాత్రం వాననీటి చుక్కని కోరుతుంది. ఓ మనస్సా, నీళ్ల పాలని ప్రేమించినట్లు నువ్వు నీ ప్రభువుని ప్రేమించు. నీళ్లు వేడిని భరించి, సలసల మరిగినా, పాలని రక్షిస్తాయి.

(శ్రీరాగ్ అష్టపదులు. 2-4 11)

కుండ నీటికి ఆధారం. కాని, నీళ్లు లేకుండా కుండలో రూపాన్ని గుర్తించగలమా? మనస్సుకి జ్ఞానం ఆధారం. కాని గురువు ప్రజ్ఞ లేకుండా మనస్సు జ్ఞానాన్ని ఎలా పొందుతుంది?

(అస వార్)

మనస్సు తనకి తాను దూరమైతే, ప్రపంచం అంతా దానికి దూరమే.

(సుహీ - 4)

మనస్సుకి తృప్తి కలుగుతే అహంకారం తొలగిపోతుంది. జనన మరణాది బాధలు పోతాయి.

(గౌరి)

నిర్వికల్పసమాధి కుదిరితే మానసహంస నిశ్చలంగా నిలిచి పోతుంది. కాలకుడ్యం కూలిపోదు.

(రామ్‌కలీ. సిద్ధగోష్ఠి)

శరీరం వస్తువులకొట్టు, మనస్సు వ్యాపారి, ప్రశాంతమైన మనస్సే సత్యాన్ని అమ్మగలదు.

(రామ్‌కలీ. సిద్ధగోష్ఠి)

దైవాంశసంభూతుడు అహంకారాన్ని అణిచివేసి మనస్సుని జయిస్తాడు.

(రామ్‌కలీ. సిద్ధగోష్ఠి)

మనస్సు నడిపినట్లు నడుస్తుంది. ఇంతలో పాపంవైపు, అంతలో పుణ్యంవైపు పరుగెడుతుంది.

(బిలవల్ - 2)

అష్టసిద్ధులు సాధించే మనస్సుని స్వాధీనంచేసుకొని, మనసా వాచా కర్మణా పరాత్పరుణ్ణే స్మరిస్తూ, పంచభూతాల్ని విసర్జిస్తే, మనప్రభువు మనవాడవుతాడు. అప్పుడు మానవుడు అమరుడవుతాడు.

(బిలవల్. తిట్టి)

మనస్సు పాదరసంలాంటిది. నిత్యచంచలం. రహస్యంగా పాపంవైపు పరుగుతీస్తుంది. భగవంతుడి పాదపద్మాల్ని మనస్సులో నిల్పుకొంటే, మృత్యువులేకుండా సమాధ్యవస్థలో శాశ్వతంగా ఉండవచ్చును.

(రామ్‌కలీ. దక్ని. ఓంకార్ - 23)

శరీరం కొలిమి. మనస్సు లోహం. దానిని పంచాగ్నులతో తప్తంచెయ్యాలి. పాపాలే బొగ్గులు. బాధ్యతలు చిమ్టాలు. అప్పుడు మనస్సు తప్తమవుతుంది.

(మారు - 3)

వాంఛాసర్పాన్ని మనోవల్మీకంలో ఉండనిస్తే, దాని విషం విరగదు.

(మారు - 2)

ఓ మనస్సా, నువ్వు ప్రపంచంలోకి ఏమి తెచ్చావు? ఏమి తీసుకొని పోతావు? నీకు సంశయాలు నశించినప్పుడే విముక్తి.

(తుఖరి)

పాదరసంలా చంచలమైన మనస్సు, పరాత్పరుడి విపులత్వాన్ని గ్రహించలేదు.

(బసంత్ - 4)

ఆకాశంలో పక్షిలాగ మనస్సు మాయవెనకాలే ఎగురుతుంది. ఐదుగురు దొంగలూ (పంచేంద్రియాలు) గురూపదేశంవల్ల దొరికిపోతే, దేహనగరంలో శాంతి ఏర్పడుతుంది.

(ప్రభాతి - 10)

## పరలోకం

పరబ్రహ్మస్వరూపుడైన గురువు అండ దొరికినవాడికి పరలోక భీతి లేదు.

(శ్రీరాగ్. అష్టపదులు 2 15)

పరలోకంలో ఇహలోకంలో చేసిన మంచిపనులే లెక్కలోకి వస్తాయి. పాపికి అక్కడ ప్రహరణాలు తగులుతూంటే "పాపం" అనేవాడుకూడా ఎవడూ ఉండడు అక్కడ.

(అస. వార్. పౌరి - 3)

పరలోకంలో కులానికి, అధికారానికీ విలువలేదు. ఆ లోకంలో అందరూ ఒకటే. దేవుడి కళ్లల్లో ఎవళ్లు మంచివాళ్లో, వాళ్లే అక్కడ గొప్పవాళ్లు.

(అస. వార్)

చదువుకొన్నవాడు పాపి అయితే, చదువులేని సత్పురుషుడు శిక్షపొందడు అక్కడ. ఎవళ్లు చదువుకొన్నవాళ్లో ఎవళ్లు కారో అనే నిర్ణయం అక్కడ తేలుతుంది. తన మనస్సునకు బానిస అయి, దానివెంటే పోయేవాడు చదువులేనివాడు.

(అస. వార్)

తన ఇష్టానుసారం ఇక్కడ శాసిస్తాడు. అక్కడ గజగజ వణికిపోతూ నగ్నంగా, నరకంవైపు నడిపిస్తే నడుస్తాడు :

(అస. వార్)

పరలోకయాత్రలో అగ్ని సముద్రాల్ని విషజ్వాలల్ని అధిగమించాలి. తోడునీడ ఉండదు. తనకి తానే తోడుగా నడిచిపోవాలి. అగ్నిజ్వాలలు ఎగసిపోతూ ఉంటే, ఆ మంటల్లో అహంకార విమూఢాత్ముడు మాడిపోతూ ఉంటాడు.

(మారు - 6)

## చిహ్నాలు, సంకేతాలు

భగవన్నామం లేకుండా, జేగురుబొట్టు, జన్నిదం ఏమి ప్రయోజనం?

(అస. వార్. శ్లోకం)

బాహ్యాడంబరాన్ని, విశిష్టమైన ధార్మిక చిహ్నాల్ని, సంకేతాల్ని, ప్రదర్శిస్తే ఏంలాభం? శరీరం శ్రమపడడం తప్ప!

(అస శ్లోకం)

## స్వర్గనరకాలు

పాపులకు ఆశ్రయంలేదు. వాళ్లకి నరకమే గతి.

(అస. వార్. పౌరి - 2)

ఓ ప్రభూ, నీ పేరు "అరూపి". కాని, దానిని స్మరించిన వాళ్లకి నరకం లేదు.

(అస. వార్. పౌరి - 5)

అహంకారాన్ని బట్టే స్వర్గనరకాలు నిర్ణయం అవుతాయి.

(అస. వార్. శ్లోకం )

## యాత్రికులు

తీర్థస్థానాలలో స్నానాలు, దానాలు శుష్క ప్రవచనాలు, పరాత్పరుణ్ణి మోసం చెయ్యలేవు.

(సుహీ - 5)

నువ్వు చెడ్డ మనస్సుతో, దొంగవాడి దేహంతో, తీర్థయాత్రలకు పోతావు. నీలో ఒక భాగానికి స్నానం అయితే, రెండోభాగానికి ఇంకా మాలిన్యం. చేదు పుచ్చకాయ పైన కడిగితే, లోపలి విషం పోతుందా? ఇలాంటి స్నానాలు మహా పురుషులకు అక్కర లేదు. ఎన్ని స్నానాలు చేసినా దొంగ దొంగే!

(శ్లోకం రాగ్ సుహీ)

## ఆహారం, ఉపవాసాలు

తృప్తిగలవాళ్లు పరమాత్మను ధ్యానంచేస్తూ, ఇంక దేనినీ స్మరించరు. వాళ్లు పాపాలలో మునిగి తేలుతూ, ఉండరు. పుణ్యకార్యాలే చేస్తారు. సంసార బంధాల్ని సడలించుకొని, మితంగా భుజిస్తారు.

(అస. వార్. పౌరి)

ఉపవాసాలవల్ల అరుచి ఏర్పడుతుంది. జిహ్వాచాపల్యంవల్ల బాధపడతారు.

(అస. వార్)

ధాన్యందేవుడు, నీరుదేవుడు, గాలిదేవుడు, నిప్పుదేవుడు, ఉప్పుదేవుడు. ఈ దేవుళ్లకి నెయ్యిదేవుడు కలిస్తే వాటి పవిత్రత ఎక్కువవుతుంది.

(అస. వార్. శ్లోకం)

మనం తినే వస్తువులన్నీ, పరమాత్మ అనుగ్రహించినవి కాబట్టి మంచివే.

(అస. వార్)

మిత్రమా, మనం కేవలం రుచికోసం తినే ఆహారాన్ని, మన మనసుల్ని పాపం వైపు తిప్పే ఆహారాల్ని వర్జించాలి.

(శ్రీరాగ్)

## నిర్వాణం

అతనికి ఆకలిదప్పు లుండవు. చిత్తశాంతి ఉంటుంది. సర్వ వ్యాపి అయిన సర్వేశ్వరుణ్ణి అందరిలోను దర్శిస్తాడు.

(మారు. దఖ్ని)

నీటిని అంటకుండా పద్మం, నీటిమీద తేలుతూ హంస ఉన్నట్లు చిత్తశాంతిని సంపాదించిన భక్తుడు, లౌకిక విషయాల్ని లెక్క పెట్టకుండా సంసారసాగరాన్ని తరిస్తాడు. అద్వితీయుడైన పర మాత్మ అతని మనస్సులో ఎప్పుడూ ఉంటాడు.

(రామ్‌కలీ. సిద్ధగోష్ఠి)

దైవాంశసంభూతుడు ఎప్పుడూ ముక్తుడే.

(రామ్‌కలీ. సిద్ధగోష్ఠి)

మనుష్యుడు త్రిగుణాతీతుడైనప్పుడు సర్వభక్షకుడు కాగలడు. ఓ నానక్, అప్పు డతను సర్వోద్ధారకుడు కూడా కాగలడు.

(రామ్‌కలీ. సిద్ధగోష్ఠి)

నామమందే మనస్సుని లగ్నంచేసి, ఇతరానికి మృతతుల్యుడైన వాడే ముక్తిపొందుతాడు.

(రామ్‌కలీ సిద్ధగోష్ఠి)

సద్గురువు లభించనిదే ముక్తి లభించదు.

(రామ్‌కలీ - సిద్ధగోష్ఠి)

## మనుష్యుడు

ఎంతో సుకృతం ఉంటేనేగాని మనుష్యజన్మ రాదు. భగవంతుడికి అభిముఖులైన వాళ్లకేగాని ఈ జన్మ లేదు.

(సుహీ కాఫీ. 1 3)

"భగవంతుడి ఇష్టప్రకారమే అంతా జరుగుతుంది. మనుష్యుడి చేతుల్లో ఏమీలేదు" అంటాడు నానక్.

(శ్రీరాగ్. అష్టపదులు. 3 : 4)

నీలో వున్న భగవన్మందిరం చాలా సుందరం. దాన్ని సృష్టి కర్తే నిర్మించాడు.

(శ్రీరాగ్. అష్టపదులు)

భగవన్నామాన్ని మనలో పాదుకొల్పి, మనదేహాల్ని ఆయన విధులకు అనుకూలంగా చేశాడు.

(అస. వార్ పౌరి - 2)

శబ్దం అద్భుతమైంది, విజ్ఞానం అద్భుతమైంది, జీవం అద్భుతమైంది. దీని వైవిధ్యం అద్భుతం. రూపం, వర్ణం అద్భుతాలు. నగ్నంగా సంచరించే జీవులు అద్భుతమైనవి. వాయువు, జలం అద్భుతాలు. అనేక చమత్కారాలు చూపించే అగ్ని అద్భుతం, భూమి అద్భుతం, సృష్టిలో ఉన్న జీవసంతతి అద్భుతం, జీవితాన్ని అపమార్గం పట్టించే రుచులు అద్భుతం, సంయోగం అద్భుతం, వియోగం అద్భుతం, అనుభవం అద్భుతం, ఆకలి అద్భుతం, పొగడ్త అద్భుతం, మార్గం అద్భుతం, దారి తప్పడం అద్భుతం. సామీప్యం అద్భుతం, దూరం అద్భుతం, వర్తమానంలో మనం చూచేదంతా అద్భుతం. అద్భుతం మీద అద్భుతం చూస్తూ, నేను అబ్బురపడి పోతున్నాను. సువిధి ఉన్న వాడికే, ఈ అద్భుతానికి సమాధానం దొరుకుతుంది.

(అస. ప్రథమ గురువు. వార్. శ్లోకం)

ఓ అజ్ఞానీ, నీ సౌందర్యం ఎందుకు? పరాత్పరుడికి అది నచ్చనప్పుడు !

(తిలాంగ్ - 4)

నీతో వచ్చిన శరీరం, చివరిలో నీ తోడుగా ఉండదు. నీ తండ్రి, తల్లి, కొడుకులు, చుట్టాలు - నువ్వు ప్రేమించే వాళ్లందరూ - దేహంలోంచి ఆత్మ ఎగిరిపోయిన వెంటనే, నిన్ను నిప్పుల్లో పారేస్తారు!

(తిలాంగ్ - 2)

దేహం చెట్టు, మనస్సు మొగ్గ, పంచేంద్రియాలు మిగిలిన మొగ్గలు. పరాత్పరుడి మూలతత్త్వాన్ని ఆస్వాదించే వాళ్లకు బంధం లేదు. ఆశాబీజాల్ని అన్వేషిస్తూ ఎగిరేవాళ్ల రెక్కలుతెగి, వాళ్లందరూ పాపజాలంలో పడి చిక్కుకొంటారు.

(రామ్‌కలీ దఖ్ని. ఓంకార్ - 33)

ఈ శరీరం మట్టిముద్ద, ఇసకగోడ, అంతా మాయ. మరి, నువ్వు, భగవన్నామం లేకుండా ఎలా పుణ్యాన్ని సంపాదిస్తావు?

(మారు - 11)

## సహజస్థితి

పరమహంసలు అమృత సరస్సును విడిచిపోరు; భక్తి ప్రేమలతో, సహజస్థితితో ఐక్యానుసంధానం సాధిస్తారు.

(ధనశ్రీ. అష్టపదులు - 8)

భగవద్భక్తులు, భక్తితో సహజస్థితిలో భగవంతుణ్ణి భజిస్తారు.

(ధనశ్రీ అష్టపదులు - 8)

సహజస్థితిలో ఉన్నవాడే నిజంగా భగవంతుణ్ణి దర్శించ గలుగుతాడు. అలాంటివాడికి చావుపుట్టుక లనే రాకపోకలు ఉండవు. అప్పుడు, భగవంతుడిలో భక్తుడు, భక్తుడిలో భగవంతుడు వసిస్తారు.

(ధనశ్రీ. అష్టపదులు - 2)

గురూపదేశంవల్ల, శిష్యుడికి సహజస్థితి లభిస్తుంది. ఈ స్థితి వల్ల భగవత్తత్త్వం అవగాహన అవుతుంది. అప్పుడు భక్తుడు అపమార్గం తొక్కడం అనేదే లేదు. సన్మార్గంలో నడిచే అన్వేషకుడికి గమ్యస్థానం సుగమం అవుతుంది.

(రామ్‌కలీ. సిద్ధగోష్ఠి - 23)

నిర్వికల్పసమాధిలో ఉంటే, హంస ఎగిరిపోదు. కాలకుడ్యం పడిపోదు.

(రామ్‌కలీ. సిద్ధగోష్ఠి)

## మాయ

భగవన్నామాన్ని పరిత్యజించి, మాయామధువు తాగి మత్తెక్కిన వాడికి శాంతిలేదు. భక్తి ప్రేమలతో గురుపూజ చేసే వాడికి మోక్షం కరతలామలకం అవుతుంది. (మాయలో పడ్డవాడు పంది, కుక్క, గాడిద, పిల్లి - చతుష్పాత్తు, అస్పృశ్యుడు.)

(బిలవల్ - 2)

మాయకు చావులేదు, మనస్సుకు నిలకడ లేదు. కామసాగరం అనంతలహరులతో, తాగినదానిలా, కల్లోలంగా ఉంది. అంతస్సత్యం నడిపిస్తూ ఉంటే నడిచే శరీరనౌక, ఏ అలజడి లేకుండా సాగరాన్ని తరిస్తుంది.

(మారు - 9)

వెండి బంగారాలు మాయ; ఎప్పుడో ఒకప్పుడు అవీ మట్టిలో కలిసిపోయేవే!

(మారు - 5)

మాయని పూజించేవాడు ఎనభై నాలుగు లక్షల జీవరాసుల జన్మలనే నరకంద్వారా నడుస్తాడు. చేసిన పనికి ప్రతిఫలం తప్పుతుందా?

(మారు - 8)

మాయని పూజించేవాడు, భ్రాంతి వెనకాలే పరిగెత్తుతాడు.

(మారు - 9)

మాయ పట్టుకొంటే, దాన్ని విడిపించుకోలేడు. కాని, భగవన్నామాన్ని శిష్యుడి మనస్సులో ప్రవేశపెట్టి, సద్గురువు అతణ్ణి రక్షించగలడు.

(పార్వతి)

## కర్మ - కటాక్షం

ఎవడి చిత్తాన్ని అనుసరించి వాడి మార్గం ఉంటుంది.

(శ్రీరాగ్. 1 · 30)

నీ కటాక్షం నా కుటుంబం.

(శ్రీరాగ్ 4 7)

మనకి సత్యనిష్ఠ ఉంటే, భగవత్కటాక్షం మనమీద ఉంటుంది.

(శ్రీరాగ్. 4 15)

ఓ నానక్! ఆయన తల్చుకొంటే, కాకిని హంస చేస్తాడు.

(శ్రీరాగ్. వార్. శ్లోకం)

మన కృషివల్ల మనకి వచ్చే బహుమానం ఏం బహుమానం? ఓ నానక్, పరాత్పరుడు దయతల్చి మనకి ప్రసాదించిందే నిజమైన బహుమానం.

(అస - ప్రథమగురువు, వార్. శ్లోకం - ద్వితీయ గురువు)

ప్రభూ, నీ పిల్లలమీద నీకు కోపమా? నువ్వు వాళ్ల వాడివి, వాళ్లు నీ వాళ్లు.

(శ్రీరాగ్)

మనిషి చేసిన మంచిచెడ్డలకు తగిన ప్రతిఫలం తప్పక ముట్టుతుంది.

(వార్. అస)

మిత్రులారా, భగవంతుడి శాసనాన్ని తుడిచి పారవెయ్యలేము.

(రామ్‌కలీ)

మన స్సనే కాగితంమీద మన మంచిచెడ్డలన్నీ వ్రాసిఉన్నాయి. మన పాతకర్మలన్నీ అక్కడ ఉన్నాయి. అయితే, భగవంతుడి కరుణాకటాక్షంకూడా అనంతం . భగవన్నామామృతంతో మనల్ని తరింపజేసే గురువులభిస్తే, మన కర్మలన్నీ - లోహం బంగారం అయినట్లు - మారిపోతాయి. తపించే మన శరీరానికి, తాపం చల్లారి చల్లదనం వస్తుంది.

(మారు)

## ఆత్మ - పరమాత్మ

కృష్ణుడు దేవదేవుడే కావచ్చు. అంతకంటె గొప్పమనిషి ఆత్మ.

(అస. వార్. శ్లోకం. ద్వితీయ గురువు)

సద్గురువు, అమృతశబ్దాన్ని ఉపదేశించకపూర్వం, ఆత్మ ఎన్నో శరీరాల్లో జన్మ ఎత్తింది.

(ఆస. వార్. పౌరి - 4)

నిర్మలంగా హంసలా ఆత్మ దేహంలోఉంది. అది నిర్గుణ బ్రహ్మతత్త్వం. దుఃఖాల్ని అన్నిటినీ, సుఖాలుగా స్వీకరించి మనుగడ సాగిస్తుంది.

(మారు - 14)

శరీరానికి ఆత్మకి పోరాని అనుబంధం. ఆత్మ తటస్థుడైన యోగినిపోలి ఉంటే, శరీరం అందమైన స్త్రీలాగ ఉంటుంది. శరీరానుభవాలు అన్నీ ముగిసిన తరవాత, ఆత్మ శరీరానికి చెప్ప కుండా దాన్ని విడిచి పారిపోతుంది.

(మారు - 8)

ఆత్మ పరమాత్మలోను, పరమాత్మ ఆత్మలోను లగ్నమై ఉంటాయి.

(భైరో)

వ్యక్తిగత చైతన్యం చచ్చిపోతుంది, సుఖదుఃఖాలు నశిస్తాయి. గర్వం నశిస్తుంది. కాని, సాక్షీభూతమైన ఆత్మకి చావులేదు.

(గౌరి)

బిందువులో సముద్రం, సముద్రంలో బిందువు గర్భితమై ఉన్నాయి.

(రామ్‌కలీ)

## నిజమయిన యోగం

దారి తెలిసినవాడే యోగి.

(ధనశ్రీ)

కాషాయాంబరంలోగాని, దండంలోగాని, బూడిదపూతలోగాని యోగంలేదు. చెవులకు ఉంగరాలు తగిలించుకోడంలోగాని, జుట్టు పొట్టిగా కత్తిరించుకోడంలోగాని, కొమ్ము ఊదడంలోగాని యోగం

లేదు. లంపటాలమధ్య అంటీ అంటకుండా ఉండడమే యోగం. పోసుకోలు మాటలవల్ల ఎవడూ యోగికాలేడు: సృష్టిని అంతటినీ సమంగా చూడగలిగినవాడే యోగి. గోరీలదగ్గిర, శ్మశానాలలోను తిరిగితే యోగికాడు. దంభ సమాధులలో ఉంటే యోగికాడు. ప్రపంచం అంతా తిరుగుతూ ఉన్నా, తీర్థస్థానాలలో స్నానాలుచేసినా యోగి కాలేడు. లంపటాలమధ్య అంటీ అంటకుండా ఉండడమే యోగం.

(సుహీ - 8)

"నువ్వు జీవించి ఉండగానే, నీ కోసం నువ్వు చచ్చిపో. ఊదకుండానే కొమ్మును ఊదించు, అదే యోగస్థితి. అన్ని సమయాల్లోను నిర్భయంగా ఉండేస్థితిని సాధించు, అదే యోగస్థితి. లంపటాలమధ్య, అంటీ అంటకుండా ఉండడమే యోగం.

(సుహీ - 8)

## ప్రార్థన

ప్రభూ, నాలో గుణలేశమయినా లేదు, నేను నిన్ను ఎలా చేరుకోను? నాకు అందంలేదు, తళతళమెరిసే కళ్లులేవు. మంచి కుటుంబంలేదు, సంస్కృతిలేదు. మధుర వాక్కులేదు, ప్రతిభ లేదు, మేధాశక్తిలేదు. నేను అజ్ఞానిని, తెలివితక్కువవాణ్ణి. ప్రభూ, నీ పాదపద్మాలు చేరేలాగ నన్ను ఆశీర్వదించు. నువ్వు నన్ను అభిమానించకపోతే, నాగతి ఏమిటి? నన్ను సంశయాలు బాధిస్తున్నాయి. భ్రాంతి నన్ను విడవడంలేదు. నా అహంకారం

పోయినప్పుడే, నేను నీ ప్రేయసిని అయి, నీలో లీనమైపోతాను. అప్పుడు నవనిధులు నా స్వాధీనం అవతాయి. జన్మజన్మకి, నేను నీకు దూరమయ్యాను. ఇప్పుడు, నాచెయ్యి పట్టుకొని విడవకు; నా ప్రభూ, నా నాథా, నా రాజా!

(సుహీ. అష్టపదులు)

ప్రభూ, వెండి బంగారాలంటే నాకు ఇష్టం. ముత్యాలు, మాణిక్యాలు అంటే కూడా అంతే. కాని, ఇవన్నీ నువ్వు ఇచ్చినవే. వీటిని ఇచ్చిన నిన్ను కాకుండా, నేను వీటినే ప్రేమిస్తున్నాను! మేడలు మిద్దెలు, ప్రాసాదాలు సౌధాలు, నన్ను ఆకర్షించాయి. నా ప్రియుడి పక్కను కూర్చున్నదే లేదు నేను. ఆకాశంలో (నా తలమీద) పిట్టలు (వయస్సనేవి) అరుస్తున్నాయి; కొంగలు (తెల్ల జుట్టు) నా తలమీదికి దిగాయి. నేను నా అసలు ఇంటికి పయనమయ్యే స్థితిలో ఉన్నాను. నీ ముఖం నేను ఎలా చూడగలను? నిద్రలో రాత్రి (జీవితం) గడిచిపోయి, ఉషఃకాలం (మృత్యువు) వచ్చింది. నాదారి మరిచిపోయిన నేను, నీకు దూరమయ్యాను. ఇప్పుడింక నాకు బాధే మిగిలింది. నువ్వు గుణలుబ్ధుడివి, నాకో ఏ గుణాలూ లేవు (అవగుణాలు తప్ప). నానక్ ప్రార్థన ఒక్కటే: భక్తులనే నీ ప్రియురాండ్రకు అన్ని రాత్రులూ ఇచ్చేశావు: నా కోసం ఒక్క రాత్రి అయినా ఉందా?

(సుహీ. కుచాజీ)

నువ్వు నాతో ఉంటే, నే నన్నీ సాధిస్తాను. నువ్వు నా ప్రభువువి, నా మూలధనానివి. నువ్వు నాతో ఉంటే, నాకు శాంతి. నువ్వు నా దగ్గిరికి వస్తే, నేను ధన్యుణ్ణి, నన్ను రాజుని

చెయ్యడంగాని, ముష్టివాణ్ణి చెయ్యడంగాని నీ ఇష్టంమీద ఉంది. నీ అనుగ్రహం ఉంటే, మేము సంసార సాగరాన్ని తరిస్తాము. నీ దయవల్ల మా భారం, సాగర మధ్యంలోనే తరిగి పోతుంది. నీ దయవల్లే, నువ్వు శృంగారమూర్తిగా నాకు కనబడుతావు. నిన్ను వర్ణించడమే నా పనిగా అవుతుంది. సమస్త కల్యాణ గుణాలు మూర్తీభవించి ఉన్న నువ్వు నాకు - నీ ఇచ్ఛానుసారమే కాబోలు- భయంకరంగా కనబడి, చావుపుట్టుకల జంజాటంలో నన్ను తిప్పుతూ ఉంటావు. ప్రభూ, నీకు నువ్వేసాటి. నీ గుణగణాదుల్ని, నీ నిరుపమాన శక్తిని చూచి నేను నీ శరణుజొచ్చాను. నేను నిన్ను ఏమి అడగను? నీతో ఏమి అనను? నీ కోసం తపించి పోతున్నాను, అని మాత్రం అనగలను.

(సుహీ సచ్ఛాజీ)

# నేషనల్ బుక్ ట్రస్ట్ - ఇండియా

నేషనల్ బుక్ ట్రస్ట్ వివిధ భారతీయ భాషలలో ఇంతవరకు 350 పుస్తకాలకు పైగా ప్రచురించింది. ప్రస్తుతం అమలు పరచ బడుచున్న ఈ పుస్తక ప్రచురణ కార్యక్రమంలోని ప్రధాన అంశాలు :

## 1. భారతదేశమూ : ప్రజలూ

భారతదేశమునకు సంబంధించిన సమాచారము, ముఖ్యముగా భౌగోళిక స్థితిగతులు, వ్యవసాయము, పరిశ్రమలు, భాషా సాహిత్యాలు, సంస్కృతి తదితర రంగాలను గురించిన సమాచార మును స్థూలముగ సామాన్యపఠితకు అందజేయడం ఈ గ్రంథాల లక్ష్యం. సులభశైలిలో జనసామాన్యానికి అర్థంకాగల భాషలో ప్రచురితమయ్యే ఈ గ్రంథాలు భారతదేశమును గురించిన 'సంగ్రహ విజ్ఞాన సర్వస్వం'గా రూపొందగలవు.

## 2. జాతీయ జీవిత గ్రంథమాల

భారతదేశములో జన్మించి మతము, సాహిత్యము, కళలు, సంగీతము, విజ్ఞానశాస్త్రములు తదితర రంగాలలో ప్రఖ్యాతినందిన భారతీయుల జీవిత చరిత్రలను ప్రచురించాలని ప్రయత్నం. ఈ గ్రంథమాలలో సుమారు 100 గ్రంథాలు వెలువరించాలని సంకల్పం.

## 3. పాప్యులర్ సైన్సు

విజ్ఞానశాస్త్రాల అభివృద్ధి, దైనందిన జీవితంలో విజ్ఞానశాస్త్రాల ప్రాముఖ్యమును సామాన్యపాఠకునకు తెలియజెప్పడం ఈ గ్రంథ మాల లక్ష్యం.

## 4. ప్రపంచసాహిత్య మణిపూసలు

విభిన్నరంగాలలో ప్రపంచ ఆలోచనాసరళిని ప్రభావితం చేసిన ప్రముఖ గ్రంథాలను సాధారణ పాఠకునకు అర్థమయ్యేరీతిలో వివిధ భారతీయ భాషలలో సరళ అనువాదాలు ప్రచురించే కార్యక్రమం.

## 5. సమకాలీన ప్రపంచము

ప్రపంచదేశాలచరిత్ర, తదితర ముఖ్య విషయాలను సాధారణ పాఠకునకు అర్థమయ్యేరీతిలో సులభశైలిలో వెలువడే గ్రందమాల.

## 6. భారతదేశ జానపదసాహిత్యం

భారతదేశ ఐక్యతను సుస్పష్టంచేస్తూన్న దేశంలోని ప్రధాన ప్రాంతాలలోని జానపదసాహిత్యమును గురించిన గ్రంథాలు ప్రచురించే పథకము.

## 7. యువప్రపంచము

భారతీయ యువతకు పనికివచ్చే పుస్తకమాల. ఆధునిక ప్రపంచంలో శాస్త్ర విజానప్రగతిని గురించి మాత్రమేగాక జాతీయ

జీవితంలోని మహత్తర ఘట్టాలను, వీరోచిత కృత్యాలను వివరించే పుస్తక ప్రచురణ కార్యక్రమము.

## జాతీయసమైక్యత

### 8. నెహ్రూ బాల గ్రంథాలయము

జాతీయ సమైక్యత ప్రధాన విషయంగా ఉండగల పుస్తకాలు ప్రచురించే పదకము. నాలుగవ పంచవర్ష ప్రణాళికాకాలంలో. ప్రధానమైన భారతీయ భాషలన్నిటిలో సుమారు 100 పుస్తకాలు ప్రచురించాలని సంకల్పం. అన్ని భాషలలోను ఈ పుస్తకాల రూపురేఖలు, దర ఒకేవిధంగా ఉండగలవు.

### 9. సాహిత్య వినిమయము

ప్రతి భారతీయ భాషలోని 10 ప్రముఖ గ్రంధాలను మిగిలిన భారతీయ భాషలన్నిటిలోనికి అనువదించి నాలుగవ పంచవర్ష ప్రణాళికకాలంలో ప్రచురించే పధకము.

ఇంతేగాక నేషనల్ బుక్ ట్రస్ట్ అందుబాటులో లేని ప్రముఖ గ్రంధాల పునర్ముద్రణ, ప్రత్యేక ప్రాముఖ్యంగల వ్రాతప్రతులను సంస్కరించి ప్రచురించే కార్యక్రమంకూడా నిర్వహిస్తున్నది.

వివిధ గ్రంధమాలలలోని గ్రంథాలు ఆయా రంగాలలో నిష్ణాతులైనవారి రచనలు, సరసమైన వెలలకు లభింపజేయాలన్న ఆశయమును దృష్టిలో ఉంచుకొని గ్రంధప్రచురణ వీలయినంత ఉన్నత స్థాయిలో జరుగుతున్నది.

# జాతీయ జీవిత గ్రంథమాల

ప్రధాన సంపాదకుడు

డాక్టర్ బి. వి. కేస్కర్

ఆచార్య కె. స్వామినాథన్ శ్రీ ఎం. వి. దేశాయ్

## తయారీలోనున్న గ్రంథములు

| గ్రంథముపేరు | రచన |
|---|---|
| 1. నరసింహ మెహతా | శ్రీ కె కె. శాస్త్రి |
| 2. నామదేవ | శ్రీ ఎల్. జి. జోగ్ |
| 3. స్వామి వివేకానంద | శ్రీ ఎ కె. శాస్త్రి |
| 4. స్వామి రామదాస | ఆచార్య ఎం. జి. దేశముఖ్ |
| 5. స్వామి రామతీర్థ | శ్రీ డి. ఆర్. సూద్ |
| 6. స్వామి దయానంద | శ్రీ వీరేంద్రకుమార్ సింగ్ |
| 7. చైతన్య | శ్రీ దిలీప్‌కుమార్ ముఖర్జీ |
| 8. బాణ | డాక్టర్ లల్లన్‌జీ గోపాల్ |
| 9. సిద్ధరాజ | శ్రీ చినూభాయ్ జె. నాయక్ |
| 10. హబ్బ ఖతూన్ | శ్రీ నందలాల్ చావ్లా |
| 11. చంద్రగుప్త విక్రమాదిత్య | డాక్టర్ రాజ్ బలి పాండే |
| 12. పులకేశి II | డాక్టర్ జైప్రకాశ్‌సింగ్ |
| 13. కనిష్క | శ్రీ ఎ. కె. నారాయణ్ |
| 14. భోజ పర్మార్ | శ్రీ సి. కె. త్రిపాఠి |

| | |
|---|---|
| 15. పృథ్వీరాజ్ చౌహాన్ | డాక్టర్ విద్యాప్రకాశ్ |
| 16. సవాయ్ జైసింగ్ | శ్రీ రాజేంద్రశంకర్ భట్ |
| 17. మౌలానా అబుల్ కలాం అజాద్ | శ్రీ మాలిక్ రామ్ |
| 18. పండిత మదనమోహన మాలవ్యా | శ్రీ సీతాచరణ్ దీక్షిత్ |
| 19. జి. జి. అగార్కర్ | ఆచార్య జి. పి. ప్రధాన్ |
| 20. పురందర దాస | శ్రీ వి. సీతారామయ్య |
| 21. తాన్ సేన్ | ఠాకూర్ జైదేవ సింగ్ |
| 22. రామానుజన్ | డాక్టర్ బి. డి. శర్మ |
| 23. జె. సి. బోస్ | శ్రీ ఎస్. ఎన్. బాసు |
| 24. సర్ఫోజీ భోన్స్లే | శ్రీ ఆర్. గోపీనాథ్ |
| 25. బసవణ్ణ | శ్రీ చిదానందమూర్తి |

# జాతీయ జీవిత గ్రంథమాల

## వెలువడిన పుస్తకములు.

| | | | |
|---|---|---|---|
| 1. గురుగోవిందసింగ్ (3 వ ప్రచురణ) | డాక్టర్ గోపాల్‌సింగ్ | రూ. | 2-00 |
| 2. గురునానక్ (2 వ ప్రచురణ) | ,, | ,, | 2-25 |
| 3. కబీర్ | డాక్టర్ పరశునాధ్ తివారి | ,, | 1-75 |
| 4. రహీమ్ | డాక్టర్ సమర్ బహాదుర్ సింగ్ | ,, | 2-00 |
| 5. మహారాణా ప్రతాప్ (హిందీ) | శ్రీ ఆర్. ఎస్. భట్ | ,, | 1-75 |
| 6. అహల్యా బాయ్ (హిందీ) | శ్రీ హీరాలాల్ శర్మ | ,, | 1-75 |
| 7. త్యాగరాజు | ఆచార్య పి. సాంబమూర్తి | ,, | 2-00 |
| 8. పండిట్ భట్‌కండె | డాక్టర్ ఎస్. ఎన్. రతన్ జంకార్ | ,, | 1-25 |
| 9. పండిట్ విష్ణు దిగంబర్ | శ్రీ వి. ఆర్. అధవాలె | ,, | 1-25 |
| 10. శంకరదేవ | డాక్టర్ మహేశ్వర్ నియోగ్ | ,, | 2-00 |
| 11. రాణీ లక్ష్మీబాయ్ (హిందీ) | శ్రీ బృందావన్‌లాల్ వర్మ | ,, | 1-75 |
| 12. సుబ్రహ్మణ్య భారతి | డాక్టర్ (శ్రీమతి) హేమానంద కుమార్ | ,, | 2-25 |

| | | |
|---|---|---|
| 13. హర్ష | శ్రీ వి. డి. గంగాల్ | రూ. 1–75 |
| 14. సముద్రగుప్త (హిందీ) | డాక్టర్ లల్లన్‌జీ గోపాల్ | ,, 1–25 |
| 15. చంద్రగుప్తమౌర్య (హిందీ) | డాక్టర్ లల్లన్‌జీ గోపాల్ | ,, 1–50 |
| 16. ఖాజీ నజురుల్ ఇస్లామ్ | శ్రీ వసుధ చక్రవర్తి | ,, 2–00 |
| 17. శంకరాచార్య | ప్రొ. టి.ఎమ్.పి.మహాదేవన్ | ,, 2–00 |
| 18. అమీర్ ఖుస్రు | శ్రీ సయ్యద్ గులామ్ సమ్నాని | ,, 1–75 |
| 19. నానా ఫడ్‌నావిస్ | డాక్టర్ వై. ఎన్. డియోధర్ | ,, 1–75 |
| 20. రంజిత్ సింగ్ | శ్రీ డి. ఆర్. సూద్ | ,, 2–00 |
| 21. హరినారాయణ్ ఆప్టే | డాక్టర్ ఎమ్. ఎ. కరండికర్ | ,, 1–75 |
| 22. ఆర్. జి. భండార్కర్ | డాకర్ హెచ్. ఎ. ఫాడ్కే | ,, 1–75 |
| 23. ముత్తుస్వామి దీక్షితర్ | జస్టిస్ టి. ఎల్. వెంకట్రామ అయ్యర్ | ,, 2–00 |
| 24. మీర్జాగాలిబ్ | శ్రీ మాలిక్ రామ్ | ,, 2–00 |
| 25. సూర్ దాస్ (హిందీ) | శ్రీ వ్రజేశ్వర్ | ,, 1–75 |
| 26. రామానుజాచార్య | శ్రీ ఆర్. పార్థసారథి | ,, 2–00 |
| 27. ఈశ్వరచంద్ర విద్యాసాగర్ | శ్రీ ఎస్. కె. బోస్ | ,, 2–00 |

# భారతదేశమూ : ప్రజలూ

## వెలువడిన పుస్తకములు

| | మేలుప్రతి రూ. | సాదాప్రతి రూ. |
|---|---|---|
| 1. పూలచెట్లు | | |
| డాక్టర్ ఎమ్. ఎస్. రన్‌ధావా | 9-50 | 6-50 |
| 2. అస్సాము వాఙ్మయము | | |
| ఆచార్య హేమ్ బరువా | 7-50 | 5-00 |
| 3. సామాన్య వృక్షములు | | |
| డాక్టర్ హెచ్. సాంతపౌ | 8-25 | 5-25 |
| 4. హిందూదేశపు పాములు | | |
| డాక్టర్ పి. జె. దేవరస్ | 9-50 | 6-50 |
| 5. దేశము - మన్ను | | |
| డాక్టర్ ఎస్. పి. రాయ్ చౌధరి | 8-25 | 5-25 |
| 6. భారతదేశపు ఖనిజములు | | |
| శ్రీమతి మెహర్ డి. ఎన్. వాడియా | 8-25 | 5-25 |
| 7. పెంపుడు జంతువులు | | |
| ఆచార్య హర్బన్స్ సింగ్ | 8-00 | 4-25 |
| 8. అడవులు - ఆటవిక శాస్త్రము | | |
| శ్రీ కె. పి. సాగ్రీయ | 8-50 | 5-25 |

| | మేలుప్రతి రూ. | సాదాప్రతి రూ. |
|---|---|---|
| 9. రాజస్థాన్ భూగోళము<br>డాక్టర్ వి. పి. మిశ్రా | 8-25 | 6-00 |
| 10. పూలతోట<br>డాక్టర్ విష్ణు స్వరూప్ | 9-50 | 6-00 |
| 11. జనాభా<br>డాక్టర్ ఎస్. ఎన్. అగర్వాలా | 7-00 | 3-75 |
| 12. నికోబార్ దీవులు<br>శ్రీ కె. కె. మాథుర్ | 9-00 | 5-50 |
| 13. సామాన్య పక్షులు<br>డాక్టర్ సలీమ్ అలీ అండ్<br>శ్రీమతి లాయిక్ ఫతే అలీ | 15-00 | 9-00 |
| 14. కాయగూరలు<br>డాక్టర్ బి. చౌధరి | 8-25 | 5-25 |
| 15. హిందూదేశపు ఆర్థిక భూగోళము<br>ఆచార్య వి. ఎస్. గణనాథన్ | 8-25 | 5-25 |
| 16. హిందూదేశపు ప్రాకృతిక భూగోళము<br>ఆచార్య పి. ఎస్. పిచ్చముత్తు | 8-25 | 5-25 |
| 17. ఔషధమూలికలు<br>డాక్టర్ ఎస్. కె. జెయిన్ | 9-00 | 5-75 |

| | మేలుప్రతి రూ. | సాదాప్రతి రూ. |
|---|---|---|
| 18. పశ్చిమబెంగాల్ భూగోళము | | |
| ఆచార్య ఎస్ సి బోస్ | 9-00 | 6-00 |
| 19. హిందూదేశపు భూగర్భశాస్త్రము | | |
| డాక్టర్ ఎ. కె. డే. | 8-50 | 5-25 |
| 20. ఋతుపవనములు | | |
| డాక్టర్ పి. కె. దాస్ | 7-50 | 4-25 |
| 21. రాజస్థాన్ | | |
| డాక్టర్ ధరమ్‌పాల్ | 7-75 | 4-50 |
| 22. హిందూదేశము - సామాన్య అవలోకనము | | |
| డాక్టర్ జార్జ్ కురియన్ | 9-50 | 6-00 |
| 23. అస్సాముయొక్క ఆదిమ ప్రజలు | | |
| (సంపాదకులు) డాక్టర్ ఎస్. బర్కటాకి | 8-00 | 4-75 |
| 24. అస్సాము | | |
| (సంపాదకులు) డాక్టర్ ఎస్. బర్కటాకి | 8-00 | 4-75 |
| 25. ఉత్తర హిందూదేశపు దేవాలయములు | | |
| శ్రీకృష్ణదేవర్ | 7-50 | 4-00 |
| 26. స్థావరముల వ్యాధులు | | |
| డాక్టర్ ఆర్. ఎస్. మాధుర్ | 8-00 | 4-75 |
| 27. ఫలములు | | |
| ఆచార్య రంజిత్ సింగ్ | 9-25 | 5-75 |